ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
మహబూబ్‌నగర్
: fb.com/vaartha Digital
Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
15-10-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 256 పేజీలు: 10+4 వెల: 6.50



2 ఉప్పల్ టి20లో భారత్ ఓటమి
24 పరుగుల తేడాతో విండీస్ విజయం

# కరెంటు ఆపితే కట్‌చేస్తా

**రైతులకు ఇచ్చే విద్యుత్‌లో కోతలు రానివ్వకండి**
**తేడా వస్తే స్పెషల్ సిఎస్, జెన్‌కో సిఎండిపై సస్పెన్షన్ చర్య**
తీవ్రంగా హెచ్చరించిన సిఎం రేవంత్ రెడ్డి
వచ్చే జూన్ దాకా పకడ్బందీ ప్రణాళిక ఇవ్వండి
అప్రమత్తం కాకపోతే ప్రమాదంలో పడతాం:
ఎల్‌నినో ప్రభావంపై సమీక్షలో సిఎం
నేటి సాయంత్రం మంత్రులతో ప్రత్యేక సమావేశం



బుధవారం హైదరాబాద్‌లో సమీక్షలో సిఎం రేవంత్

**హైదరాబాద్,అక్టోబరు14,ప్రభాతవార్త:** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ సరఫరా చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ కొరత కారణంగా రైతులు >>2

## 'పాలమూరు'ను పూర్తి చేసి తీరుతాం

చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం: మంత్రి జూపల్లి
బాహుబలి మోటార్లు ప్రారంభించిన మంత్రి 7



బుధవారం నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద బాహుబలి మోటార్ల ద్వారా విడుదలవుతున్న నీరు

## హైదరాబాద్‌లో 24న కాంగ్రెస్ బహిరంగ సభ 3



## ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే సర్కార్ లక్ష్యం

**తెలంగాణలో పుట్టడమే అదృష్టంగా భావించేలా సంక్షేమ పథకాలు.. కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గిస్తున్నాం..**
**మన్ననూర్‌లో సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన డి.సిఎం భట్టి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పుట్టడమే అదృష్టంగా భావించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో రూ.53.78 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 220/30 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న ఆర్థిక సహాయం, రైతుల సంక్షేమం, మహిళలకు కల్పిస్తున్న సౌకర్యాలు, యువతకు ఉద్యోగం,ప్రజల అవసరాలను గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సంక్షేమం అనేది కేవలం కొన్ని వర్గాలకే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు.ప్రజల జీవన ప్రయాణంలోని వివిధ దశల్లో ప్రభుత్వ సహకారం అందేలా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాలను అమలు చేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రజల కొనుగోలు శక్తి పెరగడం, కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గడం, ప్రాథమిక అవసరాలను తీర్చుకోవడంలో పేదలకు వెసులుబాటు కలగడం వంటి అంశాలకు సంక్షేమ కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన వివరించారు. ఆహార భద్రత నుంచి ఆరోగ్య సంరక్షణ వరకు, రైతుల సంక్షేమం నుంచి మహిళల ప్రయాణ సౌకర్యాల వరకు పలు రంగాల్లో ప్రభుత్వం కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఆహార భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు.



## కేంద్రం దసరా కానుక

రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్ 2
కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

## మేడిగడ్డ పునర్నిర్మాణం?



**రూ.700 కోట్ల నుంచి రూ.2,500 కోట్లకు ఎగబాకిన మరమ్మతు అంచనా**
**85 పిల్లర్ల పొడిగింపు.. కొత్త స్టిల్లింగ్ బేసిన్లు**
15 రోజుల్లో సమగ్ర డిజైన్లు
ఢిల్లీలో జరిగిన టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీలో నిపుణుల మేధోమథనం

**హైదరాబాద్, అక్టోబరు 14,ప్రభాతవార్త:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, సుందిళ్ళ అన్నారం బ్యారేజీల మరమ్మతులు అంత సులభంగా పూర్తయ్యేలా కనిపించడం లేదు.మేడిగడ్డతోపాటు సుందిళ్ల, అన్నారం బ్యారేజీల మరమ్మతులన్నింటికీ కలిపి మొత్తం వ్యయం రూ. 2,500కోట్లు లేదాఅంతకంటే ఎక్కువకు చేరవచ్చని నిపుణులు లెక్కగట్టారు. కాళేశ్వరం బ్యారేజిలు వచ్చే వర్షాకాలం నాటికి కూడా >>2





బుధవారం విజయవాడ దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్రపతి ముర్ము

# కరెంటు ఆపితే కట్‌చేస్తా

>> పంట నష్టపోకూడదని హెచ్చరించారు. వ్యవసాయానికి విద్యుత్ అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అందుకు అనుగుణంగా సరఫరా పెంచాలని సూచించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరాపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో బుధవారం సాయంత్రం ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలవారీగా ప్రస్తుత పరిస్థితులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సాఫీగా జరిగేలా చూడాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు ఎందుకు రావడం లేదని అధికారులను నిలదీశారు. రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినా యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో పూర్తి సామర్థం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ఆరా తీశారు. 'ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది నేను. రైతుల పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితి మారలేదు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను సహించేది లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు' అని సిఎం తీవ్రంగా హెచ్చరించారు. అవసరమైతే విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీ.. సంబంధిత విభాగపు ఐఎఎస్ లను సస్పెండ్ చేస్తానని మండిపడ్డారు. విద్యుత్ అంతరాయాలకు రోజుకో కారణం చెప్పవద్దని హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కోవిడ్ తరహా విపత్తుగా పరిగణించి అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పుడు సాధారణ సమస్యగా కనిపిస్తున్న పరిస్థితులు ముందస్తు చర్యలు చేపట్టకపోతే తీవ్ర సంక్షోభంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 'ల్‌నినో కోవిడ్ లాంటి విపత్తు. ఈ పరిస్థితి ఎప్పటివరకు ఉంటుందో ఎవరికీ తెలియదు. ఇప్పుడు సమస్యగా కనిపిస్తోంది. అప్రమత్తం కాకపోతే సంక్షోభంగా మారుతుంది. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో ఎల్‌నినో ప్రభావాన్ని లోతుగా అంచనా వేయాలి. ఈ పరిస్థితులు ఎంతకాలం కొనసాగుతాయో చెప్పలేమని, మళ్లీ వానలు వచ్చే వరకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్నిచర్యలు చేపట్టాల్సిందేనన్నారు. వచ్చే జూన్‌వరకు ప్రతి శాఖ పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రాబోయే సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సరఫరా సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణ రంగంతో పాటు ఇతర అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో (ఎస్టీపీలు) శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో పశువులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి గ్రూప్-1, గ్రూప్-2 స్థాయి అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయా మండలాల్లో వర్షాభావ పరిస్థితులు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంటలు, పశుగ్రాసం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించే బాధ్యతలను వారికి అప్పగించాలని సూచించారు. సంబంధిత మండలాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కి నివేదించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ఒక విపత్తని, దీని ప్రభావం, రాబోయే సంక్షోభ పరిస్థితులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. దసరా తర్వాత దీపావళి వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కళాజాతల ద్వారా ప్రజలకు ఎల్‌నినో ప్రభావాన్ని వివరించాలని, నీరు, విద్యుత్ పొదుపుతో పాటు రాబోయే పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని వర్గాల ప్రజలకు ఈ విపత్తు తీవ్రతను వివరించాలని ఆదేశించారు. మళ్లీ వర్షాలు వచ్చే వరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కాగా, ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో పరిస్థితులపై చర్చించేందుకు మంత్రులతో గురువారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

# కేంద్రం దసరా కానుక

### రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్

### ఒక్కో ఉద్యోగికి గరిష్టంగా రూ.17,951 లబ్ధి

### దివ్యాంగ పెన్షన్లకు కనీస వయోపరిమితి ఎత్తివేత

### కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ, అక్టోబరు 14:** ప్రతి సంవత్సరం దుర్గా పూజ, దసరా పండుగల వేళ రైల్వే ఉద్యోగులు ఆత్రుతగా ఎదురుచూసే శుభవార్త రానే వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 11.40 లక్షల మంది రైల్వే సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం భారీ తీపి కబురు అందించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్.. అర్హులైన రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనంతో సమానమైన బోనస్‌ను ఆమోదించింది. ఇందుకోసం కేంద్ర మొత్తం రూ.2,009.61 కోట్లు విడుదల చేయనుంది. ఈ పండుగ బోనస్ ద్వారా మొత్తం 11,40,770 మంది నాన్‌గెజిటెడ్ రైల్వే ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. అర్హత కలిగిన ప్రతి ఉద్యోగికి గరిష్టంగా రూ. 17,951 బోనస్ రూపంలో అందనుంది. రైల్వే సిబ్బంది కనబరిచిన అద్భుత పనితీరుకు గుర్తింపుగా ఈ బోనస్‌ను ఆమోదించినట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ తెలిపారు. ఈ ప్రోత్సాహకం రాబోయే రోజుల్లో రైల్వే సేవలను మరింత మెరుగుపరిచేందుకు ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని ప్రభుత్వం ఆశాభావంవ్యక్తం చేసిందన్నారు. మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన మీడియాతూ మాట్లాడుతూ, కేబినెట్ నిర్ణయాలు వివరించారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారతీయ రైల్వే రికార్డు స్థాయి ప్రదర్శన నమోదు చేసింది. ఏకంగా 1,670 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు, దాదాపు 7.41 బిలియన్ల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చింది. ఈ నేపథ్యంలోనే రైల్వే ఉద్యోగులకు బోనస్ ప్రకటించినట్లు తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే.. (2025 సెప్టెంబరు 24న) కూడా కేంద్ర కేబినెట్ 10,91,146 మంది ఉద్యోగులకు రూ.1,865.68 కోట్ల వ్యయంతో 78 రోజుల బోనస్‌ను మంజూరు చేసింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి ప్రభుత్వం వెచ్చించే బోనస్ మొత్తం రూ.143.93 కోట్లు పెరిగింది (సుమారు 7.7 శాతం పెరుగుదల). అంతేకాకుండా.. ఈ యేడాది అదనంగా 49,600 మంది ఉద్యోగులు (దాదాపు 4.5 శాతం అధికం) లబ్ధి పొందనున్నారు. అయితే.. 78 రోజుల పరిమితితో పాటు ప్రతి ఉద్యోగికి చెల్లించే గరిష్ట పరిమితి (రూ.17,951) గత యేడాదితో పోలిస్తే ఎలాంటి మార్పు లేకుండా యథాతథంగా కొనసాగింది.

**దివ్యాంగ పెన్షన్లు.. పుట్టినప్పటినుంచే అర్హులు!**

దివ్యాంగ పెన్షన్లపై కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో 80శాతం అంగవైకల్యం ఉన్నవారికి దివ్యాంగ పెన్షన్లు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ కండీషన్‌లో కేంద్రం కీలక మార్పు చేసింది. ఇకపై 40శాతం అంగవైకల్యం ఉన్నా పెన్షన్ ఇవ్వనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అలాగే దివ్యాంగుల పెన్షన్‌కు కనీస వయోపరిమితిని ఎత్తివేస్తున్నామని, పుట్టినప్పటి నుంచే వారు పెన్షన్ స్కీమ్ పరిధిలోకి వస్తారని స్పష్టం చేశారు. దివ్యాంగ పెన్షన్లకు అర్హులైన వైకల్య శాతం తగ్గించడంతో లబ్ధిదారుల సంఖ్య పెరుగుతుందని, దీనివల్ల వారికి సామాజిక భద్రత లభిస్తుందని అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

# మేడిగడ్డ పునర్నిర్మాణం?

>> అందుబాటులోకి రాకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. కుంగిపోయిన ఏడో బ్లాక్ ను బలోపేతం చేసి యథాతథంగా నిలబెట్టడం కంటే, దెబ్బతిన్న భాగాలను తొలగించి తిరిగి నిర్మించడమే సరైన మార్గమన్న అభిప్రాయం సాంకేతిక నిపుణుల కమిటీలో వ్యక్తమైనట్లు తెలిసింది. మేడిగడ్డ మూడేళ్ళ క్రితం కుంగిపోయి కూలిపోవడంతో మరమ్మతుల డిజైన్లను పరిశీలించేందుకు ఏర్పాటైన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ (టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీ–టిఒసి) బుధవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. మరమ్మతుల రూపకల్పనకు సంబంధించిన ప్రాథమిక విధానాలకు సూత్రప్రాయ ఆమోదం తెలిపిన కమిటీ, తెలంగాణ నీటిపారుదల శాఖ నుంచి సమగ్ర ఇంజినీరింగ్ డ్రాయింగులను కోరినట్లు తెలిసింది. ఈ పనులతోపాటు బ్యారేజీ దిగువన కొత్త స్టిల్లింగ్ బేసిన్ల నిర్మాణం, కట్‌ఆఫ్ వాల్స్ ఏర్పాటు, మొత్తం 85 పిల్లర్లను కొత్త స్టిల్లింగ్ బేసిన్ల చివరి వరకు పొడిగించడం వంటి కీలక పనులు చేపట్టాల్సి ఉంటుంది. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా బ్యారేజీని పటిష్ఠం చేయడమే లక్ష్యంగా మరమ్మతుల డిజైన్లను రూపొందిస్తున్నట్లు సమాచారం. మేడిగడ్డ బ్లాక్-7లోని కొన్ని పిల్లర్లకు తీవ్ర పగుళ్లు ఏర్పడటంతోపాటు, రాఫ్ట్ భాగం నదీ గర్భంలోకి కుంగిపోయింది. తొలుత ప్రస్తుత నిర్మాణాన్ని బలోపేతం చేసి మరమ్మతులు చేయడంపై పరిశీలన జరిగినప్పటికీ, ఇప్పుడు దెబ్బతిన్న భాగాలను పూర్తిగా తొలగించి మొదటి నుంచి పునర్నిర్మించాలన్న ఆలోచనకు ప్రాధాన్యం పెరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ విధానంలో దెబ్బతిన్న నిర్మాణ భాగాలను తవ్వి తొలగించడం, అనంతరం పునాదుల స్థాయి నుంచి తిరిగి నిర్మించడం వంటి క్లిష్టమైన పనులు చేపట్టాల్సి ఉంటుంది. దీంతో నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ–పిఇఎస్ జెవితో ఈ అంశంపై విస్తృతంగా చర్చించాలని సాంకేతిక పర్యవేక్షణ కమిటీ నీటిపారుదల శాఖ అధికారులకు సూచించినట్లు సమాచారం. మేడిగడ్డ మరమ్మతుల్లో బ్లాక్-7 పునర్నిర్మాణంతోపాటు అనేక అనుబంధ పనులు చేపట్టాల్సి ఉంది. బ్యారేజీ దిగువన నీటి వేగాన్ని తగ్గించే కొత్త స్టిల్లింగ్ బేసిన్ల నిర్మాణం, పునాదుల కింద నీటి ప్రవాహం వల్ల ఏర్పడే సమస్యలను నియంత్రించే కట్‌ఆఫ్ వాల్స్ ఏర్పాటు ఇందులో కీలకం. అలాగే బ్యారేజీలోని మొత్తం 85 పిల్లర్లను కొత్త స్టిల్లింగ్ బేసిన్లు ముగిసే ప్రాంతం వరకు పొడిగించాల్సి ఉంటుందని ప్రతిపాదించారు.

ఈ మార్పులన్నీ బ్యారేజీ పునాదులు, దిగువ నదీ గర్భం, నీటి ప్రవాహం మధ్య సమన్వయాన్ని మెరుగుపరిచేలా రూపొందిస్తున్నట్లు సమాచారం. అయితే తుది ఇంజినీరింగ్ డ్రాయింగులు, సాంకేతిక పరిశీలన అనంతరమే మరమ్మతుల పూర్తి స్వరూపం స్పష్టమవుతుంది. టిఒసి సమావేశంలో నీటిపారుదల శాఖ ఇంజినీర్లతోపాటు పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సిడబ్ల్యూపిఆర్ఎస్)తో పనిచేసిన నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కన్సల్టెంట్ ఆఫ్రీ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిసింది. మేడిగడ్డలోని మిగిలిన మరమ్మతుల భాగాలకు సంబంధించిన సమగ్ర ఇంజినీరింగ్ డిజైన్లను సుమారు రెండు వారాల్లో సిద్ధం చేయాలని సూచించినట్లు సమాచారం. ఆ డ్రాయింగులను మరోసారి టిఒసి పరిశీలించనుంది. అవసరమైతే కొన్ని మార్పులు, చేర్పులు చేసిన అనంతరం తుది రూపకల్పన ఖరారయ్యే అవకాశం ఉంది. వచ్చే ఏడాది వర్షాకాలం ప్రారంభానికి ముందే, అంటే 2027 జూన్‌లోగా మరమ్మతులు పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తాజా ప్రతిపాదనలు సవాల్‌గా మారే అవకాశముంది. బ్లాక్-7 దెబ్బతిన్న భాగాలను తొలగించి తిరిగి నిర్మించడానికే ఏడాది నుంచి రెండేళ్ల వరకు పట్టవచ్చని సంబంధిత వర్గాల అంచనా. దీంతో మేడిగడ్డ మరమ్మతులన్నీ జూన్ 2027 నాటికి పూర్తవుతాయన్న లక్ష్యం వాస్తవ రూపం దాల్చడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులకు తొలుత సుమారు రూ.700 కోట్లు అవసరమవుతాయని భావించారు. అయితే బ్లాక్-7ను పెద్ద ఎత్తున తొలగించి పునర్నిర్మించాల్సి వస్తే ఖర్చు గణనీయంగా పెరిగే అవకాశముంది. మేడిగడ్డతోపాటు సుందిళ్ల, అన్నారం బ్యారేజీల మరమ్మతులన్నింటికీ కలిపి మొత్తం వ్యయం రూ.2,500 కోట్లు లేదా అంతకంటే ఎక్కువకు చేరవచ్చని సంబంధిత వర్గాల అంచనా. ఇవి ప్రాథమిక అంచనాలు మాత్రమే. తుది డిజైన్లు, పనుల పరిధి, ఇంజినీరింగ్ అంచనాలు ఖరారైన తర్వాతే అధికారిక వ్యయం స్పష్టమవుతుంది. మొత్తంగా.. కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ కేవలం సాధారణ మరమ్మతులకే పరిమితం కావడం లేదు. ముఖ్యంగా మేడిగడ్డ బ్లాక్-7 పునర్నిర్మాణ ప్రతిపాదనతో పనుల సంక్లిష్టత, కాలపరిమితి, వ్యయం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాంకేతికంగా పటిష్ఠమైన నిర్మాణాన్ని రూపొందించడమే లక్ష్యమైనప్పటికీ, తుది డిజైన్లు, పనుల షెడ్యూల్, ఖర్చు అంచనాలు ఖరారయ్యే వరకు మరమ్మతుల పూర్తి గడువుపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

# పెట్టుబడులకు పూర్తి భద్రత

### మంచి పాలసీలతో వచ్చే వారికి ప్రోత్సాహం

### అభివృద్ధివైపు నవతరం పరుగులు

### సమాఖ్య గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 14:** తెలంగాణ రాష్ట్రాన్ని అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా యువత, మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ రైజింగ్- 2047లో నిర్దేశించిన ప్రణాళికలోని పెరి అర్బన్ రీజియన్‌లో స్టార్టప్‌లు, ఇతర పరిశ్రమలను ఏర్పాటు చేయడంలో యువ పారిశ్రామికవేత్తలు ఈ అద్భుతమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. బుధవారం సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య గ్లోబల్ బిజినెస్ సమ్మిట్-2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. కొత్త తరాన్ని అభివృద్ధివైపు నడిపించాలన్న ఆలోచనలతో పనిచేస్తోందంటూ సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఈ సందర్భంగా అభినందించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రకరకాల ఆలోచనలు, ప్రపంచంలో జరుగుతున్న అభివృద్ధి, వస్తున్న నూతన విధానాలను సంపూర్ణంగా యువత తరానికి అందించాలంటే, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలే కాకుండా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, చట్టాలను కూడా అవగాహన కల్పించుకోవలసిన అవసరం ఉందని చెప్పారు. 'యువతకు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, నూతన విధానాలు, చట్టాలపై అవగాహన కల్పించడంలో సమాఖ్యలు, చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించే సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయి. ఒకే వేదికపై వివిధ రంగాల అనుభవజ్ఞులను కలుసుకోవడం, వారి ఆలోచనలు, అనుభవాల నుంచి నేర్చుకోవడం ద్వారా యువతకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు పారిశ్రామిక, రాజకీయ, న్యాయ, సినీ రంగాల్లో సాధించిన విజయాలను నమోదు చేసి భవిష్యత్ తరాలకు అందించడం ద్వారా యువతకు స్ఫూర్తినివ్వవచ్చు. భారతదేశానికి 2047 అత్యంత ప్రాధాన్యత కలిగిన సంవత్సరం. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి దేశం సాధించిన ప్రగతిని సమీక్షించుకోవడంతో పాటు, భవిష్యత్ లక్ష్యాల సాధనకు స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగాలి. భారత్‌ను 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రభుత్వం 2025లో తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి, రాష్ట్ర అభివృద్ధికి నిర్దిష్ట లక్ష్యాలను రూపొందించడంతో పాటు తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. రాష్ట్రాన్ని మూడు ప్రాంతీయ ఆర్థిక విభాగాలుగా విభజించి, ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, జనాభా, వనరులకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాం' అని చెప్పారు. దేశ జనాభాలో రాష్ట్ర వాటా 2.5శాతమే అయినా జీడిపిలో 5 శాతం తెలంగాణ నుంచే అందిస్తున్నామని చెప్పారు. 2047 నాటికి దేశ జీడిపిలో తెలంగాణ వాటాను 10శాతానికి పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదని, మంచి పాలసీతో ఎవరు వచ్చినా ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. 'ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని సుమారు 2,100 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో 1.34 కోట్ల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)ను గుర్తించాం. ఈ ప్రాంతంలోని కాలుష్యకారక పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన రాయితీలు, అనుమతులు, ఇతర సహకారం అందించాలనే ఉద్దేశంతో హిల్ట్ పాలసీని తీసుకొచ్చాం అని చెప్పారు. 'పరిశ్రమల తరలింపు ప్రక్రియలో పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందిస్తున్నాం. హైదరాబాద్ అభివృద్ధిలో ఓఆర్ఆర్ కీలక పాత్ర పోషించింది' అని చెప్పారు. ఈ సదస్సులో ఎపి శాసనసభ డి.స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎంపీలు డాక్టర్ కె లక్ష్మణ్, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



బుధవారం గోదావరిఖనిలో సింగరేణి కార్మిక గర్జన సభలో మాట్లాడుతున్న కెటిఆర్

# సింగరేణిని దోచుకుంటున్నారు..

### బొగ్గు ఉత్పత్తి పతనం.. రూ. 6 వేల కోట్ల బకాయిలు

### కార్మిక గర్జన సభలో సర్కార్‌పై విరుచుకుపడిన కెటిఆర్

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి తగ్గడం, విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా, ప్రభుత్వ బకాయిలు, టెండర్ల జాప్యం, కార్మికుల సంక్షేమం వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు చేశారు. గోదావరిఖనిలోని సింగరేణి స్టేడియంలో బుధవారం బీఆరఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన సభలో ఆయన ప్రసంగించారు. సింగరేణి కార్మికుల హక్కులు, సంస్థ ఆర్థిక పరిస్థితి, బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ సరఫరా, ప్రైవేటీకరణ ఆందోళనలు, పెండింగ్ సమస్యలపై పలు అంశాలను ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలతో పాటు గత బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో విద్యుత్ స్థాపిత సామర్థం 7,778 మెగావాట్లు మాత్రమే ఉండేదని కేటీఆర్ తెలిపారు. అప్పట్లో పరిశ్రమలకు విద్యుత్ సెలవులు, వ్యవసాయ మోటార్లకు తక్కువ వోల్టేజీ, విద్యుత్ కోతలు ఉండేవని పేర్కొన్నారు. దిగువ సీలేరు విద్యుత్ కేంద్రంలోని 500 మెగావాట్ల హైడల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో కలిపిందని ఆరోపించారు. కేసీఆర్ నాయకత్వంలో సింగరేణికి బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు నిర్దేశించి, 24 గంటల విద్యుత్ సరఫరాకు అవసరమైన బొగ్గును సమకూర్చుకున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం దిగిపోయే సమయానికి విద్యుత్ స్థాపిత సామర్థం 24 వేల మెగావాట్లకు పెరిగిందని పేర్కొంటూ, ప్రస్తుతం విద్యుత్ కోతలు ఎందుకు పెరుగుతున్నాయని ప్రశ్నించారు. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడానికి సింగరేణి బొగ్గు సరఫరా కావడం లేదని ప్రభుత్వం చెబుతోందని కేటీఆర్ అన్నారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం 4,000 మెగావాట్ల సామర్థంతో నిర్మించినప్పటికీ, ప్రస్తుతం 400 మెగావాట్ల ఉత్పత్తి కూడా జరగడం లేదని ఆరోపించారు. కేటీపీఎస్, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లోని విద్యుత్ కేంద్రాలకూ బొగ్గు కొరత ఉందనే వాదనను ప్రస్తావించారు.

బొగ్గు సరఫరా ఎందుకు తగ్గిందని ప్రశ్నిస్తే సింగరేణి యాజమాన్యం ప్రభుత్వ బకాయిలను ప్రస్తావిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు రూ.60 వేల కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉందని కేటీఆర్ ఆరోపించారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు తగ్గిపోయాయా, కార్మికుల ఉత్పత్తి సామర్థం తగ్గిందా అని ప్రశ్నించిన కేటీఆర్, సంస్థలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందని తమ నాయకులు ఆరోపించారని తెలిపారు. బొగ్గు నిల్వల వివరాలు చూపించాలని అడిగిన తమ నాయకులను అరెస్టు చేశారని ఆరోపించారు. బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, సరఫరాపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2023 డిసెంబరులో తమ ప్రభుత్వం దిగిపోయే సమయానికి సింగరేణి బొగ్గు ఉత్పత్తి 70 మిలియన్ టన్నులుగా ఉందని కేటీఆర్ తెలిపారు.



ఉప్పల్‌లో సెంచరీ (102) అనంతరం షై హోప్

# ఉప్పల్ టి20లో భారత్ ఓటమి

### 24 పరుగుల తేడాతో విండీస్ విజయం

### సిరీస్ సమం చేసిన విండీస్

### 17న బెంగళూరులో చివరి మ్యాచ్

**హైదరాబాద్, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరిగిన నాలుగో మ్యాచ్‌లో విండీస్ గెలుపొందింది. బుధవారం హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్లో 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. సిరీస్‌ను 22తో సమం చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 247/3 స్కోరు చేసింది. కెప్టెన్ హోప్ శతకం (102)తో అదరగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా 223 పరుగులకు పరిమితమైంది. సంజు శాంసన్ (56), తిలక్ వర్మ (43), నితీశ్‌కుమార్ (41) పరుగులు చేశారు. విండీస్ బౌలర్లలో కీమో పాల్ 5 వికెట్లు తీయగా, మోతీ 2, స్ప్రింగర్ 1, షెఫర్డ్ 1 వికెట్ పడగొట్టారు.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 247/3 పరుగులు చేసింది. షై హోప్ 102.. (50 బంతుల్లో), రూథర్‌ఫర్డ్ 49.. పరుగులతో (26 బంతుల్లో) సత్తా చాటారు. హెట్‌మయర్ 33, రోవ్‌మన్ పావెల్ 24, జువెల్ ఆండ్రూ 21 రన్స్ చేశారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీశారు. ఇన్నింగ్స్ చివరి రెండు బంతుల్లో వరుసగా సిక్స్‌లు కొట్టి షై హోప్ సెంచరీ పూర్తి చేసుకోవడం విశేషం.

## వారం - వర్జ్యం

15-10-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, చిత్త కార్తె,
తి.పంచమి రా.3.26 న.జ్యేష్ఠ పూర్తి
వ. ఉ.10.18-మ.12.05
దు.1. ఉ.9.55-ఉ.10.42
దు.2. మ.2.37-మ.3.24
రాహు మ.1.30-మ.3.00
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** మీ మాటల నైపుణ్యంతో పలువురి ప్రశంసలను అందుకుంటారు. చెల్లింపులకుగాను వత్తిడి అధికమవుతుంది.

**వృషభం :** చిన్నపాటి అవరోధాలను అవలీలగా అధిరోహించగలుగుతారు. తనఖా వస్తువులను విడిపిస్తారు.

**మిథునం :** దూరప్రాంతంలోని మీ వారి యోగక్షేమాలను విచారిస్తారు. ప్రయోజనాలను పరిరక్షించు కోవడం కష్టసాధ్యంగా పరిణమిస్తుంది.

**కర్కాటకం :** సహోద్యోగులతో సఖ్యతను పెంచుకుంటారు. కలిసొచ్చేకాలం కోసం ఊహాలోకాలలో విహరిస్తారు.

**సింహం :** సాధారణమైన విషయాల గురించి కూడా దీర్ఘంగా ఆలోచిస్తారు. రహస్య ఋణాలు చేస్తారు. మంచి పేరు ప్రఖ్యాతలను సాధిస్తారు.

**కన్య :** ఆరోగ్యం నలతగా ఉంటుంది. నిర్ణయాలు అమలు పరిచేటప్పుడు నిష్ణాతుల సలహాలను తీసుకోండి.

**తుల :** సినీ, కళారంగాలలోని వారికి ఊరటను కలిగించే పరిణామాలు చోటు చేసుకుంటాయి.

**వృశ్చికం :** ఆంతరంగిక చర్చలు జరిగేచోట కొత్తవారికి ప్రవేశం కల్పించకండి. పార్ట్ టైం జాబ్ వర్క్‌లు కలిసి వస్తాయి.

**ధనుస్సు :** ఇతరులు నేడు మీ నుండి సలహాలను, సూచనలను ఎక్కువగా తీసుకుంటారు. ఉత్తరప్రత్యుత్తరాలను సాగిస్తారు.

**మకరం :** మోకాళ్ళు లేక వెన్ను నొప్పి బాధిస్తుంది. కుటుంబ అవసరాలపైన ఎక్కువగా దృష్టిని కేంద్రీకరిస్తారు.

**కుంభం :** స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండటమే పరోక్ష లాభంగా పరిణమిస్తుంది. దైవ దర్శనం చేసుకుంటారు.

**మీనం :** స్థిరాస్తులను పెంపొందించుకోవడానికి గాను ప్రాముఖ్యతనిస్తారు. వాహన యోగ సూచన.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

### జగన్ అక్రమాస్తుల కేసుల్లో కీలక పరిణామం

## సిబిఐ, ఇడి కేసుల రోజువారీ విచారణకు నాంపల్లి సిబిఐ కోర్టు నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన ఎపి మాజీ సిఎం వై.ఎస్ జగన్ అక్రమాస్తులకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. జగన్ అక్రమాస్తులపై సిబిఐ. ఈడీ నమోదు చేసిన కేసులను రోజువారిగా విచారించేందుకు నాంపల్లిలోని సిబిఐ కోర్టు ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి ఇడి అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం అంగీకరించింది. ఈడీ పిటిషన్‌ను సిబిఐ కోర్టు ఆమోదం తెలపడంతో జగన్ అక్రమాస్తుల కేసులో నిందితులను న్యాయస్థానం రోజువారిగా వ్యక్తిగతంగా విచారించనుంది. ఉమ్మడి ఎపి హయాంలో 2010లో జగన్ అక్రమాస్తులకు సంబంధించి మొదట సిబిఐ కేసు నమోదు చేయగా ఇదే కేసులో జగన్ అరెస్టయి 16 నెలల పాటు చంచల్‌గూడ జైల్లో రిమాండులో వుండడం తెలిసిందే. జగన్‌తో పాటు నాటి వైకాపా నేత విజయసాయి రెడ్డి సహా మరికొందరు నాయకులు, బ్యూరోక్రాట్లు కూడా జైలు జీవితం గడిపారు. దీని తరువాత మనీలాండరింగ్ కోణంలో ఈడీ వేరుగా మరో కేసు నమోదు చేసి వి చారణ చేబట్టింది. అయితే జగన్ అక్రమాస్తులపై రెండు కేంద్ర దర్యాప్తు సంస్థలు వేరు వేరుగా విచారణ సాగిస్తున్నాయి. ఇదే సమయంలో డి శ్చార్జి పిటిషన్లు దశాబ్ద కాలంగా పెండింగ్‌లో వుండడంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన సత్వర విచారణ హక్కు ప్రకారం, ఈ కేసులను రోజువారి ప్రాతిపదికన విచారించాలని ఈడీ అధికారులు నాలుగు రోజుల క్రితం సిబిఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో లోతైన కుట్రలతో పాటు వేల కోట్ల రూపాయల ప్రజాధనం లూటీ వంటి ఆర్థిక నేరాలకు సంబంధించిన అనేక అంశాలు వున్నాయని ఈడీ తన పిటి షన్‌లో వెల్లడించింది. ఈ తరహా కేసులను తీవ్రమైనవిగా పరిగణించాలని గతంలో సుప్రీం కోర్టు పేర్కొన్న అంశాన్ని ఈడీ ఉదహరించింది. ఈ నేపథ్యంలోనే నాంపల్లి సిబిఐ కోర్టు జగన్ అక్రమాస్తులకు సంబంధించి సిబిఐతో పాటు ఈడీ కేసులను రోజువారిగా విచారించేందుకు నిర్ణయిం చింది. సిబిఐ కోర్టు నిర్ణయంతో ఈ కేసులో నిందితులుగా వున్న 70 మంది నిందితులను వ్యక్తిగతంగా న్యాయస్థానం విచారించనుంది.



బుధవారం ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న జస్టిస్ చంద్రకుమార్

## ఆదివాసీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### ఆదివాసి ఆత్మఘోష మహాధర్నాకు మద్దతు తెలిపిన జస్టిస్ చంద్రకుమార్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), అక్టోబరు 14, ప్రభాతవార్త:** తెలంగాణ ఆదివాసీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఆదివాసి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివాసి ఆత్మఘోష పేరుతో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జస్టిస్ చంద్రకుమార్, తుడుందెబ్బ జాతీయ అధ్యక్షులు పట్టం ఉపేందర్, జేఏసీ నాయకులు జి.వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దరలు హాజరై మాట్లాడుతూ భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి జీవ వైవిధ్య పరిరక్షణకు, పర్యావరణ సమతుల్యాలకు ఆదివాసీలే మూల స్థంభాలని గుర్తు చేశారు. తెలంగాణలోని ఐదవ షెడ్యూల్ ప్రాంతాలలో చారిత్రాత్మక భాషా, సాంస్కృతిక, ఆచార సాంప్ర దాయాలకు పునాదిగా ఆదివాసీ తెగలు నివసిస్తున్నారని, ప్రస్తుత వ్యవస్థాగతమైన నిర్ణయాలు, నిరంతరం పెరుగుతున్న దాడుల కారణంగా ఆదివాసీల మనుగడ ప్రమాదంలోకి నెట్టబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ జాబితా నుంచి లంబాడీలను తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమీషన్ ఏర్పాటుచేయాలని, ఎస్టీ ఉమ్మడి జాబితాలో ఆదివాసీలకు తీవ్ర నష్టం జరుగుతోందని వారు స్పష్టం చేశారు. ఆర్టికల్ 342 ప్రకారం ఎలాంటి శాస్త్రీయ విచారణ లేకుండా 1976లో ఏరియా రిస్ట్రిక్షన్ యాక్ట్ తొలగింపు కారణంగా స్థానికత లేని సంచార జాతులను ఎస్టీ జాబితాలో చేర్చటం వల్ల ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ పాఠశాలలో స్థానిక ఎస్టీ ఉపాధ్యాయులకు వంద శాతం రిజర్వేషన్ కల్పించే జీవో నెంబర్ 3ను 2020లో సుప్రీంకోర్టు రద్దు చేయటం వల్ల ఆదివాసీ యువత ఉద్యోగావకాశాలు కోల్పోయారని, గిరిజన భాషలో ప్రాథమిక విద్య అందకపోవటం వల్ల విద్యార్థుల డ్రాపౌట్ల సంఖ్య పెరిగిపోయిందని తెలిపారు.ఏజెన్సీ భూములను వాణిజ్య ఆస్తులుగా విక్రయించటానికి 1-70చట్టాన్ని సవరించాలని కోరుతూ ఇటీవల 1672మంది గిరిజ నేతరులు సుప్రీం కోర్టులో వేసిన కేసుపై కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ పక్షాన కౌంటర్ పిటీషన్ దాఖలు చేసి, ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవేందర్, తుడుందెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సి.వి ఆనంద్‌తో భేటీ అయిన అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్. చిత్రంలో ఇతర అధికారులు ఉన్నారు.

## డిజిపితో భేటీ అయిన అమెరికా కాన్సల్ జనరల్

**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ బుధవారం డిజిపి సి.వి ఆనంద్‌తో భేటీ అయ్యారు. డిజిపి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా జరిగిన ఈ భేటీలో పలు అంశాలపై ఇద్దరు చర్చించారు. ఈ భేటీలో లారా విలియమ్స్ వెంట రీజినల్ సెక్యూరిటీ ఆఫీసర్ సిద్దార్థ రాంచంద్రన్, సీనియర్ ఫారిన్ సర్వీస్ నేషనల్ ఇన్వెస్టిగేటర్ వెంకట్ తదితరులున్నారు.

## మూత మింగి 9 నెలల బాలుడు మృతి



ఆర్యవర్ధన్(ఫైల్)

**నారాయణపేట, అక్టోబరు 14 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఉట్కూర్ గ్రామంలో వాటర్ బాటిల్ మూతను మింగిన తొమ్మిది నెలల బాలుడు మృత్యువాత పడిన విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దేవినగర్ వీధికి చెందిన లక్ష్మణ్, గాయత్రి దంపతుల కుమారుడు ఆర్యవర్ధన్ (9 నెలలు) ఇంట్లో ఆడుకుంటున్నాడు. ఆడుకుంటూనే పక్కనే ఉన్న వాటర్ బాటిల్ మూతను నోట్లో పెట్టుకున్నాడు. అది గొంతులో ఇరుక్కుని ఊపిరాడక తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పరి స్థితి విషమిం చడంతో చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కొడుకు అకాల మరణంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బిసి,ఇబిసి విద్యార్థులకు విదేశీ విద్య కోసం గడువు పెంపు

**హైదరాబాద్,అక్టోబరు14,ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీసీ, ఈబీసీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వంపొడిగించింది. ఈనెల 15 నుంచి 31వరకు దరాఖస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. 2026 ఫాల్ సెషన్‌లో విదేశాల్లో చదవాలనుకునే అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఈ పథకం ద్వారా విదేశాల్లో మాస్టర్స్, డాక్టోరల్ కోర్సుల కోసం విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. ఇందు కోసం దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షలలోపు ఉండాలి. దరఖాస్తుదారుల వయస్సు 35ఏళ్లకు మించకూడదు. గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60శాతం మార్కులు తప్పనిసరి. విదేశీ విద్యకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 260 లేదా జిఎంఏటిలో 550 స్కోర్ సాధించి ఉండాలి. అలాగే టోఫెల్ 60 లేదా ఐఇఎల్‌టిఎస్ 6.0 లేదా పిటిఈ 50 స్కోర్ కలిగి ఉండాలి. అర్హులైన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

# కడప ఎంపి అవినాష్ రెడ్డి విచారణ

## వివేకా హత్యకేసులో కొనసాగుతున్న ఇడి దర్యాప్తు

**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) విచారణ వేగంగా కొనసాగుతోంది. ఈ కేసులో 40 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగినట్లు నిర్ధారణ అవడంతో మనీలాండరింగ్ కోణంలో సాగుతున్న ఈడీ విచారణకు బుధవారం నాడు కడప ఎంపి అవినాష్ రెడ్డి హాజరయ్యారు. అవి నాష్ రెడ్డిని ఐదు గంటల పాటు విచారించిన ఈడీ అధి కారులు గురువారం మరోదఫా విచారణకు రావాలని ఆదేశించారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో ఈడీ అధికారులు వరుసగా నిందితులను విచారి స్తున్నారు. ఈ కేసులో 20 రోజుల వ్యవధిలో ఎ1గా వున్న ఎర్ర గంగిరెడ్డి, ఎ2గా వున్న సునీల్ యాదవ్, అప్రూవర్‌గా మారిన దస్తగిరితో పాటు ఎ5గా వున్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డిని, ఎ 6గా వున్న భాస్కర్ రెడ్డిని గంటల తరబడి విచారించిన ఈడీ అధికారులు బుధవారం ఎంపి అవినాష్ రెడ్డిని సుధీర్ఘంగా విచారించారు. ఉదయం 11 గంటల సమయంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి అవినాష్ రెడ్డి రాగా సాయంత్రం నాలుగు గంటల వరకు విచారణ సా గింది. ఈ కేసులో దస్తగిరి, సునీల్ యాదవ్‌లు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా అవినాష్ రెడ్డిని ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఆయన తండ్రి భాస్కర్ రెడ్డిని విచారించిన సమయంలో వెలుగు చూసిన అంశాల ఆధారంగా కూడా అవినాష్ రెడ్డిని ఈడీ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసిం ది. వివేకా హత్య కేసులో నిందితుల గురించి సిబిఐ విచారిస్తుండగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ విచారణ సాగుతుండడం తెలిసిందే. వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులకు 40 కోట్లరూపాయలను చెల్లించినట్లు ఆధారాలు సేకరించిన ఈడీ అధికారులు ఈ డబ్బులు ఏ రూపంలో వచ్చాయి?దీని వెనుక వున్న వారు ఎవరు? అనే అంశాలపై అవినాష్‌రెడ్డిని ప్రశ్నించారని తెలిసింది. 2019లో జరిగిన వివేకానం ద రెడ్డి హత్యకు సంబంధించి 40 కోట్ల రూపాయల సుఫారిపై ఈడీ పక్కా ఆధారాలు సేకరించడం విదితమే.దీనికి సంబంధించి డిజిటల్ ఆధారాలు,బ్యాంకుల నుంచి సమాచార సేకరణ, ఫోన్ కాల్స్‌పై దృష్టి సారించిన ఈడీ అధికారులు ఇదే కోణంలో అవినాష్ రెడ్డిని విచారించిన ట్లు తెలిసింది.

## రక్షణ కాంట్రాక్టు లంచం కేసు: ఎంఐఎల్ సీనియర్ అధికారి అరెస్ట్

**పుణె, అక్టోబరు 14:** రూ.500 కోట్ల సరఫరా కాంట్రాక్టుకు సంబంధించి, అనుకూలాల కోసం లంచాలు తీసుకోవడం, సున్నితమైన రక్షణ సమాచారాన్ని అందించినందుకు మునిషన్స్ ఇండియా లిమిటెడ్ (ఎంఐఎల్) సీనియర్ అధికారిని సిబిఐ అరెస్టు చేసినట్లు అధికారులు బుధవారం తెలిపారు. ఎస్‌ఎంపిపి సిఇఒ ఆశిష్ కన్సల్ పేరును కూడా చేర్చి ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఆ తర్వాత అనిల్ కుమార్‌ను అరెస్టు చేసినట్లు వారు చెప్పారు.

అనిల్ కుమార్ పుణె లోని మునిషన్స్ ఇండియా లిమిటెడ్‌లో ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ (లెవెల్14)గా ఉండగా, కన్సల్ మందు గుండు సామగ్రి తయారీ సంస్థ అయిన ఎస్ ఎంపిపి లిమిటెడ్ సిఇఒ, డైరెక్టర్, ప్రమోటర్‌గా ఉన్నారు. కొంతమంది ప్రైవేట్ కాంట్రాక్టర్లు, విక్రేతలతో కుమ్మక్కై, కుమార్ అధికారికంగా అనుకూలాలు అందిం చినందుకు, అలాగే ఎం ఐ ఎల్ రక్షణ ఉత్పత్తి, సేకరణ, ఇతర వ్యూహా త్మకంగా ముఖ్యమైన కార్యకలాపాలకు సంబం ధించిన సున్నితమైన సమాచారాన్ని వెల్ల డించి నందుకు అక్రమంగా లంచాలు తీసుకున్నారని ఏజెన్సీ ఆరోపించింది.

కుమార్ ప్రస్తుతం పోలీ సుల అదుపులో ఉన్నారని వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలపై ఎస్‌ఎంపిపి నుంచి తక్షణ స్పందన ఏదీ లభించలేదు.

### ఎపి లిక్కర్ స్కాంలో కీలక పరిణామం

## విశ్రాంత ఐఎఎస్ అధికారి రజత్ భార్గవ్‌కు ఇడి నోటీసులు

**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** ఎపిలో సంచలనం రేపిన లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వి శ్రాంత ఐఎఎస్ అధికారి రజత్ భార్గవ్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) బుధవారం నాడు నోటీసులు జారీ చేసింది. వైకాపా హయాంలో ఎపిలో ఎక్సైజ్ శాఖకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రజత్ భార్గవ్ పనిచేయడం తెలిసిందే. అప్పట్లో ఊరుపేరులేని బ్రాండ్లను బ్రాండెడ్ కంపెనీలకు చెందిన మద్యంగా చెప్పుకుని ఎపిలో విక్రయాలు జరిగినట్లు, దీనివల్ల సర్కారు ఖజానాకు 200 కోట్ల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని ఈడీ విచారణలో తేలడం తెలిసిందే. ఈ క్రమంలో కొందరు వైకాపా నాయకులు అరెస్టవడం విదితమే. కాగా ఈ కేసును విచారిస్తున్న ఎపి సిఐడి ఇప్పటికే రజత్ భార్గవ్‌ను విచారించి వాంగ్మూలం నమోదు చేసింది. ఈ కేసులో సిఐడి సిట్ దాఖలు చేసిన ఛా ర్జిషీట్ ఆధారంగా ఈడీ అధికారులు మనీలాండరింగ్ కోణంలో విచారణ చేబట్టి రజత్ భార్గవ్‌ను విచారించాలని నిర్ణయించారు. సిఐడి విచారణ లో వైకాపా హయాంలో అక్రమాలు జరిగినట్లు రజత్ భార్గవ అంగీకరించారని వార్తలు వచ్చాయి. అప్పట్లో సిఎం జగన్ ఒత్తిడి చేయడం వల్లే తాను అడ్డగోలుగా నిర్ణయం తీసుకున్నానని ఆయన చెప్పినట్లు తెలిసింది. మద్యంధరల పెంపుదలను తాను వ్యతిరేకించానని, అయితే నాటి సర్కారు పట్టించు కోలేదని ఆయన వెల్లడించినట్లు వార్తలువచ్చాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం ఉదయం ఆయనకు నోటీసు ఇచ్చిన హైదరాబాద్ ఈడీ అధికారులు సాయంత్రం లోపు విచారణకు రావాలని కోరారు. అయితే సమయాబావం వల్ల ఆయన విచారణకు రాలేదు. గురువారం ఆయన విచారణకు వచ్చే వీలుందని తెలుస్తోంది.

# టన్నుల ప్రాతిపదికన గ్రానైట్ రాయల్టీ ఫీజు

### క్యూబిక్ మీటర్ పద్ధతికి గుడ్‌బై

### ఆదాయానికి గండికొట్టకుండా

### సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రానైట్ వ్యాపారంలోన రవాణా, రాయల్టీలకు సంబంధించి ఖజానా ఆదాయానికి గండిపడకుండా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో గ్రానైట్ తదితర ఖనిజాల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర గనుల శాఖ వెల్లడించింది. బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్‌పై మెట్రిక్ టన్ను ప్రాతిపదికన సీనియరేజ్ ఫీజు ఖరారు చేసింది. 2026 నవంబర్ 1 నుంచి కొత్త గ్రానైట్ ఫీజుల విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తేనుంది. గతంలో ఉన్న క్యూబిక్ మీటర్ కొలత పద్ధతిని మరియు గ్యాంగ్‌సా సైజుల వర్గీకరణను పూర్తిగా తొలగించి, ఇకపై కేవలం మెట్రిక్ టన్ను ప్రాతిపదికన మాత్రమే సీనరేజ్ (రాయల్టీ) ఫీజు వసూలు చేయాలని నిశ్చయించింది. డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ ప్రతిపాదనల మేరకు, గనుల శాఖ కార్యదర్శి ఎం. రఘునందన్ రావు ఈ సవరణ ఉత్తర్వులను జారీ చేశారు. కొత్త విధానంలో రవాణా గమ్యస్థానాన్ని బట్టి ఎక్స్‌పోర్ట్ (ఎగుమతి), డొమెస్టిక్ (స్థానిక వినియోగం) పేరిట రుసుములను నిర్ధారించారు. నూతన గ్రానైట్ ఫీజుల వివరాలు (మెట్రిక్ టన్నుకు) చూస్తే బ్లాక్ గానైట్ రకం ఎగుమతి ఫీజు రూ.1,633 కాగా, స్థానిక వినియోగం (డొమాస్టిక్) ఫీజు రూ.1,633, కలర్ గ్రానైట్‌కు సంబంధించి ఎగుమతి ఫీజు రూ.1.354 డొమాస్టిక్ ఫీజు 1,176గా నిర్ణయించారు. గతంలో టన్నులతో పాటు, క్యూబిక్ మీటర్ల కొలతలు కూడా ఉండటం వల్ల గందరగోళం నెలకొనేదని గనుల శాఖ అధికారులు చెబుతున్నారు. తాజా నిర్ణయంతో రెండు రకాల గ్రానైట్‌లకు కేవలం మెట్రిక్ టన్నుల లెక్కనే ఫీజు వసూలు చేయనున్నారు. ఈ సంస్కరణ ద్వారా మైనింగ్ రంగంలో అక్రమాలకు అడ్డుకట్ట పడటంతో పాటు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సక్రమంగా చేరుతుందని అధికారులు భావిస్తున్నారు.

# సర్ ప్రక్రియపై సుప్రీంలో అసదుద్దీన్ పిటిషన్

### ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ తీరుపై అభ్యంతరాలు!

**హైదరాబాద్,అక్టోబరు14,ప్రభాతవార్త:** దేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇప్పటికే రాజకీయ, న్యాయపరమైన చర్చ మరింత వేడెక్కగా హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఈ ఎస్ఐఆర్ ప్రక్రియను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల సంఘం అధికారాల వినియోగం, ఓటర్ల నమోదు విధానాలు, ఆన్‌లైన్ దరఖాస్తుల్లో మార్పులు, ఓటర్ల పేర్ల చేర్పులు, తొలగింపులకు సంబంధించిన అంశాలపై ఆయన తన పిటిషన్‌లోఅభ్యంతరాలను వెలుగులోకి తీసుకువచ్చారు. అసదుద్దీన్ ఒవైసీ తరఫు న్యాయవాది నిజాముద్దీన్ పాషా ఈ పిటిషన్‌ను బుధవారం రోజున సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఇప్పటికే ఎస్ఐఆర్‌కు సంబంధించి ఇతర పిటిషన్లు విచారణకు రానున్న నేపథ్యంలో.. ఒవైసీ పిటిషన్‌ను కూడా వాటితో కలిపి గురువారం విచారించాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్.. పిటిషన్‌ను పరిశీలించి సంబంధిత కేసులతో కలిపి విచారణకు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌లో ప్రధానంగా ఎన్నికల సంఘం తన రాజ్యాంగ, చట్టబద్ధ అధికారాలను ఏ విధంగా వినియోగిస్తోందనే అంశాలను అసదుద్దీన్ ఒవైసీ లేవనెత్తారు. ఎన్నికల సంఘం నిర్ణయాలు చట్టప్రకారం సమిష్టిగా తీసుకున్నవేనా.. ఓటర్ల నమోదు కోసం చట్టంలో నిర్దేశించిన ఫారాల స్థానంలో సాఫ్ట్‌వేర్ లేదా కార్యనిర్వాహక ఆదేశాల ద్వారా అదనపు నిబంధనలు ప్రవేశపెట్టవచ్చా అనే ప్రశ్నలను ఆయన లేవనెత్తారు. అదే సమయంలో సాఫ్ట్‌వేర్ ద్వారా రూపొందించే గుర్తింపులు, అభ్యంతరాల ఆధారంగా ఓటర్ల అర్హతను నిర్ణయించడం, ఓటర్ల జాబితాల నుంచి పేర్లను తొలగించడం వంటి చర్యలకు చట్టపరమైన పరిమితులు ఉండాలని పిటిషన్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల నమోదు అధికారులు (ఈఆర్వోలు) తమ చట్టబద్ధ బాధ్యతలను స్వతంత్రంగా నిర్వహించాల్సిన అవసరాన్ని కూడా ఈ పిటిషన్‌లో ఒవైసీ ప్రస్తావించారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు సమర్పించే ఫారం6లో ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా అదనపు ప్రకటనను చేర్చడంపై ఒవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టంలోని నిబంధనలకు మించి పోర్టల్ మార్పులు, కార్యనిర్వాహక ఆదేశాల ద్వారా కొత్త షరతులను విధించరాదని ఆయన కోరారు. ఎన్నికల సంఘం ఈసీఐనెట్ పోర్టల్‌లో ఫారం6ను చట్టబద్ధంగా నిర్దేశించిన రూపంలో పునరుద్ధరించాలని, అదనపు ప్రకటనకు సమాధానం ఇవ్వలేదనే కారణంతో ఓటరు నమోదు దరఖాస్తులను తిరస్కరించకూడదని, పెండింగ్‌లో ఉంచకూడదని పిటిషన్‌లో ఒవైసీ అభ్యర్థించారు. అదేవిధంగా సాఫ్ట్‌వేర్ ద్వారా రూపొందించిన గుర్తింపుల ఆధారంగానే ఓటర్లను అనర్హులుగా పరిగణించకూడదని, చట్టబద్ధ విధానాలను ఉల్లంఘించి తొలగించిన పేర్లపై సమీక్ష చేపట్టాలని అసదుద్దీన్ ఒవైసీ తన పిటిషన్‌లో కోరారు. ఓటర్ల జాబితాల నిర్వహణలో ఉపయోగిస్తున్న ఈఆర్ఓనెట్, ఈసీఐనెట్, బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్ఓల) అప్లికేషన్ల పనితీరును పరిశీ లించేందుకు స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని కూడా ఒవైసీ కోరారు. ఓటర్ల పేర్ల చేర్పులు, తొలగింపుల చట్టబద్ధతతో పాటు వాటి ప్రభావాన్ని పరిశీలించి.. భవి ష్యత్తులో లోపాలు జరగకుండా రక్షణ చర్యలను సూచించాలని పిటిషన్‌లో అభ్యర్థించారు.



# హైదరాబాద్‌లో 24న కాంగ్రెస్ బహిరంగసభ

### దక్షిణాదిలోని రెండు రాష్ట్రాలలో సభలు , రెండులక్షల మందితో లాంగ్‌మార్చ్

**హైదరాబాద్, అక్టోబరు14,ప్రభాతవార్త:** దేశ ప్రజాస్వామ్యంకు మరణశాసనం "సర్"తో లిఖిస్తున్న సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలనే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే దిశలో హైదరాబాద్‌లో ఈనెల24న విశాల ప్రజారాశులతో ఇండియా కూటమి ఆధ్వర్యంలో "లాంగ్ మార్చ్"తోపాటు బహిరంగ సభను ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తోన్నది. లౌకికవాదుల ఓట్లు తొలగిస్తూ అధికారం నిలబెట్టుకోవడానికి బిజెపి చేస్తున్న కుట్రను రాష్ట్రాలవారీగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే దిశలో సభలు, ప్రదర్శనలు జరపాలని ఢిల్లీలో రాహుల్‌గాంధీ" హై టీ "సమావేశంలో తీసుకొన్న నిర్ణయం మేరకు హైదరాబాద్ వేదికగా భారీ బహిరంగసభ ఏర్పాటు చేయబోతున్నారు.దసరా తర్వాత రెండు లక్షల మంది తో మార్చ్ తో పాటు భారీ బహిరంగ ససభ నిర్వహించాలని రాహుల్ గాంధీ కెసిఆర్ వేణుగోపాల్ చెప్పారు. దక్షిణాది రెండు రాష్ట్రాలలో సభ లు నిర్వహించాలని హై కమాండ్ నిర్ణయం. దేశ ప్రజలను ప్రజాస్వామ్యం పరిక్షణ కోసం ఉద్యమానికి సమీకరించడానికి జరిగే ఈ పోరాటంను ప్రతిష్టాత్మకంగా చేపట్టి విజయవంతం చేసేందుకు టిపిసిసి సర్వశక్తులు ఒడ్డటానికి పూనుకొన్నది. ఈ సభకు లోక్‌సభ ప్రతిపక్షనే రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ప్రధాన క్యాదర్శి ప్రియాంకగాంధీ, ఇండియా కూటమిలోని జాతీయస్థాయి అగ్రనేతలు, ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ముఖ్యంగా కాక్రోచ్ పార్టీకి చెందిన జన్‌జి ఉద్యమకారులను కూడా భాగస్వామ్యం చేసేందుకు వారిని ప్రసన్నం చేసుకోవడానికి తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించినట్లు తెలిసింది.

రాహుల్‌గాంధీ నివాసంలో ఇచ్చిన టిపార్టీకి దూరంగా ఉన్న జన్‌జి కాక్రోచ్‌లను ఇదే వేదికపై తీసుకొని వస్తే తెలంగాణ నుంచి బలమైన సంకేతాలు దేశరాజ కీయాలలోకి పంపడానికి వీలవుతోందని కాంగ్రెస్ స్థానిక నాయకత్వం భావిస్తోంది. దేశవ్యాప్తంగా బిజెపి వ్యతిరేక భావాజాలం ఉన్న విపక్షాలను ఏకతాటిపైకి తేవడానికి హైదరాబాద్ సభను ఒక మైలురాయిగా మలచడానికి ఇండియా కూటమి నేతలు వ్యూహారచన చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఇండియా కూటమి ఏర్పాటు చేసే బహిరంగసభ జాతీయస్థాయి రాజకీయాలను మాత్రమే కాకుండా రాష్ట్రంలో త్వరలో జరిగే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కూడా ఉత్ప్రేరకంగా ఉండే అవకాశం ఉంది. ఎల్‌నినోతో ఏర్పడిన కరవుతో క్షేత్రస్థాయి లో ఉన్న ప్రజావ్యతిరేకతతో మానసిక స్థైర్యం కోల్పోయిన కాంగ్రెస్ శ్రేణులకు నూతనోత్సహాన్ని నింపేలందుకు ఉపయోగపడుతుందనడంలో అతిశయోక్తి లేదు.

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నేతలు సర్ వ్యతిరేక లాంగ్ మార్చ్‌తో పాటు బహిరంగ విజయవంతం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రజలకు అందరికి అందుబాటులో విశాల సభవేదిక ఏర్పాటుకు స్థల ఎంపిక రవాణా, భద్రత, ఏర్పాటుకు మంత్రులు పార్టీ ముఖ్య నేతలు సమన్వయంగా పనిచేయడానికి సమాలోచనలు చేస్తున్నారు.దేశవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలను కాంగ్రెస్‌కు అను కూలంగా ప్రోదిచేయడానికి లక్షలాది మంది ప్రజలను సమీకరించి బల ప్రదర్శన చేయాలని యోచిస్తున్నారు. ప్రజా సమస్యలను విస్మరిస్తూ కేవలం ప్రజల బలహీనతల సెంటిమెంట్‌ను విద్వేషంగా మార్చుతూ ఓట్లు దండుకొంటున్న బిజెపికి"ప్రజా స్వామ్య పరిరక్షణ నినాదం"తో గట్టి బుద్ది చెప్పేందుకు ఈ సభతోడ్పాటు ఇచ్చేందుకు వీలుగా వ్యూహారచన చేస్తున్నారు.

## కవలలు పుట్టినా రెండో ప్రసవానికి 180 రోజుల ప్రసూతి సెలవు ఇవ్వాల్సిందే

### ఆ కాలానికి పూర్తి వేతనం చెల్లించాల్సిందే: విద్యాశాఖను ఆదేశించిన తెలంగాణ హైకోర్టు

**హైదరాబాద్,అక్టోబరు14,ప్రభాతవార్త:** మొదటి ప్రసవంలో కవలలు పుట్టినా రెండో ప్రసవానికి 180 రోజుల ప్రసూతి సెలవు ఇవ్వాల్సిందేనని తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఉపాధ్యాయురాలు వి. నర్మదకు అనుకూలంగా వచ్చిన ఈ తీర్పుపై సిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. సిపిఎస్ యూనియన్ ఆధ్వర్యంలో వేసిన కేసులో ... ఉపాధ్యాయురాలికి అనుకూలంగా హైకోర్టు ఉత్తర్వులు రావడం సంతోషకరమని వారు ఒక ప్రకటనలో తెలిపారు. కవలలు పుట్టడం సహజ ప్రక్రియ అని, మాతృత్వ హక్కులను కుదించలేమని న్యాయస్థానం వ్యాఖ్యానించిందని పేర్కొన్నారు. టీఎస్ సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో ఈ అంశంపై కోర్టులో పోరాడి విజయం సాధించిన ఉపాధ్యాయురాలిని వారు అభినందించారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని ఎంపీయూపీఎస్ మఖ్దంపూర్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న వి. నర్మద రెండో ప్రసవం కోసం 21.09.2026న ప్రసూతి సెలవుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే జీఓ ఎంఎస్ నంబర్ 152 (04.05.2010), ఫండమెంటల్ రూల్ 101 ప్రకారం ఇద్దరి కంటే తక్కువ మంది పిల్లలు ఉన్న మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ప్రసూతి సెలవు వర్తిస్తుందని పేర్కొంటూ ఊట్కూర్ మండల విద్యాశాఖాధికారి 21.09.2026న ఆమె సెలవును తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల సంఖ్య ఎల్ఆర్. నంబర్ ఏ2/196/1/2026.ఈ తిరస్కరణ ఉత్తర్వు లను సవాలు చేస్తూ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నర్మద హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ నంబర్ డబ్ల్యూపీ నంబర్ 34002/2026. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఖాసీం భాషా వలి వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ ఉద్యోగంలో చేరకముందు జరిగిన మొదటి ప్రసవంలో నర్మదకు కవలలు జన్మించినప్పటికీ, రెండో ప్రసవానికి 180 రోజుల ప్రసూతి సెలవు మంజూరు చేయాల్సిందేనని పేర్కొన్నారు. ఇదే అంశంపై గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన న్యాయస్థానం ప్రసూతి సెలవు నిబంధనలను సంక్షేమ దృక్పథంతో అమలు చేయాలని స్పష్టం చేసింది. కవలలు పుట్టడం పూర్తిగా సహజ జీవసంబంధమైన ప్రక్రియ అని, అది మహిళ నియంత్రణలో ఉండే అంశం కాదని పేర్కొంది. కుటుంబ నియంత్రణ విధానాల పేరుతో మహిళలకు లభించే మాతృత్వ హక్కులను కుదించలేమని వ్యాఖ్యానించింది. తమిళనాడుకు చెందిన జె. శర్మిల కేసు తీర్పు తర్వాత అక్కడి ప్రభుత్వం నిబంధనలను సవరించి, తొలి ప్రసవంలో కవలలు జన్మిస్తే రెండో ప్రసవానికీ సెలవు వర్తించేలా చేసిన విషయాన్ని గుర్తుచేసింది. ఏపీ ప్రభుత్వం కూడా 2025లో సంబంధిత నిబంధనల్లో మార్పులు చేసిన అంశాన్ని ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో తొలి ప్రసవంలో కవలలు జన్మించిన మహిళ రెండో ప్రసవానికీ ప్రసూతి సెలవుకు అర్హురాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. అధికారుల తిరస్కరణ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ, ఫండమెంటల్ రూల్ 101(ఏ) ప్రకారం నర్మద రెండో ప్రసవానికి 180 రోజుల సెలవు మంజూరు చేసి, ఆ కాలానికి సంబంధించిన పూర్తి వేతనం చెల్లించాలని విద్యాశాఖను ఆదేశించింది.

### తెలంగాణలో విదేశీ మద్యం ధరల పెంపు

## 352 బ్రాండ్లపై ప్రభావం

### కొత్తగా 41 బార్లు, 8,771 దరఖాస్తులు, 16న లాటరీ ద్వారా ఎంపిక

**హైదరాబాద్,అక్టోబరు14,ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్లలో విక్రయిస్తున్న 352 విదేశీ బ్రాండ్ల ధరలను పెంచుతూ తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (గిబితీదిలి) సర్క్యులర్ జారీ చేసింది. సవరించిన ధరలు వెంటనే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. వివిధ బ్రాండ్లపై దాదాపు 6 శాతం వరకు ధరలు పెరిగినట్లు తెలుస్తోంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే మద్యంపై సుంకాన్ని కేంద్రం తగ్గించిన నేపథ్యంలో రాష్ట్రంలో విదేశీ మద్యం ధరలు పెరగడం చర్చకు దారితీసింది.సవరించిన ధరల వల్ల మద్యం ప్రియులపై అదనపు భారం పడనుంది. కాగా, రాష్ట్రంలో కొత్తగా 41 బార్ల ఏర్పాటుకు ఆబ్కారీ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌కు భారీ స్పందన లభించింది. మొత్తం 8,771 దరఖాస్తులు రావడంతో ఒక్కో బార్‌కు సగటున 214 దరఖాస్తులు వచ్చినట్లయింది. ఒక్కో దరఖాస్తుకు తిరిగి చెల్లించని రుసుముగా రూ.లక్ష నిర్ణయించడంతో ప్రభుత్వ ఖజానాకు ఈ రూపంలోనే రూ.87.71 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించగా ఈ నెల 16న లాటరీ ద్వారా బార్ల నిర్వాహకులను ఎంపిక చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) ఏర్పాటుతో పాటు కొత్త మున్సిపాలిటీల ఆవిర్భావం, గ్రామాల విలీనంతో జనాభా, పట్టణ పరిధి విస్తరించిన నేపథ్యంలో కొత్త బార్లకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. క్యూర్ పరిధిలో 14 బార్లకు, ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో 27 బార్లకు నోటిఫికేషన్ ఇచ్చింది. క్యూర్ పరిధిలోనే 4,252 దరఖాస్తులు రావడం గమనార్హం. ఇక్కడ ఒక్కో బార్‌కు సగటున 303 దరఖాస్తులు వచ్చాయి.

### గోవాలో ఈగల్ పోలీసుల ఆపరేషన్

## ఇద్దరు వాంటెడ్ అంతర్ రాష్ట్ర డ్రగ్స్ స్మగ్లర్ల అరెస్టు

**హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త:** డ్రగ్స్ స్మగ్లర్ల భరతం పట్టేందుకు ఏర్పాటైన ఈగల్ విభాగ ం తెలంగాణతో సంబంధం వుండి దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాలలో తలదాచుకున్న నేరగాళ్లను పట్టుకునేందుకు దాడులు కొనసాగిస్తూనే వుంది. తాజాగా గోవాలో నిర్వహించిన దాడు ల్లో ఇద్దరు వాంటెడ్ అంతరాష్ట్ర డ్రగ్స్ స్మగ్లర్లను పట్టుకున్నారు. సైబరాబాద్ పోలీసులతో కలిసి చేబట్టిన ఈ ఆపరేష న్‌లో తెలంగాణలో పాటు దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో నెట్ వర్క్ కలిగిన గోవాకు చెందిన ప్రీతీష్ నారాయణ్ బోర్కర్ అలియాస్ బాబు (36)తో పాటు ఉత్తర గోవా ప్రాంతానికి చెందిన మరో బడా స్మగ్లర్ బషారత్ అహ్మద్ అలియాస్ దగ్గా (46)లు పట్టుబడ్డారు. వీరిద్దరు తెలంగాణలో అనేక మందికి సాధార ణ డ్రగ్స్‌తో పాటు సింథటిక్ డ్రగ్స్ అమ్మినట్లు ఈగల్ విచారణలో తేలింది. బషారాత్ అహ్మద్ వద్ద 13 ఎల్ఎస్‌డి బ్లాట్స్, ఎనిమిది ఎక్స్‌టసీ మాత్రలు, వంద గ్రాముల చరస్‌ను జప్తు చేశారు. వీటి విలువ లక్షా 50 వేల రూపాయలుగా తేలింది. వీరిని హైదరాబాద్‌కు తరలించారు. వీరి వద్దనుంచి డ్రగ్స్ కొన్నవారు వెయ్యి మంది వరకు వున్నట్లు ఈగల్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పాటు వీరికి తెలుగు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో సబ్ ఏజెంట్లు వున్నారని తేలింది. వీరి కోసం ఆరా తీస్తున్నారు.కాగా డ్రగ్స్‌కు సంబంధించి ఎటువంటి సమాచారం వున్నా వెంటనే 1908కు ఫోన్ చేయాలని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా తెలిపారు.

వార్త

ఒకరిని చంపితే చట్టప్రకారం అది హత్య అవుతుంది. వందలాది మందిని హతమారిస్తే అతనికి అజరామరమైన కీర్తి వస్తుంది. దానిని యుద్ధక్రీడ అని పిలుస్తారు.

- ఎడ్వర్డ్ యంగ్

# సన్నబియ్యం సణుగుడు!

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికే కాదు మధ్యతరగతి అల్పాదాయ వర్గాలకు సైతం సన్నబియ్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వాలు తపనపడుతున్నా, వారి ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారింది. లక్ష్యశుద్ధి లేక కాదు ఎల్‌నినో ప్రవేశించాక దాని ప్రభావంతో ప్రస్తుత మార్కెట్‌లో బియ్యం ధరలకు రెక్కలొచ్చేసాయి. ఆహార భద్రత బోలెడంత అని చెప్పుకుంటున్నా నిల్వలు తరిగిపోయి బియ్యానికి కూడా కరువొస్తుందా? అనే భయం లేకపోలేదు. ఎల్‌నినో ప్రభావంతో వరిసాగుకు నీరు సరిపడదనే ముందస్తు జాగ్రత్తతో ఇప్పటికీ దేశమంతటా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించమనే సందేశాలు బాగా పెరిగిపోయాయి. ఇకపై బియ్యం కొరత ఏర్పడి ధరలు ఆకాశాన్నంటే పరిస్థితులు గోచరిస్తున్న నేపథ్యంలో సన్నబియ్యానికే కాదు దొడ్డు బియ్యానికికూడా మార్కెట్‌లో ధరలు పెరిగాయి. సన్నబియ్యం సామాన్యునికి అందుబాటులోకి తెచ్చేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. కానీ అనుకోని వాతావరణ అవాంతరం. పశ్చిమాసియా యుద్ధ సంక్షోభ సమయంలోనూ బియ్యం ధరలు పెరగవని వాణిజ్యవర్గాలు అంచనా వేశాయి. కానీ ఉన్నట్టుండి ఇప్పుడు పెరిగాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న సన్నబియ్యం కిలో ధర 80నుంచి 90 రూపాయల మేరకు నడుస్తోంది. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ ధరల పర్యవేక్షణ సమాచారం ప్రకారం అక్టోబరు 13 నాటికి సన్న బియ్యం దేశవ్యాప్త సగటు చిల్లర బియ్యం ధర కిలోకు రూ. 47.14 మాత్రమే ఉంది. అలా అని మార్కెట్ ధరల వ్యత్యాసం, వినియోగదారునికి పడే రిటైల్ రేటు మధ్యలో దాదాపు రెట్టింపు ధర తేడా ఉంది. మధ్యలో ఎన్నోచేతులు మారి వినియోగదారునికి చేరేలోగా దళారులకే భుక్తం అన్న చందాన ఉంది. వాటిని పండించే రైతుకి గిట్టుబాటు లేకపోవడం శోచనీయం. తెలంగాణలో సుమారు 2.81 కోట్ల మంది లబ్ధిదారులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాపంపిణీ వ్యవస్థ కింద సాధారణ అర్హత కలిగిన రేషన్ కార్డుదారులకు నెలకు 5 కిలోల బియ్యం ఉచితంగా అందించే పథకం అమలవుతోంది. అంత్యోదయ అన్నయోజన కార్డుదారులకు ఒక్కోకార్డుపై 35 కేజీలు బియ్యం పంపిణీ చేస్తున్నారు. సన్నబియ్యం ఉచితంగా ఇచ్చినా కొంత మంది లబ్దిదారులు షాపుల్లోనే వదిలేస్తున్నారు. కారణం వండాక సన్నబియ్యం మెత్తనవుతున్నాయని ఆరోపణ. ఏమయితేనే ప్రభుత్వ ఉచితబియ్యం అందనివారు స్వేచ్ఛ మార్కెట్‌లో, మార్ట్‌ల్లోనూ, కార్పొరేట్ షాపుల్లోనూ అత్యధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. గతనెలకన్నా ఈ నెల దాదాపు రిటైల్ బియ్యం ధర రెట్టింపయ్యింది. ఆంధ్రప్రదేశ్‌లోనైతే ఉచిత బలవర్ధక 'ఫోర్టిఫైడ్' బియ్యం పేరిట అందచేస్తున్నారు. ఈ రాష్ట్రంలో సాధారణ బియ్యం సగటు చిల్లరధర కిలో రూ.59.30గానమోదైంది. ఇది రాష్ట్రవ్యాప్త సగటు ధర మాత్రమే. ఒక వైపు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ వరిసాగు విస్తీర్ణం, ధాన్యం దిగుబడి, ప్రభుత్వ కొనుగోళ్లు, సబ్సిడీ, ఉచిత పంపిణీ వంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నా బియ్యం రేట్లు ఇంత గణనీయంగా పెరగడం దురదృష్టకరం. ధాన్యాగారాలైన తెలుగు రాష్ట్రాల్లో సామాన్య కుటుంబాలు తమ ఆదాయంలో సింహభాగం బియ్యంకొనుగోలుకే ఖర్చు చేయాల్సి వస్తోంది. సన్నబియ్యం కర్నూలు మసూరీ ఫైన్, సూపర్ ఫైన్ బియ్యాల అన్నిధరలూ ఒక్కసారిగా పెరిగి మధ్యతరగతి కుటుంబాల మీదబాగా ప్రభావం చూపుతోంది. తెలుగు ప్రజల ఆహార సంస్కృతిలో అంతర్భాగమైన బియ్యం, ధర సామాన్యుడి కొనుగోలు శక్తికి మించి పెరిగింది. ఈ పెరుగుదల మధ్యతరగతి కుటుంబ ఆర్థిక వ్యవస్థపై తీవ్రప్రభావం చూపుతోంది. ఉభయ రాష్ట్రాల్లోనూ బియ్యం ధరలు అసాధారణంగా పెరిగినా ఎక్కడా ఏకరీతి ధర పాటించడం లేదు. జనంలో ఏర్పడిన గిరాకీని, బట్టిమార్కెట్‌లో నిల్వలు దాచేసి ధరలు పెంచేశారన్న విషయం అందరికీ తెలిసింది. ఈ పరిస్థితి నల్లబజారు వ్యవహారంలా ఉంది. రేపెపుడో ఎల్‌నినో ఎఫెక్ట్‌తో ఎవరికి వారు తమ ఇళ్లల్లోనే బియ్యం నిల్వలుంచుకొని కాలక్షేపం చేసే ఆర్థిక పరిస్థితులు లేవు. ఎప్పటికప్పుడు సంపాదించి ఖర్చుచేసుకునే ఆర్థిక పరిస్థితులు మాత్రమే ఆయా కుటుంబాలను నడిపిస్తున్నాయి. సన్నబియ్యం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అనే పరిస్థితిలో తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. 2025లో తెలంగాణనుంచి ఫిలిప్పీన్స్‌కు 30వేల టన్నులబియ్యాన్ని ఎగుమతి చేసిన రాష్ట్రంలో ఈసారి పరిస్థితి ఏమిటో అధికారులు బేరీజు వేయనున్నారు. దేశంలోని మొత్తం బియ్యం ఉత్పత్తిలో తెలంగాణ బియ్యం దిగుబడి దాదాపు 12శాతం కాగా,సాగు విస్తీర్ణంలో 10 శాతం మాత్రమే కానీ తెలంగాణలో ప్రధానంగా ప్రభుత్వం 7రకాల సన్నరకాలకు మాత్రమే ప్రోత్సాహకాలు కలిగిస్తోంది. అవే పండించాలని చెబుతోంది కనుక ఈసారి ఎల్‌నినో వలన కొంత దిగుబడి నష్టపోయినా నిలదొక్కుకోవచ్చు. అయినా యాసంగి 'వరి' దిగుబడుల నాటికి కానీ ఎంత లోటున్నదీ తెలియరాదు. ఏదిఏమయినాసన్నబియ్యం తెలుగు రాష్ట్ర ప్రజల నోట్లో నానుతోంది. కానీ ఎల్‌నినో ప్రభావం ఏమేరకు ఉంటుందో! సన్నబియ్యం,దొడ్డుబియ్యం పంపిణీలో దోబూచులాటలు తప్ప పరిస్థితి తారసిల్లడం లేదు. కానీ మార్కెట్‌లో దొరికే బియ్యం కిలో నూరు రూపాయలకు చేరుతుందన్న వార్తలు మాత్రం ఆందోళనకరం. ధాన్యం కొనుగోలు ధర, మిల్లుల వద్ద బియ్యం ధర, టోకు మార్కెట్ ధర మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సమగ్రంగా పరిశీలిస్తే తప్ప మార్కెట్ ధర ఉన్నట్టుండి అలా ఎందుకు పెరిగిపోయిందో చెప్పలేం. రిటైల్ మార్కెట్ ధరలైతే పెరిగాయి కానీ రైతుకు మిగిలే రూపాయికి మాత్రం ఏదో విధంగా గండే. ఈ పరిస్థితులను దానాదీనా చిత్తగించాల్సింది పాలకులే.

కవిత్వాన్ని సృష్టించేటప్పుడు ఉద్భవించే బాధలో ఆనందం ఉంటుంది. ఆ ఆనందం కవికి మాత్రమే తెలుసు.



విలియం కూపర్

మనలోని సహజశక్తులే మన అనారోగ్యానికి నిజమైన ఔషధాలు.



హిపోక్రేట్స్

# సిఇసి తొలగింపు విధానం జటిలమే!

ప్రస్తుత ఆందోళన నేపథ్యంలో సర్‌ప్రకియ రద్దయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇదే జరిగితే వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అయినట్టే అవుతుంది. నిజానికి ఎన్నికల సంఘం చెబుతున్నట్టుగా మృతిచెందిన వ్యక్తుల ఓట్లు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలి వెళ్లిన వారి ఓట్లు, ఒకే వ్యక్తి ఒకటికాకుండా వేరువేరు ప్రాంతాలలో కలిగివున్న ఓట్లు తొలగించాలంటే సరిచూసుకోవాల్సిన సర్ అవసరం లేకుండానే డోర్ టు డోర్ పరిశీలనతోపాటు ఏఐ సాంకేతి కను వినియోగించి తొలగించవచ్చు. ఇందుకు విరుద్ధంగా తాతలు, తండ్రులతో ముడిపెట్టడటం వల్ల అక్రమాలు జరి గాయనే భావన కలిగింది. ఒక్కొకటి వెలుగులోకి వస్తున్న అంశాలను గమనిస్తుంటే ఆ భావన నిజం కూడా కావచ్చు అనిపిస్తోంది. అంతేకాకుండా ఫారమ్ 6 లో అనవసరమైన రెండు అంశాలు వున్నాయని వాటిని తొలగిస్తున్నట్టు స్వయంగా చీఫ్ ఎన్నికల కమీషన్ పేర్కొనడం ఈ సందర్భంగా గమనంలోకి తీసుకోవాలి.



అన్నవరపు బ్రహ్మయ్య

చీఫ్ ఎలక్షన్ కమీషనర్ రాజీనామా చేయాలంటూ దేశ రాజధాని ఢిల్లీ అట్టుడికిపోతున్నప్పటికీ జ్ఞానేశ్ కుమార్ మాత్రం జరుగుతున్న పరిణామాలకు తనకేమి సంబంధంలేనట్టుగా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. దానికి కారణం ప్రస్తుతంఅమల్లో వున్న నిబంధనల ప్రకారం ఎన్నికల సంఘం ప్రధాన అధికారికి పటిష్టమైన రక్షణ వ్యవస్థ వుంది. చీఫ్ ఎన్నికల కమీషనర్ తనంతట తానుగా రాజీనామా చేస్తే మినహా ఆయనను తొలగించడం లేదా భర్తరఫ్ చేయడం సులభం కాదు. రాజ్యాంగం ప్రకారం చీఫ్ ఎన్నికల కమీషనర్ తొలగించాలంటే సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తిని తొలగించాలంటే ఎటువంటి పద్ధతులు పాటిస్తారో అటువంటి పద్ధతినే పాటించాలి. సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తిని లేదా చీఫ్ ఎన్నికల కమీషనర్‌ను తొలగించే పద్ధతిని ఇంపీచ్‌మెంట్ అంటారు. చీఫ్ ఎలక్షన్ కమీషనర్ను ఇంపీచ్‌మెంట్ చ్చేయాలంటే 100 లోక్‌సభ లేదా 50మంది రాజ్యసభ్యులు ప్రతిపాదన చేస్తూ స్పీకర్/రాజ్యసభ చైర్మన్కు నోటీసు అందచేయాలి. ఆ తర్వాత ఎలక్షన్ కమీషన్ పై వచ్చిన ఆరోపణలపై ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ విచారణ జరపాలి. ఆ తర్వాత ఉమ్మడి సభల పార్లమెంటు సమావేశంలో మూడింట రెండొంతుల మంది సభ్యులు ఆమోదంతో తీర్మానం పాస్ చేయాలి. ఆ తీర్మానాన్ని రాష్ట్రపతి ఆమోదించినప్పుడు మాత్రమే చీఫ్ ఎలక్షన్ కమీషనరు తొలగించడం సాధ్యం అవుతుంది. అంతేకాకుండా ఎన్నికల కమీషనర్లపై అధికారంలో వుండగా లేదా పదవి విరమణ చేసిన తర్వాత కూడా ఎటువంటి క్రిమినల్ కేసులునమోదు చేయడానికి వీలులేదు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘం 1950లో ఏర్పడింది. ఆనాటి నుంచి 1993వ సంవత్సరం వరకు భారత ఎన్నికల సంఘంలో ఒకే కమీషనర్ వుండేవారు. అయితే ఆచరణలో వచ్చిన నిబంధనల నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(2) ప్రకారం ఎన్నికల సంఘం సభ్యుల సంఖ్యను ముగ్గురుకు పెంచారు. వీరి ముగ్గురుకి ఒకే విధమైన అధికారాలు ఉంటాయని చెప్పినా ముగ్గురిలో ఒకరు చీఫ్ కమీషనర్ వ్యవహరిస్తారు. ఎన్నికలకు సంబంధించి ముగురికి ఒకే విధమైన అధికారాలు వుంటాయి. ఏ నిర్ణయమైనా ముగ్గురు కలసి తీసుకోవాలి. అభిప్రాయ బేధాలు వచ్చినప్పుడు మాత్రం మెజారిటీ సభ్యులు అంటే ముగ్గురిలో ఇరువురు సభ్యులు నిర్ణయాన్ని అమలు చేయాల్సి వుంటుంది. సర్ ప్రక్రియ ప్రారంభం విషయంలో ముగ్గురు సభ్యుల ఆమోదం లేకుండా చీఫ్ ఎలక్షన్ కమీషనర్ ఏక్షపక్షంగా తీసుకున్నారని మిగిలిన సభ్యులు చెబుతున్నారు. ఈ మేరకు వారు కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రటరీకి ఫిర్యాదు చేసినట్టు కూడా వారు ప్రకటించారు. ఈ అంశాన్ని ఒక ఆంగ్ల పత్రిక బహిర్గతం చేసింది. ఆనాటి నుంచి సర్ రద్దు చేయాలని, చీఫ్ ఎలక్షన్ కమీషనర్ రాజీనామా చేయాలనే ఆందోళన ప్రారంభమైంది. నిజానికి పత్రికలో ఈ అంశాలు ప్రచురితం కాకముందే సర్ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని, సర్ పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారనే ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండాబీహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలలో సర్ సందర్భంగా అనేక మంది అర్హుల ఓట్లు తొలగించారని ఆయా రాష్ట్రాల నాయకుల ఆరోపణలు వచ్చినప్పటికీ ఆధారాలు బయటకు రాలేదు. అయితే ఆ ఆంగ్ల పత్రికలో ఆధారాలు బయటకు




రావడం, చీఫ్ ఎలక్షన్ మీషనర్ తమ ఆమోదం లేకుండానే సర్ ప్రక్రియకు సంబంధించి 14 అంశాలలో ఏకపక్షంగా వ్యవహారించారని ప్రకటించిన స్థితిలో ఉద్యమం ఊపందుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లను భారత రాష్ట్రపతి ఆర్టికల్ 324(2) కింద నియమిస్తారు. నిబంధనల ప్రకారం ముగ్గురు ఎన్నికల కమీషన్లకు ఒకే విధమైన అధికారాలు వున్నప్పటికీ భార్యభర్తలు ఇరువురు సమానం కానీ భర్త కొంచెం ఎక్కువ అన్నట్టుగా కమీషనర్ల తొలగింపు విధానంలో చీఫ్ కమీషనర్కు మిగిలిన ఇరువురు సభ్యుల విషయంలో తేడా వుంది. రాజ్యాంగం ప్రకారం చీఫ్ ఎలక్షన్ కమీషన్ ఏకపక్షంగా వ్యవహారించడానికి చీఫ్ ఎలక్షన్ కమీషనర్ తొలగించడానికి ముందుగా చెప్పినట్టుగా ఇంపీచ్‌మెంట్ విధానం పాటించాల్సి వున్నప్పటికీ మిగిలిన ఇరువురు కమీషనర్లను తొలగించడానికి ఇంపీచ్‌మెంట్ విధానం అవసరం లేదు. ఎలక్షన్ కమిషన్లోని సభ్యుల ప్రవర్తన తీరు అనుమానస్పదంగా వుందని, అందు వల్ల వారిని విధుల నుంచి తొలగించాలని చీఫ్ ఎలక్షన్ కమీషనర్ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తే కేంద్రప్రభుత్వం లేదా రాష్ట్రపతి తొలగించవచ్చు. బహుశా ఈ కారణంగానే చీఫ్ ఎన్నికల కమీషనర్ సర్ ప్రక్రియను ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నట్టు అర్థం చేసుకోవచ్చు. అయితే ప్రారంభంలో ఎలక్షన్ కమీషనర్ల నియామకాలకు సంబంధించిన విధివిధానాలు నిర్ణయించని నేపథ్యంలో కొన్ని ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో సుప్రీమ్ కోర్టు కల్పించుకొని ఎన్నిల సంఘం సభ్యుల నియామక విధివిధానాలు రూపొందించే వరకు ఎన్నికల సంఘం సభ్యులను ప్రధాన మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, సుప్రీమ్ కోర్టుప్రధాన న్యాయమూర్తితో కూడిన కొలీజియంతో ఎన్నికల కమీషనర్లను నియమించాలని సూచించింది. 2023వ సంవత్సరంవరకు ఇదే విధానం కొనసాగింది. అయితే 2023వ సంవత్సరంలో ఎన్నికల సంఘం కమిషన్ల నియమాకాలకు సంబంధించి పార్లమెంటులో చట్టం చేశారు. పార్లమెంటులో చేసిన ఈ చట్టం ప్రకారం ఎన్నికలసంఘం సభ్యులను ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడుతోపాటు కేంద్ర కేబినెట్లోని సీనియర్ మంత్రితో కూడిన కొలీజియం ఎంపిక చేస్తుంది. ఈ కొలీజియంలో సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి ఆ స్థానంలో కేంద్ర కేబినెట్లోని సీనియర్ మంత్రిని సభ్యునిగా తీసుకోవడం వల్ల కేంద్రంలో అధికారంలో రాజకీయ పార్టీకి అనుకూలమైన వారి నియమించే అవకాశం ఏర్పడింది. చీఫ్ ఎలక్షన్ కమీషన్ నియామకం సందర్భంగా నిబంధనలు మార్పు చేసినప్పుడే అభ్యంతరం చెప్పి వుంటే ప్రస్తుతం ఈ పరిస్థితి దాపురించేది కాదు. సర్ (స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్) ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆధారాలతో రుజువులు చూపిస్తున్నప్పటికీ ఉద్యమకారులు ఆయన తొలగించాలని డిమాండ్ చేయలేకపోతున్నారు. ఇదిలాఉండగా సర్ ప్రక్రియ పేరిట పెద్దఎత్తున నిధులు ఖర్చుచేశారు. సర్ ప్రక్రియకు ఎన్ని నిధులు కేటాయించారనే సమాచారం అందుబాటులో లేకపోయినా ఒక్క తెలంగాణ రాష్ట్రంలో సర్ ప్రక్రియకు 200 కోట్ల రూపాయలు కేటాయించినట్టు వార్తలు వచ్చాయి. ఎన్నికల సంఘం ప్రకారం ఇప్పటివరకు 20 రాష్ట్రాలలో సర్ పక్రియ ముగిసింది. ఈ ప్రకారం దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు ఎన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయో అంచనా వేయవచ్చు. ప్రస్తుత ఆందోళన నేపథ్యంలో సర్‌ప్రకియ రద్దయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇదే జరిగితే వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అయినట్టే అవుతుంది. నిజానికి ఎన్నికల సంఘం చెబుతున్నట్టుగా మృతిచెందిన వ్యక్తుల ఓట్లు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలి వెళ్లిన వారి ఓట్లు, ఒకే వ్యక్తి ఒకటికాకుండా వేరువేరు ప్రాంతాలలో కలిగివున్న ఓట్లు తొలగించాలంటే సరిచూసుకోవాల్సిన సర్ అవసరం లేకుండానే డోర్ టు డోర్ పరిశీలనతోపాటు ఏఐ సాంకేతికను వినియోగించి తొలగించవచ్చు. ఇందుకు విరుద్ధంగా తాతలు, తండ్రులతో ముడిపెట్టడటం వల్ల అక్రమాలు జరిగాయనే భావన కలిగింది. ఒక్కొకటి వెలుగులోకి వస్తున్న అంశాలను గమనిస్తుంటే ఆ భావన నిజం కూడా కావచ్చు అనిపిస్తోంది. అంతేకాకుండా ఫారమ్ 6 లో అనవసరమైన రెండు అంశాలు వున్నాయని వాటిని తొలగిస్తున్నట్టు స్వయంగా చీఫ్ ఎన్నికల కమీషన్ పేర్కొనడం ఈ సందర్భంగా గమనంలోకి తీసుకోవాలి. ●

# ఆహార భద్రతకు జన్యుమార్పిడి పంటలే ప్రత్యామ్నాయం

డి వి బి శ్రీహరిన్

ఇరవై ఒకటో శతాబ్దంలో మానవాళి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో వేగంగా పెరుగుతున్న జనాభాకు ఆహార భద్రత కల్పించడం, వాతావరణ మార్పుల నుంచి పర్యావరణాన్ని కాపాడుకోవడం అత్యంత ప్రధానమైనవి. ఈ రెండు కీలక అంశాల మధ్య నలిగిపోతున్న ఒక వివాదాస్పద సాంకేతికత 'జన్యుమార్పిడి పంటలు'. ఒక జీవిలోని కావలసిన గుణాలను కలిగి ఉన్న జన్యువును వేరు చేసి, మరొక మొక్క డి.ఎన్.ఎలోకి ప్రవేశపెట్టడం ద్వారా ఈ పంటలను సృష్టిస్తారు. అయితే ఈ సాంకేతికత ఆకలి బాధలను తీర్చే అమృతభాండమా లేక ప్రకృతి సమతుల్యతను దెబ్బతీసే పర్యావరణ ముప్పాఅనే అంశంపై ప్రపంచ వ్యాప్తంగా మేధావులు,శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలమధ్య తీవ్రమైన చర్చసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా సాగుభూమి క్రమంగా తగ్గిపోతుండటం, నీటి కొరత, మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల సాంప్రదాయ వ్యవసాయం ద్వారా డిమాండ్‌కు సరిపడా ఆహారాన్ని ఉత్పత్తి చేయడం సవాలుగా మారింది. ఇలాంటి తరుణంలో జన్యుమార్పిడి పంటలు ఆహార భద్రతకు ఒక బలమైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాయి. ఈ సాంకేతికత ద్వారా రూపొందించిన విత్తనాలు తక్కువ విస్తీర్ణంలోనే అత్యధిక దిగుబడిని సాధించగలవు. అంతేకాకుండా, వాతావరణ మార్పులను తట్టుకునేలా అంటే కరవు, మితిమీరిన వేడి, చలి లేదా నేలలో లవణీయత వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ ఇవి స్థిరమైన దిగుబడిని ఇస్తాయి. పోషకాహార లోపాన్ని అధిగమించడంలో కూడా ఈ పంటల పాత్ర గణనీయమైనది. మూడో ప్రపంచ దేశాల్లో విటమిన్ 'ఎ' లోపం వల్ల లక్షలాది మంది పిల్లలు అంధత్వానికి గురవుతున్నారు. దీనిని నివారించడానికి శాస్త్రవేత్తలు బీటాకెరోటిన్ పుష్కలంగా ఉండే 'గోల్డెన్ రైస్'ను అభివృద్ధి చేశారు. ఇలాంటి 'బయోఫోర్టిఫైడ్' పంటలు పేదరికంలో ఉన్న ప్రజలకు చౌకగా పోషకాలను అందించడానికి ఉపయోగపడతాయి. అలాగే, తెగుళ్లు, కీటకాల నిరోధకత కలిగిన బి.టి. పత్తి, బి.టి. వంగ వంటి పంటల వల్ల రసాయన పురుగుమందుల వాడకంతగ్గి, రైతులకు పెట్టుబడి వ్యయం కలిసివస్తుందనేది మద్దతుదారుల బలమైన వాదన. జన్యుమార్పిడి పంటల వల్ల ప్రయోజనాలు ఎన్ని ఉన్నప్పటికీ, అవి పర్యావరణానికి, మానవ మనుగడకు కలిగించే నష్టాలు అంతకంటే తీవ్రమైనవని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రకృతిలో సహజంగా జరిగే పరిణామానికి భిన్నంగా జన్యువుల ను మార్చడం వల్ల జీవవైవిధ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. ఒకే రకమైన జన్యుమార్పిడి పంటలను సుదీర్ఘకాలం పెద్ద ఎత్తున సాగు చేయడం వల్ల, శతాబ్దాలుగా వస్తున్న స్థానిక సంప్రదాయ విత్తనరకాలు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉంది. మరో ప్రధాన పర్యావరణ సమస్య 'సూపర్ వీడ్స్' అంటే మహా కలుపు మొక్కలు,'సూపర్ బగ్స్' ఆవిర్భావం. కలుపునాశకాలను తట్టుకునేలా రూపొందించిన జన్యుమార్పిడి పంటల పొలాల్లో నిరంతరం ఒకే రకమైన రసాయనాలు వాడటం వల్ల, ఆ రసాయనాలకు లొంగని శక్తివంతమైన కలుపు మొక్కలు పుట్టుకొస్తున్నాయి. అలాగే, హానికర కీటకాలను చంపడానికి మొక్కలోనే ఉత్పత్తిఅయ్యే విషపూరిత ప్రోటీన్లు, కాలక్రమేణా పర్యావరణానికి మేలు చేసే తేనెటీగలు, సీతాకోకచిలుకలు, నేలలోని మిత్రపురుగులను కూడా నాశనం చేస్తున్నాయి. మానవ ఆరోగ్యంపై వీటిదీర్ఘకాలిక ప్రభావాల గురించి సరైన శాస్త్రీయ ఆధారాలు లేకపోవడం, అలర్జీలు,యాంటీబయాటిక్ నిరోధకత వంటి సమస్యలు తలెత్తవచ్చనే ఆందోళనలు వినియోగదా రుల్లో ఉన్నాయి. ఆర్థిక కోణంలో చూస్తే, జన్యుమార్పిడి విత్తనాలపై బహుళజాతి కార్పొరేట్ కంపెనీల పేటెంట్ హక్కులు కలిగిఉండటం వల్ల వ్యవసాయ రంగంపై కంపెనీల గుత్తాధిపత్యం పెరుగుతుంది. రైతులు ప్రతి ఏటా సొంతంగా విత్తనాలను దాచుకునే హక్కును కోల్పోయి, కంపెనీలపై ఆధారపడాల్సి వస్తుంది. అందుకే ఈ విషయంలో కఠినమైన నియంత్రణ కూడా అత్యంత అవసరం. ఏ దేశమైనా జన్యుమార్పిడి పంటలను అనుమతించే ముందు స్వతంత్ర పారదర్శకమైన క్షేత్రస్థాయి పరిశోధనలు జరపాలి. లాభాపేక్షతో కూడినప్రైవేట్ కంపెనీల పరిశోధనల పై మాత్రమే ఆధారపడకుండా, ప్రభుత్వ రంగ సంస్థలే స్వయంగా పరిశోధనలు చేపట్టి రైతులకు తక్కువ ధరలో సురక్షితమైన సాంకేతికతను అందించాలి. పర్యావరణాన్ని రక్షించుకుంటూనే, ఆకలిలేని సమాజాన్ని నిర్మిం చాలంటే సైన్స్ అందించే అద్భుతాలను ప్రకృతి నియమాలకు లోబడి, గట్టి నిఘా నీడలో ఉపయోగించుకోవడమే మానవాళికి శ్రేయస్కరం. ●

# వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

అప్పన్న గొనప

ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య ఆరోగ్య రంగం ఏ ప్రభుత్వానికైనా అత్యంత కీలకమైనది. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. అయితే ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బందికే ఉద్యోగ భద్రత లేకపోతే ఆ వ్యవస్థలో ఉన్న సమస్యలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో దీర్ఘకాలంగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న పారామెడికల్ సిబ్బంది, నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, డెంటల్ విభాగం సిబ్బంది, ఇతర వైద్య సహాయకఉద్యోగుల సమస్యలు ఈ కోవకు చెందుతాయి. గత అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ వైద్యవ్యవస్థలో సేవలందిస్తున్న ఉద్యోగులు తమ వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తూనే కుటుంబ పోషణ, పిల్లల చదువులు, గృహ అవసరాలు, భవిష్యత్తు ఆర్థిక భద్రతవంటి విషయాల్లో అనిశ్చితిని ఎదుర్కొంటున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. పదేళ్లకుపైగా, మరికొందరు పదిహేను నుంచి ఇరవై సంవత్సరాలవరకు కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్నట్లు ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. ఇంత సుదీర్ఘకాలం సేవలందించిన తరువాత కూడా ఉద్యోగ భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం వారి కుటుంబాలపై ఆర్థిక, సామాజిక ఒత్తిడిని పెంచుతోంది. ఈ సమస్యను కేవలం ఉద్యోగుల వ్యక్తిగత సమస్యగా కాకుండా,ప్రజారోగ్య వ్యవస్థకు సంబంధించిన విధానపరమైన అంశంగా ప్రభుత్వం చూడాలి. వైద్యరంగంలో వైద్యులు రోగులకు చికిత్స అందించడం ఎంత ముఖ్యమో, ఆ చికిత్స విజయవంతం కావడానికి అవసరమైన ఇతర సిబ్బంది సేవలు కూడా అంతే ముఖ్యమైనవి. వీరి సేవలు లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల రోజువారీ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించడం సాధ్యంకాదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యపై వివిధ ఉద్యోగ వర్గాలు తమ ఆందోళనలను వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశంపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాల్సినఅవసరం ఉంది. పారామెడికల్, నర్సింగ్, ఫార్మసీ, డెంటల్, ల్యాబ్, రేడియాలజీ, ఇతర వైద్య సహాయక విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది సేవా పరిస్థితులను సమగ్రంగా సమీక్షించాలి. ముఖ్యంగా దీర్ఘకాలంగా నిరంతర సేవలుఅందిస్తున్న ఉద్యోగుల నియామక విధానం, అర్హతలు, సేవాకాలం, మంజూరైనపోస్టులు, వేతనాలు,సామాజిక భద్రత వంటిఅంశాలపై శాఖలవారీగా వివరాలను సేకరించాలి. ఈసమస్య ఉద్యోగులకే పరిమితం కాదు. వైద్య ఆరోగ్యశాఖలో సిబ్బందికొరత, పనిభారం,



దీర్ఘకాలిక ఉద్యోగ అనిశ్చితి వంటి అంశాలు ఆసుపత్రుల నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం ఉంది. తగిన సంఖ్యలో సిబ్బంది అందుబాటులో లేకపోతే రోగులకు పరీక్షలు నిర్వహించడం,నివేదికలు అందించడం, మందులు పంపిణీ చేయడం, నర్సింగ్ సేవలు అందించడం వంటి కార్యకలాపాల్లో ఆలస్యం ఏర్పడవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, బోధనాసుపత్రులు, అత్యవసర వైద్య విభాగాల్లో సిబ్బంది అందుబాటు ఎంతో కీలకం. అందువల్ల ఉద్యోగుల సంక్షేమం, ప్రజలకు వైద్య సేవల నాణ్యత రెండింటినీ సమన్వయం చేసే విధానం అవసరం. దీర్ఘకాలంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత, వర్తించే సెలవులు,బీమా, ఇతర సామాజిక ప్రయోజనాలు కల్పించే అంశాలను ప్రభుత్వం పరిశీలించాలి. ఒకే రకమైన బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగుల మధ్య వేతనాలు, పని గంటలు, పని భారం, సేవా ప్రయోజనాల్లో ఉన్న వ్యత్యాసాలను సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం సమీక్షించాలి. శాశ్వత స్వభావం కలిగిన పోస్టులకు దీర్ఘకాలంగా తాత్కాలిక నియామకాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడుతోందో విశ్లేషించాలి. అవసరమైన చోట రెగ్యులర్ పోస్టులను మంజూరు చేసి పారదర్శక నియామక ప్రక్రియను కొనసాగించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవల క్రమబద్ధీకరణకు సంబంధించి చట్టపరమైన నిబంధనలు రూపొందించింది. కాబట్టి ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, అర్హత ప్రమాణాల ప్రకారం రెగ్యులరైజేషన్‌కు అర్హులైన ఉద్యోగుల కేసులను సమీక్షించాలి. పదిహేను సంవత్సరాలు లేదాఅంతకంటే ఎక్కువకాలం సేవలందించిన ఉద్యోగుల కేసులను ప్రత్యేకంగా పరిశీలించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవచ్చు. అయితే ప్రతి ఉద్యోగికి ఎలాంటి షరతులు లేకుండా ఆటోమేటిక్‌గా రెగ్యులరైజేషన్ కల్పించాలనే విధానం కాకుండా, నియామక పద్ధతి, విద్యార్హతలు, మంజూరైన పోస్టులు, వర్తించే చట్టాలు, న్యాయస్థానాల తీర్పులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక సమీక్షా కమిటీని ఏర్పాటుచేయడం సముచితం. వైద్యఆరోగ్య శాఖ, ఆర్థికశాఖ, అవసరమైన న్యాయ నిపుణులతో కూడిన కమిటీ ఉద్యోగుల సేవాకాలం, ఖాళీలు,నియామకవివరాలు, వేతనాలు, పెండింగ్ దరఖాస్తులపై సమగ్ర నివేదిక రూపొందించాలి. అర్హతఉన్నప్పటికీ వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి, వాటిపై నిర్ణీత కాలపరిమితిలో నిర్ణయాలు తీసుకోవాలి. రెగ్యులరైజేషన్‌కు అర్హతలేని ఉద్యోగుల విషయంలోనూ వర్తించే వేతనాలు, సామాజిక భద్రత, సేవల కొనసాగింపు వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి. అవసరమైన రెగ్యులర్ నియామకాలు చేపట్టడం, వేతనాలు సామాజిక భద్రతపై స్పష్టమైన విధానాన్ని రూపొందించడం ద్వారా వైద్య ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చు. ●

# ప్రజావాక్కు

### నోబెల్ దూరం

ప్రతి ఏడాది సాహిత్య నోబెల్ బహుమతి ప్రకటన సమయం రాగానే భారతీయ సాహిత్యాభిమానుల్లో ఒక ఆశ చిగురిస్తుంది. ఈసారి అయినా భారతీయ రచయితల్లో ఎవరికైనా ఆ అత్యున్నత గౌరవం దక్కుతుందేమోనని ఎదురు చూస్తారు. కానీ ఆ ఆశ నెరవేరడం మాత్రం అరుదుగానే కనిపిస్తోంది. 1913లో రవీంద్రనాథ్ ఠాగూర్ నోబెల్ బహుమతి అందుకున్న తర్వాత భారతదేశం మళ్లీ ఆ గౌరవాన్ని అందుకోలేకపోయింది. ఇది భారతీయ రచయితల్లో ప్రతిభలేకపోవడం వల్లకాదు. ప్రపంచ సాహిత్య రంగంలోప్రత్యేక ముద్రవేసినఆర్.కె.నారాయణ్, సల్మాన్ రష్దీ, విక్రమ్ సేథ్,అనితా దేశాయ్,రస్కిన్ బాండ్, అరుంధతిరాయ్ వంటి రచయితలు భారతీయ సంస్కృతి, చరిత్ర, సమాజం, మానవ సంబంధాలను అద్భుతంగా చిత్రించారు. వారి రచనలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది పాఠకులను ఆకట్టుకున్నాయి. భారతీయ రచయితల వైపు నోబెల్ కమిటీ మరింత విస్తృత దృష్టితో చూడాల్సిన అవసరం ఉంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### యువత ఏకం కావాలి

జెన్‌జి యువత, దేశవ్యాప్తంగా ఓటు చోరీజరిగిందని ఆందోళన చేస్తూ ఉంటే తమకి ఇదేమీ పట్టనట్టు ఉత్తరాంధ్ర యువత, ఇరుముడి, గరివిడి లక్ష్మి, బిగ్బాస్ అంటూ ఆ నేపథ్యంలో జరిగేచారిత్రక నేపథ్యాన్ని భుజాలకు ఎత్తుకొని రీల్స్ చేస్తూ ఉన్నారు. కొంతకాలం క్రితం బాహుబలి, ఆ తర్వాత పుష్ప అంటూ సినిమా వాళ్లకే డబ్బులు ధారాదత్తం చేస్తూఉన్నారు. మణిద్వీప వర్ణన అని ఏఐ వీడియో ఒకటి ఈ మధ్య చూశాను. మహా ఖర్చైతే దానికి వెయ్యి రూపాయలు మించి ఖర్చుఅవ్వదు. ఇలాంటి వాటిని ఉత్తరాంధ్రయువత ఎందుకు చూడడంలేదు. సత్యం,శాంతి బోధించేవి ఉత్తరాంధ్ర యువతకు నచ్చదా!

- వి. భాస్కర్ రావు, బొబ్బిలి

### పెరుగుతున్న అవినీతి

ప్రభుత్వం నెలనెల టంచన్‌గా అందించే వేలాది రూపాయల జీతాలతో ఎంతోహుందాగా ఉండాల్సిన కొంతమంది ఉద్యోగులు తమ దగ్గరకు ఏదేని పని నిమిత్తమై వచ్చిన సామాన్య ప్రజల నుంచి తమకు కావలసినంత సొమ్మును వసూలు చేస్తున్నారు. కాస్తో,కూస్తో సామాన్య ప్రజల నుంచి కాసులు గుంజనిదే వారికి ఆ రోజు నిద్రపట్టేలా లేదు అన్నట్లుగా ఉంది ఉద్యోగుల పనితీరు.

-ఎన్.మధు, నంద్యాలజిల్లా

### సత్వర పరిష్కారం అవసరం

రాజకీయాల పరిధిలోకి సుప్రీంకోర్టును లాగ వద్దని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ తనఅభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఒకపక్క సి.ఇ.సి.ని తొలగించాలని ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసి పడుతూంటే ప్రభుత్వం దీన్ని శాంతి భద్రతల దృష్ట్యా సత్వర చర్యలకు ఇంకా శ్రీకారం చుట్టలేదు. రానురాను ఇది హింసాత్మకంగా మారుతుందేమోనని ప్రజలు భయభ్రాంతులు చెందుతున్నారు. ఇవన్నీ గమనిస్తున్న సుప్రీంకోర్టు కేసులు వేస్తేనే పరిష్కరించగలమని చెప్పడం సమంజసంగా లేదనిపిస్తోంది. కనీసం ఈ ఆందోళనలకు సత్వర పరిష్కారం కనుగొనాలని ప్రభుత్వానికి ఉచిత సూచన చేసి ఉంటే హుందాగా ఉండేది. ఇప్పటికైనా మించిపోయింది లేదు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### స్మార్ట్‌ఫోన్ వ్యామోహం

నేటి రోజుల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా చాలామంది స్మార్ట్ ఫోన్ స్క్రీన్‌కు అతుక్కుపోతున్నారు. ఖాళీసమయం దొరికినా, పని మధ్యలో విరామం వచ్చినా చేతిలో ఫోన్ ఉండాల్సిందే. అవసరానికి ఉపయోగపడే ఫోన్ కాస్తా, అలవాటుగా మారి మన సమయాన్నంతా ఆక్రమిస్తోంది. గంటల తరబడి స్క్రీన్ చూడటంవల్ల కంటి అలసట, తలనొప్పి, నిద్రలేమి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. పక్కనే మనుషులున్నా ఫోన్‌లో ప్రపంచాన్ని వెతుకుతున్నాం. ఫోన్‌ను దూరం చేసుకోవాల్సిన అవసరం లేదు, కానీ దానికి మనల్ని మనం దూరం చేసుకోకూడదు. ఫోన్ మన అవసరాలకు ఉపయోగపడాలి కానీ మన జీవితంలోని ప్రతి క్షణాన్నీ ఆక్రమించకూడదు. స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగించడంలో తప్పులేదు. మన సమయాన్ని, ఆరోగ్యాన్ని, మనుషులతో అనుబంధాన్ని కాపాడుకుంటూ స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగించాలి. స్క్రీన్‌పై చూపు పెట్టే ప్రతి క్షణం కంటే, మన కోసం మనం గడిపే క్షణం మరింత విలువైనది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### కృత్రిమమేధ అవసరమే

ప్రపంచ సాంకేతిక రంగం వేగంగా మారుతున్న ఈ కాలంలో కృత్రిమమేధస్సు వినియోగం అనివార్యంగామారింది. భారతదేశం ప్రపంచస్థాయిలో పోటీసామర్థ్యాన్ని నిలబెట్టుకోవాలంటే కృత్రిమ మేధస్సు ఆధారిత పరిష్కారాలను విస్తృత స్థాయిలో స్వీకరించడం అవసరం. అలాగే ఈకొత్త సాంకేతికతకు అనుగుణంగా మానవ వనరులను నైపుణ్యాలతో తీర్చిదిద్దడం కూడా అత్యంత ముఖ్యమైన అంశం. కొంతమంది భావిస్తున్నట్లుగా కృత్రిమ మేధస్సు సాఫ్ట్‌వేర్ సేవల రంగానికి ముప్పు కాదు.

- సి.సాయిరుత్విక్, నల్గొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఇరాన్‌పై మళ్లీ దాడులు?

**- ఎన్నికల ప్రచారంలో ట్రంప్ తాజా హెచ్చరిక - నెతన్యాహుతో డొనాల్డ్ ఆంతరంగిక చర్చలు - అమెరికా - ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులుజరిపే యోచన - అంతర్జాతీయ మీడియాలో కథనాలు**

**వాషింగ్టన్, టెల్‌అవీవ్, అక్టోబరు 14:** ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. 'ఇరాన్‌కు మేం ఏం చేస్తామో వేచి చూడండి.. త్వరలోనే మా చర్యలు చూస్తార్ను అంటూ వ్యాఖ్యానించారు. అలాస్కాలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అయితే నవంబరు 3న జరగనున్న అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై దాడులు చేయబోమని గతంలో ప్రకటించిన ట్రంప్.. అదే సమయంలో ఇరాన్‌తో దౌత్య చర్చలు కొనసాగుతున్నాయని చెబుతున్నారు. ఎన్నికల సభలో ట్రంప్ మాట్లాడుతూ 'ఇరాన్‌కు మేం ఏం చేస్తామో వేచి చూడండి. దానికి గట్టి సమాధానం ఇస్తాం. ఏం జరుగుతుందో మీరే చూస్తార్ను అని వ్యాఖ్యానించారు. ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించకుండా అడ్డుకోవడం అత్యంత ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. 'ఇరాన్ దగ్గర అణ్వాయుధం ఉండకూడదు. అది ఎప్పటికీ జరగదు. ఆ అణు కార్యక్రమం వేల టన్నుల రాళ్ల కింద కూరుకుపోయింద్ని అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదిస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు చమురు ధరలు పెరిగినా భరించాల్సిందేనని అభిప్రాయపడ్డారు.

**దాడులకు సన్నాహాలా?:** ఇరాన్‌పై అమెరికా మళ్లీ భారీ స్థాయిలో సైనిక చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికా రక్షణ శాఖకు చెందిన పెంటగాన్.. ఇరాన్‌పై పెద్ద ఎత్తున యుద్ధ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాల్సి వస్తే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు అందుకున్నట్లు 'యాక్సియోస్' వార్తా సంస్థ వెల్లడించింది. అమెరికా అధికారులను ఉటంకిస్తూ ప్రచురించిన ఈ కథనం ప్రకారం.. సంభావ్య సైనిక చర్యలకు సంబంధించిన సన్నాహాలను పూర్తి చేయాలని అమెరికా సెంట్రల్ కమాండ్‌కు సూచించినట్లు సమాచారం. అయితే దాడులు ఎప్పుడు చేపట్టాలన్న దానిపై నిర్దిష్ట తేదీని ఆదేశాల్లో పేర్కొనలేదని నివేదిక తెలిపింది.

అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై సైనిక చర్యలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందని అమెరికా, ఇజ్రాయెల్ వర్గాలు భావిస్తున్నట్లు కూడా యాక్సియోస్ కథనం పేర్కొంది. ఇజ్రాయెల్‌లో జరగనున్న ఎన్నికలకు ముందు కూడా ఈ పరిణామం చోటుచేసుకోవచ్చన్న అంచనాలను ప్రస్తావించింది.

**నెతన్యాహుతో ట్రంప్ చర్చలు?:** ఇరాన్‌పై మరో భారీ సైనిక చర్య చేపట్టే అవకాశంపై ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చర్చించినట్లు గతంలో యాక్సియోస్ నివేదిక వెల్లడించింది. ఇరాన్ సైనిక స్థావరాలు,

అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని సంయుక్తంగా దాడులు చేసే అవకాశాన్ని ఇరువురు నేతలు పరిశీలించినట్లు అమెరికా, ఇజ్రాయెల్ అధికారులను ఉటంకిస్తూ తెలిపింది. అయితే దాడులు త్వరలోనే జరగనున్నాయన్న వార్తలను ట్రంప్ గతంలో తోసిపుచ్చారు. ఇరాన్‌తో అమెరికా సానుకూల చర్చలు జరుపుతోందని పేర్కొంటూ నవంబరు 3న జరిగే మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై దాడులు చేపట్టబోమని స్పష్టం చేశారు.



## విదేశీ ఉద్యోగులకు ట్రంప్ సర్కార్ షాక్

### వర్క్ పర్మిట్ ఆటోమేటిక్ పొడిగింపు రద్దు

**వాషింగ్టన్, అక్టోబరు 14:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో వలసదారులపై ఆంక్షలు కఠినతరం అవుతున్న నేపథ్యంలో.. యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డిహెచ్‌ఎస్) కీలక నిర్ణయం తీసుకుంది. పని అనుమతి (వర్క్ ఆథరైజేషన్) గడువు ముగిసిన తర్వాత కూడా రెన్యూవల్ అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నంత కాలం ఉద్యోగాలు చేసుకునేందుకు గతంలో ఉన్న సుదీర్ఘ పొడిగింపు నిబంధనను డిహెచ్‌ఎస్ అధికారికంగా రద్దు చేసింది. గతంలో జో బైడెన్ హయాంలో తీసుకువచ్చిన 540 రోజుల ఆటోమేటిక్ గ్రేస్ పీరియడ్ పొడిగింపును ఈ నూతన నిబంధన శాశ్వతంగా ముగిసింది. ఈ కొత్త నిబంధన అక్టోబరు 30, 2025 నుండి లేదా ఆ తర్వాత దాఖలయ్యే రెన్యూవల్ దరఖాస్తులకు వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. కొత్త పాలసీ ప్రకారం.. ప్రస్తుత ఇఎడి (ఎంప్లాయ్‌మెంట్ అథరైజేషన్ డాక్యుమెంట్) గడువు ముగిసిన తర్వాత, కొత్తగా పర్మిట్ ఆమోదం పొందే వరకు విదేశీ ఉద్యోగులు అమెరికాలో పనిచేయడానికి వీలుండదు. బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్, భద్రతా తనిఖీలు, అర్హతల పరిశీలనను మరింత పటిష్టంగా చేపట్టిన తర్వాతే ఉద్యోగ అనుమతులను పొడిగించాలనే లక్ష్యంతోనే ఈ మార్పులు చేసినట్లు డీహెచ్‌ఎస్ వెల్లడించింది. యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) ప్రాసెసింగ్ ఆలస్యం కారణంగా విదేశీ కార్మికులు ఉద్యోగాలు కోల్పోకుండా నిరోధించడానికి గతంలో ఈ గ్రేస్ పీరియడ్‌ను ఏర్పాటు చేశారు. అయితే.. నూతన నిర్ణయం వల్ల అమెరికాలోని భారతీయ నిపుణులు, హెచ్1బి వీసాదారుల జీవిత భాగస్వాములు పొందే హెచ్4 (బి4) ఇఎడి వినియోగదారులు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. దరఖాస్తుల ప్రాసెసింగ్‌లో ఆలస్యమై వర్క్ పర్మిట్ గడువు ముగిస్తే, భారతీయ ఉద్యోగులు తాత్కాలికంగా తమ ఉద్యోగాలకు దూరమవ్వాల్సి వస్తుంది. ఈ పరిణామాల నేపథ్యంలో వర్క్ పర్మిట్ గడువు ముగియడానికి కనీసం 180 రోజుల ముందే రెన్యూవల్ దరఖాస్తులను దాఖలు చేయాలని యుఎస్‌సిఐఎస్ దరఖాస్తుదారులకు సూచించింది.

## ఇజ్రాయెల్ వెళ్లే విమానాల్లో పాక్ పైలట్లు, సిబ్బందిపై నిషేధం

**టెల్‌అవీవ్, అక్టోబరు 14:** ఇటీవల దుబాయ్ నుంచి ఇజ్రాయిల్‌లోని టెల్ అవీవ్ వెళ్తు ఫ్లైదుబాయ్ విమానాన్ని కోపైలట్ కూల్చాలని ప్రయత్నించాడు. భారతీయ పైలట్ స్మిత్ మచ్చార్‌పై దాడి చేసి విమానాన్ని తన అదుపులోకి తీసుకోవాలని ప్రయత్నించాడు. స్మిత్ పోరాటంతో విమానంలోని ప్రయాణికులంతా క్షేమంగా బయటపడ్డారు. ఇదిలా ఉంటే, ఈ ఘటన తర్వాత ఇజ్రాయిల్ కఠిన చర్యలు తీసుకుంటోంది. తమ దేశానికి వచ్చే విమానాల్లో, తమ దేశంతో దౌత్య సంబంధాలు లేని పైలట్లు, సిబ్బంది లేకుండా చూడాలని ప్రపంచ ఎయిర్‌లైన్ సంస్థల్ని కోరింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్ వెళ్లే, అక్కడి నుంచి వచ్చే విమానాలు నడిపే విషయంలో పాకిస్తానీ పైలట్లు, క్యాబిన్ సిబ్బంది లేకుండా ఎయిర్ ఫ్రాన్స్ ఆంక్షలు విధించింది. పాకిస్తాన్‌తో పాటు ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలు లేని దేశాల సిబ్బందిని ఇకపై ఇజ్రాయిల్‌కు వెళ్లే ఫ్లైట్లలో అనుమతించరు. ఎయిర్ ఫ్రాన్స్‌తో పాటు మరిన్ని విమానయాన సంస్థలు ఇదే తరహాలో చర్యలు తీసుకుంటున్నాయి. చెక్ రిపబ్లిక్ దేశానికి చెందిన స్మార్ట్‌వింగ్స్ కూడా ఇజ్రాయిల్ నిబంధనల్ని పాటిస్తామని తెలిపింది.



## విద్యార్థులపై చేయి చేసుకొన్న ప్రతి ఒక్కరికి తప్పక శిక్షలు

### ప్రధాని మోడీ, అమిత్‌షాపై రాహుల్ ఫైర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 14:** కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో జరుగుతున్న పరిణామాలు, విద్యార్థుల నిరసనలపై బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిషాలకు వార్నింగ్ ఇచ్చారు. భారతదేశం అంటే హిందువులు, ముస్లింలు, కులాలు కావని అన్నారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని అంతా ఒకేసారి చేపట్టిన నిరసనలో భాతరదేశ స్వరం ఉందన్నారు. కానీ, ప్రధాని మోడీ, అమిత్ షాలు తమ ప్రజా స్వరానికి వ్యతిరేకంగా నిలబడ్డారని ఆరోపించారు. తమ స్వరానికి వ్యతిరేకంగా ఎవరు వెళ్లినా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రాహుల్ గాంధీ హెచ్చరించారు. రాజధాని ఢిల్లీలో ఆందోళనల సందర్భంగా పోలీసుల తీరుపై కూడా రాహుల్ గాంధీ స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. విద్యార్థులందరూ తమ వద్ద ఉన్న వీడియో రికార్డింగ్స్, సాక్ష్యాధారాలను భద్రపరచుకోవాలని, ఆ ఎవిడెన్స్‌ను తమకు పంపాలని సూచించారు. ఈ నిరసనల వ్యవహారం ముగిసిన తర్వాత ఆ సాక్ష్యాధారాలన్నింటినీ న్యాయపరంగా ఉపయోగించుకుంటామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, జ్ఞానేశ్ కుమార్, అమిత్ షా నుంచి మొదలుకుని తమ పిల్లలపై చేయిచేసుకుంటున్న ప్రతి ఒక్క కానిస్టేబుల్ వరకు.. ప్రతి ఒక్కరికీ శిక్ష పడేలా చూస్తామని రాహుల్ గాంధీ తేల్చి చెప్పారు.

## మహ్మద్ ప్రవక్తపై వ్యాఖ్యలు.. హిందూ వ్యక్తికి మరణశిక్ష నుంచి ఊరట

**జెడ్డా, అక్టోబరు 14:** దైవదూషణ ఆరోపణలో సౌదీ అరేబియాలో మరణశిక్షకు గురైన శ్రీలంకకు చెందిన హిందూ వ్యక్తి అనోజన్ శివరసకు ఊరట లభించింది. మహ్మద్ ప్రవక్తపై ఫేస్‌బుక్‌లో అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో అతడికి సౌదీ కోర్టు మరణశిక్ష విధించింది. అయితే, ఈ శిక్షను సౌదీ సుప్రీంకోర్టు నిలిపేసింది. శివరస మరణశిక్షను సౌదీ అత్యున్నత కోర్టు అక్టోబరు 13న రద్దు చేసినట్లు శ్రీలంక విదేశీ వ్యవహారాలు, విదేశీ ఉపాధి, పర్యాటక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. జూన్ చివరిలో శ్రీలంకలో జరిగిన ఒక హిందూ యాత్రలో యాత్రికులను అనుసరిస్తున్న ఒక కుక్కను ఒక ముస్లిం వ్యక్తి తన్నుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సోషల్ మీడియాలో ఒక యూజర్ హిందూ దేవీదేవతలపై అవమానకరమైన పోస్టింగ్ చేశాడు. దానికి ప్రతిస్పందనగా శివరస తమిళంలో ప్రవక్త గురించి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఆ తర్వాత దీనిని తొలగించి, క్షమాపణలు చెబుతూ మరో వీడియో పోస్ట్ చేశారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన స్క్రీన్ షాట్లు అప్పటికే వైరల్ అయ్యాయి. శ్రీలంకకు చెందిన కొందరు సౌదీలోని శివరస యజమానికి వీటిని పంపడంతో కేసు నమోదైంది.

## సిజెపి కో కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలకు 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 14:** ఆంక్షలను ఉల్లంఘించి జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు వెళ్లిన కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) కో కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలకు ఢిల్లీ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ మహేష్ కుమార్ మీనా 5 రోజులు జ్యుడీషియల్ కస్టడీని విధించారు. కస్టడీ విధిస్తూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించమని బాండ్లు సమర్పించినప్పటికీ, విడుదలైన తర్వాత మళ్లీ నిషేధిత స్థలమైన జంతర్ మంతర్ వద్ద ఆందోళనలకు పిలుపునిచ్చారని, ప్రజలను సమీకరించేందుకు ప్రయత్నించారని తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అక్టోబరు 14న మేజిస్ట్రేట్ ఉత్తర్వుల్లో సిజెపి ఇద్దరు నేతలు చట్టబద్ధమైన ఆదేశాలను ఉల్లంఘించినట్లు పేర్కొన్నాయి.

అక్టోబరు 10న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద సిజెపి భారీ నిరసనకు పిలుపునిచ్చింది. ఆ సమయంలో ముంబై నుంచి ఢిల్లీకి విమానంలో వచ్చిన అభిజిత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు విమానంలోనే అరెస్ట్ చేశారు. తర్వాతి రోజు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఆ సమయంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందన్న కారణంతో బిఎన్‌ఎస్‌ఎస్‌లోని సెక్షన్లు 126, 170 కింద ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ముగ్గురు కూడా తమ తప్పు అంగీకరించారని శాంతి, సత్ప్రవర్తనను కాపాడేందుకు ఒక్కొక్కరు రూ.50 వేల వ్యక్తిగత బాండ్, ష్యూరిటీ బాండ్ సమర్పించారని పోలీసులు తెలిపారు. యేడాది కాలం పాటు శాంతిభద్రతలను కాపాడాలని అప్పటి ఉత్తర్వుల్లో



ముగ్గురు సంతకం చేశారు. మరోవైపు తాము ఏ బాండ్‌పై సంతకం చేయలేదని సిజెపి నేతలు చెబుతున్నారు.

ఇప్పుడు మళ్లీ జంతర్ మంతర్ వద్ద నిరసనకు ప్రయత్నించడం, ఆంక్షల్ని ఉల్లంఘించడం, అధికారులు విధులకు అడ్డుకోవడం వంటి ఆరోపణలతో సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు. అక్టోబరు 13న కొందరు వ్యక్తులతో కలిసి ఇద్దరూ జెడియు ఆఫీస్ గోడ దూకి జంతర్ మంతర్ వద్దకు చేరుకుని నినాదాలు చేస్తూ అంతరాయం కలిగించారని ఫిర్యాదు పేర్కొంది. 5 రోజులు జ్యుడీషియల్ కస్టడీ తర్వాత అక్టోబరు 19కి తదుపరి విచారణ వాయిదా వేశారు. మరో సిజెపి నేత అజింక్య షిండేకు 6 నెలలపాటు శాంతి, సత్ప్రవర్తన కాపాడాలని ఆదేశించి, రూ.5000 వ్యక్తిగత బాండ్, ష్యూరిటీపై విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు.

## అమెరికా నుంచి సిజెపికి నిధులు

### - అమెరికన్ సింగర్ మేరీ బిల్‌బెన్ సంచలన ఆరోపణలు



**న్యూయార్క్, అక్టోబరు 14:** ఢిల్లీ ఆందోళనలు, కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) నిరసనల నేపథ్యంలో ప్రముఖ అమెరికా సింగర్ మేరీ మిల్‌బెన్ సంచలన ఆరోపణలు చేశారు. సిజెపికి అమెరికా నుంచి 'ఎంపిక చేసిన దాతల్ను నిధులు సమకూర్చు కుతున్నారని ఆమె ఆరోపించారు. 'ఎక్స్ను వేదికగా ఆమె ప్రధాన నరేంద్రమోడీకి మద్దతుగా, సిజెపికి వ్యతిరేకంగా పోస్ట్ చేశారు. ఎన్నికల జాబితాలో అక్రమాలు జరిగాయని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా కోట్ల సంఖ్యలో ఓటర్లను తొలగిస్తున్నారని, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ సిజెపి, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు నిరసనలు చేపడుతున్నాయి. ఈ నిరసనల వెనక విదేశీ శక్తుల కుట్ర ఉందని ఆమె ఆరోపించారు. "సంప్రదాయవాద ప్రపంచ నాయకులను లక్ష్యంగా చేసుకోవడం, ఆ దేశానికి చెందిన అమెరికాలో చదువుకున్న వ్యక్తిని గుర్తించడం, అతడిని తీవ్రవాద ధోరణుల వైపు మళ్లించడం, తిరిగి స్వదేశానికి పంపించి గందరగోళం, విధ్వంసం సృష్టించేందుకు నిధులు సమకూర్చడం్ఠ ఈ విధానంలో భాగమ్ను అని ఆమె ఆరోపించారు. అమెరికాకు చెందిన దాతలు ఈ కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తున్నారని అన్నారు. అయితే, ఇలాంటి చాలా ప్రయత్నాలు విఫలయమ్యాయని, అయినప్పటికీ ఆయా దేశాల అభివృద్ధి, పాలనపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆమె అన్నారు. సిజెపి వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే పేరు నేరుగా తీసుకోకుండా పరోక్షంగా ఆమె వ్యాఖ్యానించారు. భారతదేశ పాలనను దెబ్బతీసేందుకు విదేశీ శక్తులు చేసే ప్రయత్నాలను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు మోనంగా ఉండాల్సిన సమయం కాదని, యువత దేశ ప్రయోజనాల కోసం ముందుకు రావాలని కోరారు.



## మహారాష్ట్రలో రైతులకు దీపావళి కానుక

### ఖాతాల్లో రూ.5 వేలు జమ

**పుణె, అక్టోబరు 14:** మహారాష్ట్రలో తీవ్రమైన కరవు పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతన్నలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. రాష్ట్రంలో నెలకొన్న దయనీయ పరిస్థితుల దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వం నుంచి సాయం అందే వరకు వేచి చూడకుండా ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.5,000 చొప్పున తక్షణ ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఈ మొత్తాన్ని నేరుగా దీపావళి పండుగ కంటే ముందే రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. రాష్ట్రంలోని మొత్తం 36 జిల్లాల్లోని సుమారు 34 జిల్లాల పరిధిలోని 305 తాలూకాలను ప్రభుత్వం ఇప్పటికే కరవు పీడిత ప్రాంతాలుగా ప్రకటించింది. ఇది దాదాపు రాష్ట్ర మొత్తం భూభాగంలో 75 శాతం కావడం గమనార్హం. మరాఠ్వాడా, విదర్భ, ఉత్తర మహారాష్ట్ర, పుణె సహా అన్ని రెవెన్యూ డివిజన్లలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయి. ముఖ్యంగా సోలాపూర్ జిల్లాలో సాధారణ వర్షపాతంలో సగం కన్నా తక్కువగా కేవలం 48శాతమే వర్షం కురవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఉపశమన చర్యలను చేపట్టింది.

## మీరట్ బ్లూ డ్రమ్ మర్డర్‌కేసులో భార్య, ప్రియునికి మరణశిక్ష



### మీరట్ కోర్టు సంచలన తీర్పు

**అలహాబాద్, అక్టోబరు 14:** దేశవ్యాప్తంగా ఎంతో సంచలనం సృష్టించిన మీరట్ 'బ్లూ డ్రమ్ మర్డర్ను కేసులో మీరట్ కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. భర్త సౌరభ్ రాజ్‌పుత్‌ను చంపినందుకు భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్‌లకు మరణశిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. హత్య, హత్యకు సంబంధించిన సాక్ష్యా లను నాశనం చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరిని కోర్టు సెప్టెంబరు 30న దోషులుగా నిర్ధారించింది. తాజాగా వీరిద్దరికి ఉరిశిను ఖరారు చేసింది. మార్చి 3, 2025లో ముస్కాన్ రస్తోడి, సాహిల్ కలిసి సౌరభ్ రాజ్‌పుత్‌ను హత్య చేసి, అతడి శరీర భాగాలను ముక్కలు చేసి, ఒక బ్లూ డ్రమ్‌లో వేసి దానిని సిమెంట్‌తో ప్యాక్ చేశారు. 15 రోజుల తర్వాత ఈ హత్య విషయం వెలుగులోకి వచ్చింది. జులై 2025లో జిల్లా జడ్జి కోర్టులో విచారణ ప్రారంభమైంది. పోలీసులు దాదాపు 1,000 పేజీల ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. 126 తేదీలలో విచారణలు జరిగాయి. 22 మందికి పైగా సాల వాంగ్మూలాలను నమోదు చేశారు. సుదీర్ఘ విచారణ తర్వాత, సెప్టెంబరు 19న కోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా శిక్ష విధించింది.

**లండన్ నుంచి వచ్చిన భర్తను చంపేసిన ముస్కాన్, ఆమె లవర్:** సౌరభ్ రాజ్‌పుత్ 2025 ఫిబ్రవరి 24న లండన్ నుంచి మీరట్ తిరిగి వచ్చారు. ఆయన లండన్‌లో మర్చంట్ నేవీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. సౌరభ్ తిరిగి వచ్చిన తర్వాత రోజు ముస్కాన్ ఇంట్లో పెద్ద పార్టీ ఇచ్చింది. ఫిబ్రవరి 28న కుమార్తె పీహు పుట్టిన రోజు జరిగింది. ఆ తర్వాత మార్చి 3న ముస్కాన్ సౌరభ్ ఆహారంలో నిద్ర మాత్రలు కలిపింది. ఆ తర్వాత సాహిల్ శుక్లా సహాయంతో శరీరాన్ని నాలుగు ముక్కలు చేసి, ఒక నీలి రంగు డ్రమ్‌లో ప్యాక్ చేసి సిమెంట్‌తో కప్పేశారు. మార్చి 4న, కుమార్తె పీహూను వాళ్ల అమ్మమ్మ ఇంట్లో వదిలేసి సాహిత్‌లో ముస్కాన్ హిమాచల్ ప్రదేశ్ వెళ్లింది.

మార్చి 17న ముస్కాన్ ఇంట్లో జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. ఆ తర్వాత మార్చి 18న పోలీసులు డ్రమ్ములో సౌరభ్ మృతదేహాన్ని కనుగొన్నారు. ఈ కేసులో నీలి రంగు డ్రమ్ము, ట్రాలీ బ్యాగ్ ఆధారాలుగా మారాయి. వీటిని కోర్టులో ప్రవేశపెట్టారు. దీని తర్వాత 2026లో వీరిద్దరి కాల్ వివరాలు, చాట్ హిస్టరీ, మొబైల్ లొకేషన్ సమాచారంతో కోర్టుకు నివేదిక సమర్పించారు. ఏప్రిల్ 21న ముస్కాన్, సాహిల్ లపై ఆరోపణలను కోర్టు విచారించింది. ఆరోపణల్ని ఇద్దరూ అంగీకరించారు. పోలీసులు 34 మంది సాక్షుల పేర్లతో 1,000 పేజీల ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. సౌరభ్ సోదరుడు బబ్లూ కోర్టులో సాక్ష్యం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు, వైద్యులు, డ్రమ్ అమ్మేవారు ఇలా అందరి సాక్ష్యాలను పరిగణలోకి తీసుకుని దోషులుగా కోర్టు నిర్ధారించింది.

## పౌరులను శత్రువులుగా చూస్తున్నారు

### - తమిళనాడు ప్రభుత్వంపై మద్రాస్ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

**చెన్నై, అక్టోబరు 14:** తమిళనాడులో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) రూట్ మార్చ్ నిర్వహణకు పోలీసులు అనుమతి నిరాకరించడం తీవ్ర విమర్శలు దారి తీస్తుంది. ఈ క్రమంలో మద్రాస్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆర్ఎస్ఎస్ మార్చ్‌కు అనుమతి నిరాకరణను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా న్యాయస్థానం మౌఖికంగా కీలక వ్యాఖ్యలు చేసింది. "ఈ ప్రభుత్వం ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలకైనా వ్యతిరేకంగానే వ్యవహరిస్తోంది. ద్రవిడార్ కజగం (డికె) అయినా, ఆర్ఎస్ఎస్ అయినా అందరికీ అనుమతులను నిరాకరిస్తోంద్ని అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నిరసనలు, ఊరేగింపుల దరఖాస్తులను తిరస్కరించడమే పనిగా పెట్టుకుందని, ప్రభుత్వం ప్రజలను, పౌరులను శత్రువులుగా పరిగణిస్తోందంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యలను సాకుగా చూపుతూ ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించే ర్యాలీలకు అనుమతి నిరాకరించే ధోరణి సరైంది కాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. గతంలోనూ పలుమార్లు కోర్టు ఆదేశించినప్పటికీ అధికారులు వరుసగా అనుమతులు నిరాకరించడాన్ని పిటిషనర్లు ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. భిన్న భావజాలాలు కలిగిన సంస్థలు శాంతియుతంగా కార్యక్రమాలు నిర్వహించుకునే ప్రాథమిక హక్కును అణచివేయడం సరికాదని, నిబంధనలకు లోబడి షరతులతో కూడిన అనుమతులు ఇవ్వవచ్చని కోర్టు పేర్కొంది.

## సంక్షిప్త వార్తలు

### నినాదాలతో అభివృద్ధి రాదు: మోహన్‌భగవత్

**నాగ్‌పూర్, అక్టోబరు 14:** ఒక దేశ ప్రగతి, ఉన్నతి కేవలం నాయకులు, రాజకీయ పార్టీలు, ఆకర్షణీయమైన నినాదాల వల్ల మాత్రమే సాధ్యం కాదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. జాతి నిర్మాణంలో ప్రజల పాత్ర అత్యంత ప్రాధాన్యత కలిగినదని పేర్కొంటూ "నాయకులు, నినాదాలు, ప్రభుత్వ విధానాలు, రాజకీయ పార్టీలు, ప్రచారాలు, సరికొత్త ఆలోచనలు దేశానికి సరైన దిశానిర్దేశం చేయగలవు.. కానీ అవి మాత్రమే స్వతంత్రంగా దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దలేవ్ను అని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ మార్పులు లేదా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా మాత్రమే సమాజ భవిష్యత్తు మారదని, వ్యవస్థలో మౌలిక మార్పు రావాలంటే అట్టడుగు స్థాయి నుంచి పౌరులందరి భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు.



### ఢిల్లీ ఎయిర్‌పోర్టులో దీప్కేకు పరాభవం

**న్యూఢిల్లీ, అక్టోబరు 14:** కాక్రోచ్ జనతా పార్టీ వరుస ఎదురుదెబ్బలు ఎదుర్కొంటోంది. ఇప్పటికే సిజెపి కో కన్వీనర్లు జంతర్ మంతర్ వద్ద ఆంక్షలను ఉల్లంఘించినందుకు 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది కోర్టు. మరోవైపు, సిజెపిపై ఓ వర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సిజెపి కన్వీనర్ అభిజిత్ దీప్కేకు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తీవ్ర అవమానం ఎదురైంది. ఆయన సొంత రాష్ట్రం మహారాష్ట్ర నుంచి ఢిల్లీకి చేరుకున్న సందర్భంలో కొందరు ప్రయాణికులు ఆయనను ఉద్దేశించి 'దొంగ దొంగ్ను అంటూ నినాదాలు చేశారు. ఓ ప్రయాణికుడు దీప్కేను ఉద్దేశిస్తూ 'మీరు దేశాన్ని ఎందుకు అస్థిరపరచాలని ప్రయత్నిస్తున్నారు? అని నిలదీశారు. ఇప్పుడు దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



### సిజెపికి రాహుల్ మద్దతు: ధన్యవాదాలు తెలిపిన దీప్కే

**న్యూఢిల్లీ, అక్టోబరు 14:** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సిజెపి నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలు నిరసన చేపట్టగా.. వారికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంఘీభావం తెలిపారు. ప్రశాంతంగా ఆందోళన చేస్తున్నవారిని పోలీసులు అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. జాతీయ జెండాను చూపిస్తూ.. శాంతియుతంగా నిరసన తెలపడం నేరం కాదన్న రాహుల్ గాంధీ.. అలా నిరసనలు చేస్తున్న యువకులపై కేసులు పెట్టి జైలుకు పంపడమేమిటని ప్రశ్నించారు. రాజ్యాంగ హక్కుల్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, జంతర్ మంతర్‌ను తిరిగి నిరసన ప్రదేశంగా సాధించుకుంటామని 'ఎక్స్ను వేదికగా చేసిన పోస్టుల్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ తమకు మద్దతివ్వడంపై సిజెపి వ్యవస్థాపకుడైన అభిజీత్ దీప్కే స్పందించారు. మద్దతు ప్రకటించిన రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలిపారు.

### విమానాల్లో పవర్ బ్యాంకులపై నిషేధం: డిజిసిఎ

**కోల్‌కతా, అక్టోబరు 14:** విమాన ప్రయాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుల భద్రతను ప్రమాదంలోకి నెడుతున్న ఒక నిర్దిష్ట బ్రాండ్‌కు చెందిన పవర్ బ్యాంక్‌ను విమానాల్లో తీసుకెళ్లడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అక్టోబరు 11న చండీగఢ్ నుండి చెన్నై వెళ్తున్న ఇండిగో విమానంలో ప్రయాణీకుల ఓవర్‌హెడ్ బిన్ (సామాను పెట్టుకునే స్థలం)లో ఉంచిన ఒక పవర్ బ్యాంక్ పేలిపోయింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది విమానాన్ని అత్యవసరంగా హైదరాబాద్‌కు మళ్లించి, ప్రయాణికులను సురక్షితంగా అత్యవసరంగా దించారు. ఈ ప్రమాదానికి కారణమైన డివైజ్‌పై విచారణ జరిపిన డిజిసిఎ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

### ఎయిరిండియా విమానం హైజాక్ కలకలం

జైపూర్, అక్టోబరు 14: ఎయిరిండియా విమానం హైజాక్ కలకలం రేపింది. ఇటీవల ఫ్లైదుబాయ్, బ్రిటిష్ విమానాల మాదిరిగా ఎయిరిండియా నుంచి ఎమర్జెన్సీ కోడ్ స్క్వాక్ 7500 వెలువడింది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి ఢిల్లీకి వస్తున్న ఎయిరిండియా విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. విమానాన్ని రాజస్థాన్‌లోని జైపూర్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేసినట్లు సమాచారం. బుధవారం విమానం నుంచి వచ్చిన అలర్ట్‌ను అహ్మదాబాద్ ఎయిర్ ట్రాఫిక్‌కంట్రోల్ గుర్తించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అనంతరం విమానాన్ని సురక్షితంగా జైపూర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దించారు.

# దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థకు ఐఎస్ఓ గుర్తింపు

### నాలుగు విభాగాల్లో నాణ్యతా ప్రమాణాల మార్క్

**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** విద్యుత్ పంపిణీ రంగంలో నాణ్యతా ప్రమాణాల అమలు, సమాచార భద్రత, స్టోర్స్ నిర్వహణ, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు (ఎస్పీడీసీఎల్) అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్ఓ) గుర్తింపు లభించింది. అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా ఎస్పీడీసీఎల్ నాలుగు అంశాల్లో ఈ ధృవపత్రాలను అందుకుంది. వీటిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా సంస్థ సిఎండి జితేష్ వి పాటిల్ బుధవారం వీటిని అందుకున్నారు. సంస్థలోని కార్యాలయాలు, వివిధ విభాగాల్లో నాణ్యతా నిర్వహణ విధానాలను సమర్థంగా అమలు చేయడం, రికార్డుల నిర్వహణ, అంతర్గత నియంత్రణ, పర్యవేక్షణ, కార్యాచరణ ప్రక్రియలను మెరుగుపరచడం, నిరంతర అభివృద్ధికి కృషి చేయడం వంటి అంశాలకు సంబంధించి ఐఎస్ఓ 9001 గుర్తింపు లభించింది. అలాగే విద్యుత్ పంపిణీ వ్యవస్థకు సంబంధించిన ఐటీ నెట్‌వర్క్‌లు, కీలక సమాచారం, డేటా పరిరక్షణ, సమాచార ప్రాప్యతపై నియంత్రణ, సైబర్ ముప్పుల నిర్వహణ వంటి అంశాల్లో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తున్నందుకు ఐఎస్ఓ 27001 గుర్తింపు లభించింది. ఇక విద్యుత్ పంపిణీ వ్యవస్థకు అవసరమైన పరికరాలు, సామగ్రి నిల్వ, వాటి నిర్వహణలో క్రమశిక్షణను పెంపొందించేందుకు జపాన్‌లో అభివృద్ధి చేసిన 5 ఎస్ విధానాన్ని అమలు చేయడం ద్వారా మరో గుర్తింపు లభించింది. అదేవిధంగా వినియోగదారులకు నాణ్యమైన, విశ్వసనీయమైన విద్యుత్ సేవలు అందించేందుకు గత ఐదేళ్లుగా దక్షిణ తెలంగాణ విద్యుత పంపిణీ సంస్థ చేస్తున్న కృషికి గుర్తింపుగా క్వాలిటీ మార్క్ లభించింది. సంస్థలో నాణ్యతా ప్రమాణాలను పాటించడం, సమాచార భద్రతను బలోపేతం చేయడం, స్టోర్స్ నిర్వహణను క్రమబద్ధీకరించడం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం వంటి అంశాల్లో చేస్తున్న కృషికి ఈ గుర్తింపులు ప్రతిఫలంగా నిలుస్తున్నాయని ఈ సందర్భంగా సంస్థ సిఎండి జితేష్ అన్నారు. భవిష్యత్తులోనూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేయడం, నిర్వహణలో పారదర్శకతను పెంపొందించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం, వినియోగదారుల సంతృప్తికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ సేవలను మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. నాలుగు నాణ్యతా గుర్తింపులు సంస్థకు గౌరవాన్ని తీసుకురావడమే కాకుండా, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించేందుకు స్ఫూర్తినిస్తున్నాయన్నారు.

# దసరా తరువాత కార్పొరేషన్ పదవుల పంపిణి

### ఓట్ల జాబితా రిగ్గింగ్ చేసిన సిఇసి జ్ఞానేశ్వర్ ఆధారాలతో బయటపడ్డారు

### కెసిఆర్ సెంటిమెంట్ రెచ్చగొట్టి టైంపాస్ చేశారు

### టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఇష్టాగోష్టి వ్యాఖ్యలు

**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** రాజకీయాలకోసం మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు రాముడికి రాజకీయాలకు ఏంటి సంబంధం అని టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గాంధీ భవన్ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ అయోధ్య బాబ్లీ మసీదులోని రామ మందిరానికి భూమి పూజ చేసింది రాజీవ్ గాంధీ అని గుర్తుచేశారు. సిఇసి జ్ఞానేశ్వర్ కుమార్ చేసిన ఓటర్ల జాబితా రిగ్గింగ్ అక్రమాలు ఆధారాల తో సహా బయట పడుతున్నాయనీ, 2029 లో ఎవరు ఓడిపోబోతరన్నదీ ప్రజలు చెప్తున్నారనీ, అమిత్‌షాకాదని ఆయన ఎద్దేవా చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశం ప్రమాదం లో ఉందనీ ఆవేదన చెందారు. బిజెపి పాలనలో సామాన్యులకు ఏమి జరగలేదనీ సంపన్నులకు మాత్రమే లక్షల కోట్ల రుణాలు మాఫి చేశారనీ అన్నారు. బిజెపి మొలకెత్తడానికి వాజ్ పేయి, సుస్మా స్వరాజ్ కారణం వాళ్ళు లేకుంటే బిజెపి మొలకెత్తేదా? ప్రజా స్వామ్యం లో నిరసన తెలిపే హక్కును కాల రాస్తాం అంటే ఎట్లా? అని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. బిజెపి మతతత్వ పార్టీకి వ్యతిరేకంగా ఎవరు పోరాడిన వాళ్లకు మద్దతు ఇస్తామనీ సిజెపి, ఇండియా కూటమి ఎవరి వారే పోరాటం చేస్తున్నారనీ వివరించారు. ప్రజా స్వామ్యంలో మనం వ్యవహరించే విధానం, మాట్లాడే తీరు, భాష గౌరవం ఉండాలనీ హితవు చెప్పారు. మహిళా జర్నలిస్టుల ను అవమానించారని రాహుల్ గాంధీ పై చౌకబారు చిల్లర ఆరోపణలు చేయడం తగదని అన్నారు. రాహుల్ గాంధీ ఖర్గేకు షూస్ లేస్ కట్టారనీ ఆయన తెలిపారు. దసరా తర్వాత రెండు లక్షల మంది తో లాంగ్‌మార్చ్ తో పాటు భారీ బహిరంగ సభ నిర్వహించాలని రాహుల్ గాంధీ కెసి వేణుగోపాల్ చెప్పారనీ గుర్తుచేశారు. దక్షిణాది రెండు రాష్ట్రాలలో సభ లు నిర్వహించాలని హై కమాండ్ నిర్ణయమనీ అన్నారు. 15 ఏండ్ల నుండి ఆర్టీసి ఎన్నికలు లేవు కాబట్టి నిర్వహించామనీ ఓడినా గెలిచినా కార్మికుల శ్రేయస్సు కు కట్టుబడి ఉన్నామనీ చెప్పారు. రెండు పట్టభద్రుల ఎన్నికల కోసం సీరియస్ గా ప్రయత్నం చేస్తున్నామనీ 23 న సిఎం తో ఎంసిహెచ్ ఆర్‌డిలో పట్టభద్రుల ఎన్నికల సమావేశం ఉంటుందని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లతో సమావేశం జరుగుతోందని వివరించారు. ఎర్రవల్లిలో 45ఎకరాలు ఎవరి కబ్జాలో ఉన్నాయో విచారణ జరుగుతుందనీ, కవిత ఫ్యామిలీ గురించిఎక్కువగా వాస్తవాలు మాట్లాతుందనీ కితాబు ఇచ్చారు. కవిత మాట్లాడే వాస్తవాలు అన్ని ప్రజలకు అర్థం అవుతుందనీ చెప్పారు. ఫామ్ హౌస్ ల మీద దాడి చేయాలని మా అభిమతం కాదు నీతి మంతులం అని చెప్పుకుంటున్న వాళ్ళు గురించి ప్రజలకు అసలు విషయాలు తెలియాలని ఫామ్ హౌస్ విజిట్ చేశామని సమర్థించుకొన్నారు. బిఆర్ఎస్ సింగరేణి గర్జనకు అర్థం లేదు మేమే సింగరేణి కార్మికులకు ఫలాలు ఇస్తున్నామనీ అన్నారు. ఎలినినో అనేది ప్రకృతి ప్రభావం వల్ల వచ్చిందని ,పది ఏండ్లు కెసిఆర్ ప్రతి దాన్ని రాజకీయం చేశారనీ కెసిఆర్ సెంటిమెంటును రెచ్చగొట్టి టైం పాస్ చేశారని మహేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రం లో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌మంచి మెజారిటీతో అధికారంలోకి వస్తుందనీ ధీమా వ్యక్తం చేశారు. కష్ట పడ్డవారికి న్యాయంజరగాలని భావిస్తున్నామని కార్పొరేషన్ పదవులు ఆలస్యంఅవుతున్నాయి దాసరా వరకు వచ్చే అవకాశం ఉందనీ అన్నారు.

# పేదల సంక్షేమ హాస్టళ్లలో రూ.800 కోట్ల నిత్యావసర సరకుల కుంభకోణం

### అమీర్‌పేట కేంద్రంగా తెరవెనుక సీనియర్ ఐఎఎస్

### బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ ఫైర్

**హైదరాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** తెలంగాణలోని సాంఘిక సంక్షేమ, గిరిజన, బిసి, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖల పరిధిలోని 3 వేలకు పైగా రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లు, కస్తూర్బా విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యావసర సరుకుల సరఫరా పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 800 కోట్ల భారీ కుంభకోణానికి తెరలేపిందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పారదర్శకత పేరిట కేంద్రీకృత టెండర్లు పిలిచి, గతంలో పలు రాష్ట్రాల్లో తీవ్ర అవినీతి ఆరోపణలతో బ్లాక్‌లిస్ట్‌లో ఉంచబడిన నాకాఫ్ సంస్థకు ఈ వందల కోట్ల కాంట్రాక్టును కట్టబెట్టడం వెనుక భారీ ముడుపులు చేతులు మారాయని ఆరోపించారు. ఈ నాకాఫ్ సంస్థకు దేశవ్యాప్తంగా కళంకిత చరిత్ర ఉందని, 2022-23 రబీ సీజన్‌లో తెలంగాణ మార్క్‌ఫెడ్ నుంచి ధాన్యం తీసుకెళ్లకపోవడంతో ప్రభుత్వం రూ. 65 కోట్ల డిపాజిట్‌ను జప్తు చేసి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిందని గుర్తుచేశారు. అంతేకాకుండా జార్ఖండ్‌లో ధాన్యం కొనుగోలు వివాదంలో, ఒడిశాలో పసిపిల్లలకు పంపిణీ చేసే మదర్ అండ్ బేబీ కిట్ల సరఫరాలో నాసిరకం సరుకుల కారణంగా ఒడిశా మెడికల్ కార్పొరేషన్ ఈ సంస్థను మూడేళ్ల పాటు బ్లాక్‌లిస్ట్ చేసిందని వెల్లడించారు. అంతటి రికార్డు చెడ్డ సంస్థకు పేద విద్యార్థుల నోటికాడ కూడు పెట్టే కాంట్రాక్ట్‌ను అప్పగించడం ముఖ్యమంత్రి పర్యవేక్షణా లోపానికి నిదర్శనమని మండిపడ్డారు.

# తెలంగాణలో వివిధ రంగాల్లో భాగస్వామ్యానికి బ్రిటన్ ప్రతినిధుల ఆసక్తి

### డిసెంబర్‌లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు బ్రిటన్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం





**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందని, ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం కొనసాగుతుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బ్రిటన్ వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. రాబోయే కొన్నేళ్లలో తయారీ రంగాన్ని భారీగా విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని చెప్పారు. బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో బ్రిటన్‌లోని యార్క్‌షైర్ ప్రాంతానికి చెందిన మేయర్ల నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. సౌత్ యార్క్‌షైర్ మేయర్ ఆలివర్ కాపార్డ్, యార్క్ అండ్ నార్త్ యార్క్‌షైర్ మేయర్ డేవిడ్ స్కైత్, వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్ ఈ బృందానికి నాయకత్వం వహించారు. ఇటీవల భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (దినిగితి) నేపథ్యంలో తెలంగాణతో వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, విద్య, సాంస్కృతిక రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశంలో అత్యంత యువ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ అనతికాలంలోనే ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, రక్షణ, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. తెలంగాణ ఇప్పుడు కేవలం దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంలోని అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీ పడుతోందని చెప్పారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు బ్రిటన్ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు హాజరు కావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళిక, తెలంగాణ రైజింగ్-2047 గురించి ముఖ్యమంత్రి వివరించారు. 2025 డిసెంబర్‌లో ఆవిష్కరించిన ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అంతర్జాతీయ నాయకులు, ప్రముఖ ఆర్థికవేత్తలు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తల సూచనలతో ఈ అభివృద్ధి ప్రణాళిక రూపొందిందని తెలిపారు. కృత్రిమ మేధ(ఎఐ) విస్తరిస్తున్న నేపథ్యంలో యువతకు ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రముఖ కంపెనీల ప్రత్యక్ష భాగస్వామ్యంతో యువతకు శిక్షణ ఇచ్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను త్వరలో ఆవిష్కరిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. మూసీ నది పునరుజ్జీవం ద్వారా హైదరాబాద్‌లో రివర్‌ఫ్రంట్ ఎకానమీ, నైట్ ఎకానమీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ప్రణాళికను వివరించారు. అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలోనూ 2025 మే నెలలో హైదరాబాద్‌లో 72వ మిస్ వరల్డ్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఈ సందర్భంగా బ్రిటన్ ప్రతినిధులు తెలంగాణతో అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, వైద్య ఆరోగ్యం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్నికల్ టెక్స్‌టైల్స్, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన రంగాల్లో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ భాగస్వామ్యాన్ని ప్రత్యక్ష వాణిజ్య ఒప్పందాలు, పెట్టుబడులు, విద్యా సంస్థల మధ్య సహకారంగా మార్చేందుకు త్వరలో మరోసారి తెలంగాణలో పర్యటించాలని భావిస్తున్నట్లు తెలిపారు. సౌత్ యార్క్‌షైర్ మేయర్ ఆలివర్ కాపార్డ్ మాట్లాడుతూ, యార్క్‌షైర్ ప్రాంతంలో వివిధ రంగాలకు చెందిన సుమారు 1.50 లక్షల వ్యాపార సంస్థలు ఉన్నాయని తెలిపారు. దేశంలో అత్యధిక తలసరి జీఎస్‌డీపీ కలిగిన రాష్ట్రంగా తెలంగాణను ప్రస్తావిస్తూ, రెండు ప్రాంతాల ఆర్థిక ప్రయోజనాలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. తెలంగాణలోని డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార విస్తరణ అవకాశాలు ఎంతో ఆకట్టుకున్నాయని ప్రశంసించారు.

వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్ మాట్లాడుతూ, యార్క్‌షైర్, తెలంగాణ మధ్య అనేక సారూప్యతలు ఉన్నాయని, రెండు ప్రాంతాలు సోదర భావంతో కలిసి పనిచేసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి... యుకె-ఇండియా సిఇటిఏ అండ్ రీజినల్ సినర్జీస్ పేరుతో యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ (యుకెఐబిఎస్) రూపొందించిన నివేదికను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈవో కిషోర్ జయరామన్, హైదరాబాద్ బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ ప్రతినిధులు, సిఎం సలహాదారులు కె. రామకృష్ణారావు, సిఎస్ సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బాహుబలి మోటార్లు ప్రారంభించిన మంత్రి జూపల్లి

### ఉమ్మడి పాలమూరు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం, చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం





బాహుబలి మోటార్లు ప్రారంభించిన మంత్రి జూపల్లి , నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద విడుదలవుతున్న నీరు

**కొల్లాపూర్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ బాహుబలి మోటార్లను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ మోటార్ల ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపో యనున్నారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయకుండానే.. దీన్ని జాతికి అంకితం చేశారని, కానీ కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, ఇతర పనులను గత ప్రభుత్వం చేపట్టలేదని విమర్శించారు.

ప్రాజెక్టును గత పాలకులు పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడు తున్నారని మండిపడ్డారు. పాలమూరు రైతాంగం ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే బీఆర్ఎస్ నేతలు ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన గత పాలకులు, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదో ప్రజలకు వివరించాలని నిలదీశారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడం, వ్యవసా యానికి అవసరమైన నీటిని అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యమని జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్థానిక ప్రజాప్రతి నిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### పేదల సామాజిక భద్రతకు మరింత భరోసా

# దివ్యాంగుల సంక్షేమానికి పెరిగిన ఆసరా

### 53,428 కోట్లతో రానున్న ఐదేళ్లపాటు పిఎం సామాజిక సహాయత యోజనకు కేంద్ర కేబినెట్ ఆమోదం

### దివ్యాంగుల కేంద్ర పెన్షన్ సహాయం 25శాతం పెంపు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** దేశంలోని పేద కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం సంతోషకరం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని పునర్వ్యవస్థీకరించి, ప్రధానమంత్రి సామాజిక సహాయత యోజనగా 2026-27 నుంచి 2030-31 వరకు ఐదేళ్ల పాటు రూ. 53,428 కోట్ల వ్యయంతో కొనసాగించేందుకు కేంద్ర కేబినెట్ ఆమో దం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన వృద్ధులు, వితం తువులు, దివ్యాంగులకు ఈ పథకం అండగా నిలుస్తుందన్నారు. ముఖ్యంగా దివ్యాంగుల పెన్షన్ అర్హతలను సడలించడం, సహాయ మొత్తాన్ని పెంచడం, మరింతమందిని పథకం పరిధిలోకి తీసుకురావడం.. సామాజిక భద్రతను విస్తరించే దిశగా మోడీ ప్రభుత్వం తీసుకున్న కీలకమైన నిర్ణయం అన్నారు. దీంతో ప్రస్తుతం 3 కోట్లున్న వివిధ సామాజిక పథకాల లబ్ధిదారుల సంఖ్య ఇప్పుడు 3.2 కోట్ల మంది లబ్ధిదారులకు పెరగనుంది.

ఇది కాకుండా నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ పేరును ప్రధానమంత్రి సామాజిక్ సహాయతా యోజనగా జాతీయ వృద్ధాప్య పింఛన్ పథకాన్ని ప్రధానమంత్రి విధవస్త పెన్షన్ యోజనగా, జాతీయ వితంతు పెన్షన్ పథకాన్ని ప్రధానమంత్రి విధవా పెన్షన్ యోజనగా, జాతీయ దివ్యాంగుల పెన్షన్ పథకాన్ని ప్రధానమంత్రి దివ్యాంగ్‌జన్ పెన్షన్ యోజనగా జాతీయ కుటుంబ సహాయ పథకంను ప్రధాన మంత్రి పరివార్ లాభ్ యోజనగా మార్చడంపైనా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

తెలంగాణలోనూ ప్రస్తుతం కేంద్రప్రభుత్వ సామాజిక భద్రత పథకాల లబ్ధిదారుల సంఖ్య 7.28 లక్షలు కాగా తాజా మార్పులతో ఇది మరింతగా పెరగనుందన్నారు. మోడీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా రూ.2,132 కోట్లను ఆయా పథకాల లబ్ధిదారుల అకౌంట్లలోకి నేరుగా బదిలీ చేసిందన్నారు. దివ్యాంగ చిన్నారుల కుటుంబాలకు పుట్టినప్పటి నుంచే సహాయం అందించడం, మరింతమందిని పెన్షన్ పరిధిలోకి తీసుకురావడం వంటి విషయాల్లో కేబినెట్ తీసు కున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోనుందన్నారు.

# నేడు రాష్ట్రంలోకి ఈశాన్య రుతుపవనాలు

### తెలంగాణలో 10 రోజుల పాటు వర్షాలు

**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** ఈ నెల 15 నుండి ఈశాన్య రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. అప్పటి నుండి రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని వెదర్ మ్యాన్ బాలాజీ పేర్కొన్నారు. గురువారం నుండి రాబోయే 10 రోజుల వరకు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ నెల 15, 16 తేదీల్లో దక్షిణ, తూర్పు తెలంగాణలో ఏపీ సరిహద్దు జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే వీలుందని తెలిపారు. ఈ రెండు రోజులు హైదరాబాద్‌లో పొడి వాతావరణం ఉంటుందని అంచనా వేశారు. అలాగే ఈ నెల 17, 18,19 తేదీల్లో దక్షిణ తెలంగాణ, మధ్య, తూర్పు తెలంగాణ ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని అంచనా వేశారు. హైదరాబాద్‌లోనూ తేలికపాటి నుండి మోస్తరు వర్షం కురిసే వీలుందని చెప్పారు. ఇక ఈ నెల 20 నుండి 24 తేదీల మధ్య హైదరాబాద్ నగరంతో సహా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపారు. ఐఎమ్‌డీ అంచనాల ప్రకారం ఈ నెల 15వ తేదీన రాష్ట్రంలోని ములుగు, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ వంటి దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఈ వర్షాల తీవ్రత మోడరేట్ టు హెవీ రెయిన్ గా ఉంటుందని ఐఎమ్‌డీ పేర్కొంది. 16వ తేదీన పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, సిద్దిపేట, వరంగల్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. చాలా వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. 17వ తేదీన మంచిర్యాల, వరంగల్, ఆసిఫాబాద్ వంటి ప్రాంతాల్లో కూడా వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. 18 నుంచి 20వ తేదీ వరకు దక్షిణ తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడేఅవకాశం ఉందని ఐఎమ్‌డీ తెలిపింది.

**రాష్ట్రంలో ఒకింత తగ్గిన ఉష్ణోగ్రతలు**

కాగా గత కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. అన్ని జిల్లాల్లోనూ సాధారణం మించి 4.50 డిగ్రీల వరకూ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యధికంగా 37.50 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. దీంతో ఉక్కపోతతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేడిమికి తట్టుకోలేక పక్కన పెట్టిన కూలర్లు, ఏసీలను తిరిగి ప్రారంభిస్తున్నారు. అయితే గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని ఉష్ణోగ్రతల్లో తగ్గుదల చోటు చేసుకుంది. రాష్ట్రంలో అత్యధికంగా పెద్దపల్లి జిల్లాలో 36.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఈ నెల 13న రాష్ట్రంలోని 33 జిల్లాల్లోనూ సాధారణం మించి ఉష్ణోగ్రతలు నమోదు కాగా, బుధవారం నాటికి 8 జిల్లాల్లో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదైంది. మిగిలిన 25 జిల్లాల్లో 35 నుండి 36.9 డిగ్రీల వరకూ గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

# ముత్యపు పందిరిపై మూడునామాల స్వామి

**తిరుమల, అక్టోబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి:** వేంకటేశ్వరుడు నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి విశేషఅలంకరణలో ముత్యపుపందిరిపై ఊరేగారు. రాత్రి 7గంటలకు వాహనమండపంవద్ద ముత్యపు పందిరిపై వేంచేపుచేశారు. ఇక్కడ అర్చకులు వేద ఘోష్టితో కర్పూరహారతులిచ్చారు. అనంతరం స్వామి వారి వాహనం బయలుదేరి ఆలయ నాలుగు మాఢవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ముత్యాలు విలువైనవి. చల్లదనాన్ని ప్రసాదిస్తాయి. తెల్లని కాంతు లీనుతుంటాయి. స్వాతికార్తెలో వానచినుకు సాగరంలోని ముత్యపుచిప్పలో పడి మనోజ్ఞమైన ముత్యంగా రూపొందుతుంది. ఇంత ప్రశస్త్యమైన ముత్యాలను పందిరిగా చేసుకుని ఏడుకొండల స్వామి మురుపుగొల్పుతూ ముచ్చటగా ఊరేగాడు. వినిర్మలాకాశంలో మిలమిల మెరిసే నక్షత్రాలతో పోటీపడుతూ విద్యుద్దీపకాంతులతో తళుకులీనే ముత్యాలపందిరిని భక్తులకు కనువిందుచేసింది. ఈ వాహనసేవలో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, జానకిదేవి, రంగశ్రీ, శాంతారామ్, సివిఎస్ఒ కెవిమురళీకృష్ణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.



# ఐడిబిఐ విక్రయానికి గ్రీన్‌సిగ్నల్

### కేంద్ర కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం

### 60శాతం వాటా రూ.52 వేల కోట్లకు ఫెయిర్‌ఫాక్స్‌తో ఒప్పందం

**న్యూఢిల్లీ, అక్టోబరు 14:** దేశీయ బ్యాంకింగ్ రంగంలో ప్రముఖ ఐడిబిఐ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీకి చెందిన 60.72 శాతం వాటాను ఫెయిర్‌ఫాక్స్ హోల్డింగ్స్‌కు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో తమ వాటాను తగ్గించుకోవడం, ఆర్థిక రంగంలో ప్రైవేట్ పెట్టుబడుల్ని ప్రోత్సహించడం దిశగా కేంద్ర ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఐడిబిఐ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వం, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కలిపి 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ అనుబంధ సంస్థ అయిన 10955230 కెనడా ఇంక్‌కి విక్రయించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ డీల్ విలువ రూ. 52,878 కోట్లు. ఈ విక్రయం పూర్తయి, అవసరమైన నియంత్రణ సంస్థల అనుమతులు లభించిన తర్వాత బ్యాంకు నియంత్రణ ఫెయిర్‌ఫాక్స్ చేతికి వెళ్లనుంది. ఎయిర్‌ఇండియా విక్రయం తర్వాత దేశంలో అతిపెద్ద వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణల్లో ఇది నిలిచింది. ఇక్కడ మొత్తం వాటా విక్రయంలో కేంద్ర ప్రభుత్వ వాటా 30.48 శాతం కాగా, ఎల్ఐసి తన 30.24 శాతం వాటాను విక్రయిస్తోంది. ఈ లావాదేవీ పూర్తయితే భారతదేశ ఆర్థిక రంగంలోనే ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ: ఫారెన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్) ఇదే అవుతుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# నేడు ఖైరతాబాద్‌లోని సాగర్ సొసైటీలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

### బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, మహిళల ఆత్మగౌరవానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ తెలంగాణ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నేతలతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిల్పారెడ్డి మాట్లాడుతూ..సాయంత్రం 6 గంటలకు ఖైరతాబాద్‌లోని సాగర్ సొసైటీలో జరగనున్న ఈ వేడుకలకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారని ఆమె తెలిపారు. ఈ సంబరాలకు ముఖ్య అతిథులుగా బిజెపి మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు రూప కుమారి చౌదరి, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, కేంద్ర మంత్రివర్యులు జి. కిషన్ రెడ్డి, ఎంపి, బిజెపి తమిళనాడు రాష్ట్ర సహ ఇంచార్జ్ డీకే అరుణ, తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌ఛార్జ్ రాజ్యసభ సభ్యురాలు రేఖా శర్మలతో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరుకానున్నారని వెల్లడించారు.

# కాంగ్రెస్ నేతల జేబులు నింపడానికే కాచిగూడ చారిత్రక ఎస్సీ హాస్టల్ బలి

### బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్



**హైదరాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** తెలంగాణలోని సాంఘిక సంక్షేమ (ఎస్సీ) వసతి గృహాల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఎస్సీ హాస్టళ్ల నిర్వహణ పేరుతో రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల పెద్ద మాఫియా నడుస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ఎస్సీ వసతి గృహాలను పరిశీలించడానికి వెళ్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతో సిబ్బంది తమను లోపలికి అనుమతించకుండా గేట్లు మూసేస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, మేధావులు, రాజకీయ నాయకులను తీర్చిదిద్దిన చారిత్రక కాచిగూడ ఎస్సీ హాస్టల్ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో 2020 కరోనా కాలం నుంచి మూతపడి శిథిలావస్థకు చేరిందని గుర్తుచేశారు. ఆ హాస్టల్‌లో ఉండాల్సిన విద్యార్థులను కాంగ్రెస్ నాయకులకు చెందిన ప్రైవేట్ భవనాల్లోకి తరలించి, ఒక్కో భవనానికి నెలకు రూ.5 లక్షల వరకు అద్దెలు చెల్లిస్తూ తమ పార్టీ కార్యకర్తలకు మేత వేస్తున్నారని, ప్రజాధనాన్ని యథేచ్ఛగా దోచిపెడుతున్నారని మండిపడ్డారు.

# 'అది అత్యాచారం కాదు'

**పాట్నా, అక్టోబరు 14:** అత్యాచారం కేసులో పాట్నా హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మహిళ మీద పడుకున్నంత మాత్రాన, తగిన ఆధారాలు లేకపోతే దానిని అత్యాచారంగా పరిగణించలేమని పాట్నా హైకోర్టు స్పష్టం చేసింది. ఓ మహిళపై అత్యాచారం జరిగిందంటూ నమోదైన కేసు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. బీహార్‌లోని బెగుసరాయ్ కోర్టులో ఓ వితంతువుపై అత్యాచారయత్నం జరిగిందంటూ కేసు నమోదైంది. ఫిబ్రవరి 8, 2010 రాత్రి 10 గంటల సమయంలో మహమ్మద్ ఐనుల్ హక్ అనే వ్యక్తి ఆ మహిళ గుడిసెలోకి అక్రమంగా ప్రవేశించాడు. ఆమె నోరు మూసి, దురుద్దేశంతో ఆమె శరీరంపైకి ఎక్కాడు. ఆ తర్వాత అతను నోరు మీద నుంచి చేయి తీయగానే ఆ మహిళ గట్టిగా కేకలు వేసింది. ఆమె అరుపులు విన్న వెంటనే ఇరుగుపొరుగున గ్రామస్తులు అక్కడికి చేరుకుని నిందితుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# దళిత, ఆదివాసీ స్త్రీలకు సపోర్ట్ అవసరం

• జ్యూరీ సభ్యులు ప్రకటన



**సైఫాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో బుధవారం లక్డీకాపూల్‌లో దళిత, ఆదివాసీ స్త్రీలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా లీగల్ క్లినిక్ సమావేశం జరిగింది. 35 హింసాత్మక సంఘటనలకు సంబంధించిన బాధితులు, సాక్ష్యులు హాజరైనారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులుగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ అధ్యక్షత వహించారు. 35 కేసులకు సంబంధించిన బాధితులు వారి వేదనలు, జ్యూరీకి వివరంగా తెలియజేయడం జరిగింది. బాధితులు హత్యలు, ఆత్మహత్యలు, మానభంగాలు, దాడులు, ప్రేమ పేరుతో మోస పోయిన కేసులు అనేకం ఉన్నాయి. బాధితుల గోడు విన్న అధికారులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. దళిత, ఆదివాసీ స్త్రీలకు సపోర్ట్ సిస్టం అవసరమని జ్యూరీ సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిపి సాంబశివరావు మాట్లాడుతూ బాధితుల బాధ్యతలను గుర్తు చేశారు. చట్టాల పట్ల వ్యవస్థల పట్ల మీకు ఉన్న నమ్మకం చాలా గొప్పదని, విదేశాల్లో అయితే కంటికి కను పు, పంటికి పన్ను ఉంటుందని, మనదేశంలో నిందితుడినైనా మార్చి సంస్కరించి మనిషిగా చేయాలనే రాజ్యాంగాన్ని గౌరవించాలని చెప్పుతుందన్నారు. అన్ని జిల్లాల్లో ప్రత్యేకంగా కోర్టులు త్వరలో ఏర్పాటు చేస్తామని, విచారణ సమయంలో తోడుగా ఉంటామన్నారు. సర్ప్ సిఈఓ, రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి దివ్యదేవరాజ్ ప్రసంగిస్తూ బాధితులకు ఆర్థిక సహాయం చాలా అవసరమని సూచించారు. సర్ప్ ద్వారా స్నేహ సహకార సంఘాల నుంచి ఆర్థిక వెసులుబాటును కల్పిస్తామని చెప్పారు. సంఘటనలు జరగక ముందు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఎస్సీ డిడి కమీషనర్ విజయేంద్రబోయి మాట్లాడుతూ బాధితులకు సంబంధించిన అనేక వేదనలు విన్న తరువాత మనం ఎంత వెనుకబడి ఉన్నామో తెలుస్తున్నదని విచారం వ్యక్తం చేశారు.

# జీఎంఆర్ ఏరో టెక్నిక్, యుయుడిఎస్ ఏరో మధ్య ఒప్పందం

**శంషాబాద్ అక్టోబరు14,ప్రభాతవార్త :** విమాన క్యాబిన్ అంతర్గత భాగాల రూపకల్పన, తయారీ, మరమ్మతులు, పునరుద్ధరణ సేవలను విస్తరించేందుకు జీఎంఆర్ ఏరో టెక్నిక్, ఫ్రాన్స్‌కు చెందిన యూయూడీఎస్ ఏరో సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం భాగంగా శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో టెక్నిక్ కేంద్రంలో సమగ్ర క్యాబిన్ అత్యుత్తమత కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.ఈ కేంద్రం ద్వారా విమాన క్యాబిన్ అంతర్గత భాగాల రూపకల్పన, ఇంజినీరింగ్, ధ్రువీకరణ, తయారీ, అమరిక, మరమ్మతులు, పునరుద్ధరణ సేవలను అందించనున్నారు. యూయూడీఎస్ ఏరోకు ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని, జీఎంఆర్ ఏరో టెక్నిక్ నిర్వహణ, మరమ్మతు సామర్థ్యాలతో అనుసంధానించి విమానయాన సంస్థలకు సమగ్ర పరిష్కారాలు అందించనున్నారు. ఈ భాగస్వామ్యం విమాన క్యాబిన్ సేవల్లో తమ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందని జీఎంఆర్ ఏరో టెక్నిక్ ప్రెసిడెంట్ అశోక్ గోపీనాథ్ తెలిపారు. భారత విమానయాన రంగంలో దీర్ఘకాలిక భాగస్వామ్యానికి ఈ ఒప్పందం నిదర్శనమని యూయూడీఎస్ ఏరో గ్రూప్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్, మిడిల్ ఈస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ ఆఫీస్ గుణరత్న పేర్కొన్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో దేశీయ విమానయాన నిర్వహణ, మరమ్మతు రంగంలో ఆధునాతన సాంకేతిక సామర్థ్యాలు అందుబాటులోకి రానున్నాయి.

# 4 గవర్నర్ పదవుల్లో 2 బిసిలకు, మరో రెండు ఎస్సీలకు కేటాయించడం పట్ల హర్షం

• భవిష్యత్తులో బిసిలకు మరిన్ని అవకాశాలు కేంద్రం కల్పిస్తుందని ధీమా
• రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**సైఫాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల కేటాయించిన నాలుగు గవర్నర్ పదవుల్లో 2 బిసిలకు, మరో రెండు ఎస్సీలకు కేటాయించడం పట్ల రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ముఖ్యమైన పదవులన్ని బిసిలకే కేటాయిస్తున్నదని ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీ బిసి, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ బిసి, రాష్ట్రపతిగా ఎస్టీ గిరిజన మహిళ, కేంద్ర ప్రభుత్వంలో 27 మంది బిసిలు వివిధ శాఖలకు మంత్రులుగా ఉన్నారని, గతంలో మూడు గవర్నర్ పదవులకు ముగ్గురు బిసిలనే నియమించిందని, రాజ్యాంగబద్దమైన ప్రధానమైన పదవులు బిసిలకే కేటాయించారని, అలాగే జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగబద్దమైన హోదా కల్పించడం జరిగిందని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. కులాల వారిగా జనాభ లెక్కలు తీయాలని ప్రధాన మంత్రిని కోరగా అందుకు ప్రధాని అంగీకరించారని, అలాగే ఓబిసిల కాలం పెట్టాలని ప్రజలు కోరుతున్నారని, ఇది కూడా త్వరలో తీర్చుతారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వ తొలిసారిగా జనగణనలో కులగణన చేపడుతున్నది, ఇది దేశ చరిత్రలో రికార్డు అని 80 సంవత్సరాల రాజకీయ చరిత్రలో ఏ పార్టీ కులగణన చేయలేదన్నారు. కులగణన తరువాత బిసిలకు అన్ని రంగాలలో ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగ రంగాలలో జనాభా ప్రకారం వాటా లభిస్తుందని, ఇది సమాజంలో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని మారుతున్నారు. 75 కోట్లకు పైగా ఉన్న బిసిల కోర్కె చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖ కూడా లభిస్తుందని ఆర్.కృష్ణయ్య ధీమా వ్యక్తం చేశారు.

# 63 యేళ్ల వయసులో పదో తరగతి పాసైన బామ్మ

**చండీగఢ్, అక్టోబరు 14:** వయసు కేవలం నెంబర్ మాత్రమే అని మరోసారి నిరూపించారు హర్యానాలోని మహేంద్రగఢ్ జిల్లా దేవ్‌నగర్ గ్రామానికి చెందిన 63 ఏళ్ల సుశీలా దేవి. నర్సింగ్ కావాలనే తన కలను నెరవేర్చుకోవడానికి ఏకంగా పదో తరగతిలో 79.6 శాతం మార్కులు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. చిన్నతనంలో కుటుంబ పరిస్థితుల కారణంగా కేవలం ఐదో తరగతి వరకే చదువుకోగలిగినప్పటికీ, చదువుపై ఆమెకున్న మమకారం మాత్రం ఎప్పటికీ తగ్గలేదు. పెళ్లి తర్వాత కూడా రోజూ పేపర్లు చదువుతూ, కొత్త విషయాలు తెలుసుకోవడంలో ఎప్పుడూ ముందుండేవారు. ఈ క్రమంలోనే నర్సింగ్ పదవికి పోటీ చేసేందుకు అర్హత సాధించాలనే ఆలోచనతో ఆమె తన చదువును కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. తల్లి పడుతున్న తపనను గమనించిన కుమారుడు విష్ణు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) ద్వారా పదో తంగతికి దరఖాస్తు చేయించాడు. మొదట్లో సబ్జెక్టులు అర్థం చేసుకోవడానికి కొంత సమయం పట్టినప్పటికీ, పిల్లల సహకారంతో ఆమె రోజుకు 3 నుంచి 4 గంటలు శ్రద్ధగా చదివారు. ఏమాత్రం వెనకడుగు వేయకుండా పట్టుదలగా కష్టపడ్డారు. ఏప్రిల్ 2026లో జరిగిన ఈ పరీక్షల ఫలితాలు ఇటీవలే వెలువడగా, అందరి అంచనాలను తలకిందులు చేస్తూ సుశీల దేవి అద్భుతమైన విజయం సాధించారు. మొత్తం 79.6 శాతం మార్కులు సాధించి తన సత్తా చాటుకున్నారు. సబ్జెక్టుల వారీగా చూస్తే ఇంగ్లీష్‌లో 89, సైన్స్ అండ్ టెక్నాలజీలో 88, మ్యాథ్స్‌లో 78, పెయింటింగ్‌లో 76, హిందీలో 67 మార్కులు సంపాదించి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఈ అద్భుత విజయం తర్వాత యువతకు, మహిళలకు ఆమె ఒకటే మాట చెబుతున్నారు. చదువుకోవడానికి వయసుతో సంబంధం లేదని, నేర్చుకోవాలనే తపన ఉంటే కుటుంబం సహకారంతో ఏ లక్ష్యాన్నైనా సులభంగా సాధించవచ్చని నిరూపించి చూపించారు.

# రేవంత్ పాలనలో పెరిగిన వలసలు

• రైతు సంక్షేమంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
• గద్వాల పర్యటనలో మాజీ మంత్రి హరీష్‌రావు



**గద్వాల అక్టోబర్ 14, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇంబందుల్లో వున్నారని, విద్యుత్, సాగునీరు, పంటల భీమా,అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయిందని, రేవంత్ రెడ్డి పాలనలో రైతులు కరువు, కాటకాలతో వలసలు పోతున్నారని బిఆర్ ఎస్ పార్టీ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. బుధవారం హరీష్ రావు జోగులాంబ గద్వాల జిల్లా పర్యటనలో భాగంగా ఎండిన పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి కష్ట సుకాలపై ఆరా తీసి, సాగునీరు, వ్యవసాయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇందువాసి ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లా, గద్వాల నియోజకవర్గంలోని గట్టు మండలం ఇందువాసి గ్రామానికి చెందిన వలస కూలీలు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. నూతనంగా నిర్మిస్తున్న ఆరు వరుసల రహదారిపై ట్రాక్టర్‌పై వెళ్తుండగా ఇసుక టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న హరీశ్ రావు, అలంపూర్ నియోజకవర్గ శాసన సభ్యులు విజయుడు, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల వెంకటేశ్వర్ రెడ్డి, గద్వాల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాస్ హనుమంతు నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్,ఇతర నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇందువాసి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు కూలీల కుటుంబాలను పరామర్శించి హరీశ్ రావు, రూ 2లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఒక్కో కుటుంబానికి రూ . 1 లక్ష రూపాయలు చొప్పున అందజేశారు. అనంతరం ప్రమాదంలో గాయపడిన వారి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, బాధితులకు అందరికి మొత్తంలో రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తూ వారికి మనోధైర్యం కల్పించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతి చెందడం, మరికొందరు గాయపడటం అత్యంత బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రామంలో ఈ విషాద ఘటన జరిగినప్పటికీ, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి తగిన భరోసా అందకపోవడం విచారకరమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు నాయకత్వంలో రైతులకు అండగా నిలిచామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల రైతులు ఉపాధి కోసం వలస కూలీలుగా మారాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శించారు. కెసిఆర్ ఉన్నప్పుడే బాగుండే... రైతులు ..జోగులాంబ గద్వాల జిల్లా, గట్టు మండలం, రాయపురం గ్రామంలో రైతుల తమలోని ఆవేదనను మాజీ హరీష్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుకు వ్యక్తం చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మా రైతులకు కష్టాలే తప్పా,సుఖం లేదన్నార. ఇటు వానలు రాకపోయే అటు కరెంటు రాకపోయే మా జీవితాల్లో గందరగోళంలో పడ్డాయన్నారు. ఇటు ఎండిపోయిన పొలంలో ఉండలేము.. అటు ఇంట్లో ఉండలేము.. మళ్లి కచ్చితంగా వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే. అందరి రైతుల నోట ఇదే మాట అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, స్థానికులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 'కల్తీ'నెయ్యి కేసులో ఇడి మళ్ళీ దూకుడు!

• రూ.129.85 కోట్ల విలువైన ఆస్తులు అటాచ్
• అసలు సూత్రధారులకు ఉచ్చు బిగుస్తుందా!?

**తిరుపతి,అక్టోబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** 2019-24 మధ్యకాలంలో గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి వైసిపి బోర్డు ఛైర్మన్, కొందరు టిటిడి అధికారులు చేతులు కలిపి టెండర్ల నిబంధనలు మార్చుచేసి కోట్లు దండుకున్నారనే ఆరోపణలపై తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) 129.85 కోట్ల విలువైన ఆస్తులు అటాచ్ చేయడం సంచలనంగా మారింది. ఇంకా ఈ అక్రమాల్లో గతంలోనే అర్హత లేని డెయిరీలకు నెయ్యిసరఫరా చేసే టెండర్లు అప్పగించారనేది 2025లో సిబిఐ సిట్, ఏకసభ్యకమిషన్ తేల్చింది. తదుపరి ఇడి కూడా దూకుడు పెంచింది. ఈ ఏడాది జూన్‌లోనే కల్తీనెయ్యి కేసులో
ఇడి సోదాలతో అందరినీ సంచలనం మారింది. వేంకటేశ్వరస్వామి పవిత్రతను కాపాడాల్సిన కీలక పెద్దలు లోపాలను అవకాశంగా మార్చుకుని నెయ్యిటెండర్లు మార్చుచేసి కల్తీనెయ్యి సరఫరా చేసుకున్నారనే ప్రధాన వివాదంలో ఇడి అధికారులు కీలక వ్యక్తులపై దాడులు చేయడం ,ఏమేరకు వాటాలు అందాయనే కోణంలో దేశంలోని 16 ప్రాంతాల్లో గుంటూరు, ఢిల్లీ, ముంబై, రాజ్‌కోట్, డెహ్రాడూన్, రూర్కీ, బికనీర్, అహల్యానగర్, దిండిగల్‌లో ఇడి అధికారుల సోదాలు చేసింది. ఈ కేసులో నిందితులు పోమిల్ జైన్, విపిన్ జైన్, రాజు రాజశేఖరన్, రాజేష్ చావ్డా, అపూర్వ చావ్డా,సుచీంద్ర శాంతారామ్ లాంకే, అజయ్‌కుమార్ సుగంధ్, మహేష్‌కుమార్ రోహిరా, ఆశిష్ అగర్వాల్ తదితరుల నివాసాలు, కార్యాలయాల్లో ఇడి సోదాలు చేసి 60 లక్షల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. టిటిడికి సరఫరా చేసిన కల్తీనెయ్యి కేసు దర్యాప్తులో భాగంగా ఇడి శాఖ హైదరాబాద్ జోనల్ కార్యాలయం 129.85 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను తాత్కాలికంగా అటాచ్ చేసింది. భోలే బాబా ఆర్గానిక్ డెయిరీమిల్క్ ప్రైవేట్ లిమి టెడ్, వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమి టెడ్ సంస్థలు, వాటి ప్రమోటర్లు విపిన్ జైన్, పొ మిల్ జైన్, వారి కుటుంబ సభ్యులు, సుకృతి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, దాని ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లా, ఆయన కుటుంబ సభ్యు లు, అలాగే ఈ కేసుతో సంబంధమున్న ఇతర సంస్థలు, వ్యక్తులకు చెందిన ఆస్తులను మనీలాం డరింగ్ నిరోధక చట్టం 2002 కింద ఇడి అటాచ్ చేసింది.

**పోలీసుల కేసు ఆధారంగా ఇడి దర్యాప్తు:**
తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి దర్యాప్తు ప్రారంభించింది. టిటిడికి కల్తీ నెయ్యిని సరఫరా చేయడంలో నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ, అవినీతి జరిగినట్లు ఎఫ్ఐఆర్‌లో ఆరోపణలు ఉన్నాయి.
ఈ కేసులో దర్యాప్తు సంస్థ ప్రత్యేక న్యాయమూర్తి (ఎస్‌పిఇ, ఎసిబి కేసులు)నెల్లూరు కోర్టులో ఛార్జ్‌షీట్‌తో బాటు అనుబంధ ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యిని సరఫరా చేసేందుకు భారీ నేరపూరిత కుట్ర జరిగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ వ్యవహారంలో ధార్మికసంస్థ టిటిడిని మోసం చేయడంతో బాటు ప్రజారోగ్యానికి ముప్పు కలిగించి, అక్రమంగా భారీ మొత్తంలో లాభాలు ఆర్జించినట్లు పేర్కొంది.
234.5 కోట్ల రూపాయలు విలువైన కల్తీ నెయ్యి సరఫరా కింద చేపట్టిన దర్యాప్తులో, భోలే బాబా సంస్థ నేరుగా, అలాగే టిటిడిటెండర్లలో తమ పేర్లతో పాల్గొన్న మధ్యవర్తి డెయిరీల ద్వారా మొత్తం 234.5 కోట్ల రూపాయలు విలువైన కల్తీ నెయ్యిని టిటిడికి సరఫరా చేసినట్లు వెల్లడైంది.
ఈ నెయ్యిని వాస్తవానికి భోలే బాబా, సుకృతి ఫుడ్స్ సంస్థల కర్మాగారాల్లో తయారు చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. రిఫైన్డ్ పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, పామోలిన్ నూనెలను కలిపి, వాటిలో మోనోగ్లిజరైడ్స్, ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్, లాక్టిక్ యాసిడ్, బీటా కెరోటిన్ వంటి రసాయనాలను ఉపయోగించి వాటిని తినదగిన నూనెలుగా చూపించినట్లు వెల్లడైంది.
లెక్కలను సక్రమంగా ఉన్నట్లు చూపించేందుకు, వినియోగించిన పామాయిల్‌ను నకిలీ కొనుగోలుదారులకు విక్రయించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. అలాగే పాలు, నెయ్యి కొనుగోళ్లు జరిగినట్లు, స్కిమ్డ్ మిల్క్ వంటి ఉప ఉత్పత్తులను విక్రయించినట్లు తప్పుడు లావాదేవీలను నమోదు చేసి, నిజమైన డెయిరీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు చిత్రీకరించారు.
నకిలీ కొనుగోళ్లకు సంబంధించి బ్యాంకింగ్ మార్గాల ద్వారా చెల్లించిన మొత్తాలను హవాలా మార్గాల ద్వారా తిరిగి నగదు రూపంలో పొందారు. ఈ నగదును నకిలీ పామాయిల్ కొనుగోలుదారులకు చెల్లించేందుకు, మధ్యవర్తి డెయిరీలకు కమీషన్లు ఇచ్చేందుకు, ఈ మోసంతో సంబంధమున్న ఇతర వ్యక్తులకు చెల్లించేందుకు వినియోగించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.




# ఎల్‌నినోతో తెలంగాణలో వలసలు!

• జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రలకు తరలుతున్న వైనం
• పంటలు దెబ్బతినడంతో పనుల కోసం వెతుకులాట



**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త :** ఎల్ నినో నేపథ్యంలో కరువు పరిస్థితులు, పంట నష్టాలు, నీటి కొరత కారణంగా తెలంగాణలోని రైతులు, వ్యవసాయ కూలీలు తమ గ్రామాలను విడిచిపెట్టి జీవనోపాధి కోసం మరోసారి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. గత కొన్నేళ్లుగా, తెలంగాణలోని రైతులు బీహార్, ఒడిశా, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నుండి కూలీలను వ్యవసాయ పనుల నిమిత్తం నియమించుకున్నారు. చాలా మంది భూయజమానులు మరియు ఇంతకుముందు పని కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వ్యవసాయ కూలీలు, పంటలు పండించడానికి రాష్ట్రంలోని తమ పొలాలకు తిరిగి వచ్చారు. రాష్ట్రంలో దాదాపుగా కనుమరుగైన ఈ వలసల ధోరణి తాజాగా ఎల్ నినో ప్రభావంతో వివిధ ప్రాంతాల్లో కరువు పరిస్థితులు, పంట నష్టాల కారణంగా మళ్లీ తలెత్తిందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది వలసదారులు కర్ణాటకలోని వరి, పత్తి మిల్లులలో పని పొందుతుండగా, మరికొందరు ముంబైలో రోడ్డు నిర్మాణం, ఇతర నిర్మాణ సంబంధిత పనులను చేపడుతున్నట్లున తెలియిచ్చింది. ఈ వాకాలంలో, అనేక ప్రాంతాలలో పంటకోత పూర్తికాకముందే, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు మరోసారి పని కోసం కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు సుదూర ప్రయాణాలు చేస్తున్నారు. రాష్ట్రంలోని ముఖ్యంగా కరువు ప్రభావిత ప్రాంతాలైన గద్వాల్, సంగారెడ్డి వంటి జిల్లాల్లో వలసలు ఎక్కువగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఉపాధి కోసం అక్కడి రైతులు మరియు కూలీలు పొరుగు రాష్ట్రాలకు తరలివెళ్తున్నారు. ఈ వలసల కారణంగా ఆయా కుటుంబాల్లోని వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే, ఈ వానాకాలంలో, అనేక ప్రాంతాలలో పంటకోత పూర్తికాకముందే, చిన్న, సన్నకారు రైతులు మరియు వ్యవసాయ కూలీలు మరోసారి పని కోసం ఇతర రాష్ట్రాలు, ఇతర ప్రాంతాలకు సుదూర ప్రయాణాలు చేస్తున్నారు. పూర్వపు పాలమూరు ప్రాంతంలో ఈ ధోరణి ప్రత్యేకంగా కనిపిస్తోంది. గద్వాల్ జిల్లాలో ఒకటి నుంచి మూడు ఎకరాల భూమి ఉన్న అనేకమంది చిన్న, సన్నకారు రైతులు పని వెతుక్కుంటూ రాయచూరు, ముంబై, కడప, ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఇక గట్టు, ఈజ, రాజోలి, ధారూర్, కేటిదొడ్డి మండలాల్లోని వర్షాధార భూముల్లో పత్తి, మిరప, ఆముదం, వేరుశనగ పండించిన రైతులు నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోయి భారీ నష్టాలతో రాయచూర్, యాద్గిర్, ముంబైలకు తరలివెళ్తున్నారని రైతు సంఘాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతాల్లోని వ్యవసాయం చాలా వరకు వర్షపాతంపై ఆధారపడి ఉంటుంది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో వర్షపాతం లోటుగా ఉండటంతో, చాలా మంది రైతులు తమ పంటలను మధ్యలోనే వదిలేశారు. నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గంలోని 160 తండాల నుండి దాదాపు 60 శాతం మంది ప్రజలు పని వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోతున్నారని స్థానికులు అంచనా వేస్తున్నారు. ఇక కౌలు రైతులు అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యారు. నీటి కొరత కారణంగా వరి పంట ఎండిపోవడంతో చాలా మంది నష్టపోయారు. వనాకాలంలో తీవ్రమైన విద్యుత్, నీటి కొరత, యాసంగిలో పరిస్థితి మరింత దిగజారవచ్చనే ఆందోళనల కారణంగా, కౌలు రైతులు అప్పులు, కౌలు మొత్తాలు చెల్లించడానికి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్, దాని పొరుగు ప్రాంతాలలోని అనేక తండాలలో పరిస్థితి ఇలాగే ఉంది. చిన్న, సన్నకారు రైతులు, విద్యార్థులతో సహా తమ కుటుంబ సభ్యులతో కలిసి చెరకు మిల్లులు, పొలాలలో పనిచేయడానికి కర్ణాటక, మహారాష్ట్రలకు వలస వెళ్తున్నారు. తక్కువ పంట దిగుబడులు, పెరుగుతున్న నష్టాలు, నీటి కొరత వంటివి వలసలకు కారణమయ్యాయని అంటు న్నారు. 70 ఏళ్లు పైబడిన వారు కూడా పని వెతుక్కుంటూ బీదర్, బెళగావి, కర్ణాటకలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తున్నారని స్థానికులు తెలిపారు. కాగా రాబోయే రెండు నెలల్లో పరిస్థితి మరింత దిగజారవచ్చని స్థానికులు భయపడుతు న్నారు. యాసంగి సీజన్‌లో పంటలు పండించవద్దని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు విజ్ఞప్తి చేస్తుండటంతో, దీనివల్ల మరింత మంది జీవనోపాధి కోసం వలస వెళ్లాల్సి వస్తుందేమోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# గ్లోబల్ రైజింగ్ సమ్మిట్‌కు తరలిరండి

• రైజింగ్ తెలంగాణ లక్ష్య సాధనలో భాగస్వాములు కండి
• సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్ - 2026లో మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు అనుగుణంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ 2026లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణ లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్ - 2026కు ఆయన గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, నూతన పరిశ్రమలకు ప్రోత్సాహం, వ్యాపారాలకు అనుకూల వాతావరణం కల్పించడంపై దృష్టి సారించామన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ మరింత కీలక పాత్ర పోషించేలా పరిశ్రమలు, నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఐటి, సాంకేతిక రంగాలను మరింత అభివృద్ధి చేయడంతో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ తయారీ రంగం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటును ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్‌తో పాటు ఏఐ, ఏరోస్పేస్, రక్షణ రంగం, అధునాతన తయారీ లాంటి రంగాలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, పరిశ్రమలను విస్తరించేందుకు తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ ను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు.

# తలనీలాల సమర్పణకు 11 మినీ కల్యాణకట్టలు

-1,200 మంది క్షురకులతో నిరంతర సేవలు

**తిరుమల,అక్టోబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి మొక్కుబడుల్లో భాగంగా తలనీలాలు సమర్పించే భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టిటిడి కల్యాణకట్ట డిప్యూటీ ఇఒ రమాకాంత్ తెలిపారు. తిరుమలలో ప్రధాన కల్యాణకట్టతో బాటు 11 మినీ కల్యాణకట్టలు, తిరుపతిలోని టిటిడి ఆలయాల్లో మరో నాలుగు కల్యాణకట్టల ద్వారా భక్తులకు తలనీలాలు తీయడయం జరుగుతోందని తెలిపారు. తిరుమలలో మీడియా సెంటర్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో తొమ్మిది రోజుల్లో 3 లక్షల మంది భక్తుల తలనీలాల సమర్పించారు. తిరుమలలో దాదాపు 1,200 మంది క్షురకులు విధులు నిర్వహిస్తుండగా, వీరిలో 260 మంది మహిళా క్షురకులు ఉన్నట్లు తెలిపారు. జరుగుతున్ననవరాత్రి బ్రహ్మోత్సవాల తొలి రెండు రోజుల్లో సుమారు 60 వేల మంది భక్తులు మొక్కులు చెల్లించుకున్నట్లు వెల్లడించారు. మహిళలు, చిన్నారులు సౌకర్యవంతంగా తలనీలాలు సమర్పించేందుకు మహిళా క్షురకుల ద్వారా ప్రత్యేక సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తుల అభిప్రాయాలకు పెద్దపీట కల్యాణకట్టల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ, భక్తులు ప్రశాంతంగా తలనీలాలు సమర్పించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. క్షురకుల ప్రవర్తన, సౌకర్యాలపై క్యూఆర్ కోడ్, ఐవిఆర్ఎస్, శ్రీవారి సేవకుల ద్వారా భక్తుల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఏ చిన్న సమస్య ఎదురైనా తక్షణమే స్పందించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గత రెండున్నరేళ్లలో ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయని వివరించారు. భక్తులు తలనీలాలు సమర్పించే సమయంలో గోవింద నామాలు వినిపించేలా ఏర్పాట్లు చేయడంతో కల్యాణకట్టల్లో ఆధ్యాత్మిక, ప్రశాంత వాతావరణం నెలకొందని తెలిపారు. భక్తులకు ప్రత్యక్షంగా సేవలందించే క్షురకుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శ్వేత డైరెక్టర్ (ఎఫ్ఏసీ) డాక్టర్ వేమా వేంకట రత్నం పాల్గొన్నారు.

# యోగనరసింహస్వామిగా మలయప్ప అభయం



**తిరుమల,అక్టోబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలపై శ్రీనివాసుడికి జరుగుతున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం సింహ వాహనంపై యోగ నరసింహుని అలంకారంలో మలయప్ప స్వామి దర్శనమిచ్చారు. ధైర్యానికి, పరాక్రమానికి ప్రతీక సింహవాహనం,.సింహ వాహనంపై కొలువుదీరిన స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు గోవింద నామస్మరణలతో భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ముందుగా గజరాజులు గంభీరంగా నడుస్తుండగా, భక్తబృందాల భజనలు, కోలాటాలు, జీయంగార్ల వేదఘోష, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కన్నులపండువగా జరిగింది. తిరుమల పురవీధులు భక్తి, ఆధ్యాత్మికత, హరినామ సంకీర్తనలతో పులకించిపోయాయి. సింహ వాహనం - ధైర్యానికి, పరాక్రమానికి ప్రతీక.సింహం ధైర్యం, పరాక్రమం, తేజస్సు, గంభీరతలకు ప్రతీక. దుష్టశిక్షణ, శిష్టరక్షణ సంకల్పాన్ని చాటుతూ మలయప్పస్వామి సింహ వాహనాన్ని అధిరోహించారు.

విజయవాడ కనక దుర్గ
నేటి అలంకరణ

## శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి



"ప్రాతస్మరామి లలితా వదనారవిందం
బింబాధరం పృథుల మౌక్తిక శోభినాశమ్
ఆకర్ణదీర్ఘ నయనం మణికుండలాఢ్యం
మందస్మితం మృగమదోజ్జ్వల ఫాలదేశమ్"

పూర్వం ఆలయంలో అమ్మవారికి వామాచార పద్ధతిలో బలులు సమర్పిస్తూ పూజలు జరిగేవట. ఆ కాలంలో ఆలయాన్ని సందర్శించిన శ్రీ శంకరాచార్యుల వారు వామాచార పద్ధతిని తొలగించి దక్షిణాచార పద్ధతిలో నిత్యం అమ్మవారికి పూజలు జరిగేలా ఏర్పాటు చేసి తన దివ్యశక్తితో ఆలయంలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. శంకరాచార్యులవారి ఆదేశానుసారం ఆనాటి నుండి ఈనాటి వరకు అమ్మవారి అష్టోత్తరాల కాకుండా శ్రీ లలితా అష్టోత్తర శతనామ సహస్రనామాలతోనే పూజలు జరుగుతున్నాయి. ఆ కారణంగానే దుర్గాదేవిని శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరిస్తారు. శ్రీ మహాలక్ష్మీ దేవి శ్రీ సరస్వతీ దేవి ఇరువైపులా నిల్చుని వింజామరలు వీస్తుండగా చిరునవ్వులు చిందిస్తూ చేతిలో చెరుకుగడను ధరించి శివుని వక్షస్థలం మీద ఆసీనురాలైన వరదాభయ ముద్రలు ప్రకాశించే శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి త్రిపురాత్రయంలో రెండవ శక్తి. దేవీ ఉపాసకులకు ఈమె ముఖ్యదేవత. త్రిగుణాతీతమైన కామేశ్వర స్వరూపం లలిత త్రిపుర సుందరీ దేవి అమ్మవారు. శ్రీ పార్వతి, శ్రీలక్ష్మీ, శ్రీ సరస్వతులు శక్తులతో కూడిన దివ్యశక్తులను కలిగిన మాతగా శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి దర్శనమిస్తుంది. పంచదశాక్షరీ మహా మంత్ర అధిష్టాన దేవతగా లలిత త్రిపురసుందరిని ఆరాధిస్తారు. సకల లోకాతీతమైన కోమలత్వం కలిగిన మాతృమూర్తి ఈ అమ్మవారు. చెరుకు గడ, విల్లు, పాశం కుశాలను ధరించిన రూపంలో కుడివైపున శ్రీలక్ష్మీ దేవి, ఎడమ వైపున శ్రీసరస్వతీదేవి సేవలు చేస్తుండగా లలితా దేవి భక్తులను అనుగ్రహిస్తుంది. ఇరు ప్రక్కల లక్ష్మీ సరస్వతులను వుంచు కొని, మనం ప్రార్థించిన వెంటనే దారిద్ర్య దుఃఖాలను తొలగించి, సకల ఐశ్వర్యాల భిక్షలను ఈ అమ్మవారు సిద్ధింపజేస్తుంది. ఈమెను శ్రీవిద్యా స్వరూపిణి. సృష్టి, స్థితి, సంహార రూపిణి. కుంకుమతో నిత్యపూజలు చేసే సువాసినులకు (ముత్తైదువలకు) ఈ తల్లి మాంగల్య సౌభాగ్యాలను ప్రసాదిస్తుంది.

వస్త్రం: గంధపు వర్ణం, పుష్పాలు : గులాబీలు, తెల్ల పద్మాలు
నివేదన: పాలు పెరుగు వెన్న తేనె బెల్లం, పండ్లు, పాల పొంగలి వంటి బాలభోగం (సారస్వత నైవేద్యం) గారెలు
మంత్రం: "ఓం ఐం హ్రీం శ్రీం శ్రీమాత్రేనమః" అనే మంత్రాన్ని 108సార్లు జపించాలి. శ్రీచక్రానికి లలితా అష్టోత్తరంతో కుంకుమార్చన చేస్తూ మాంగల్యబలం కోరుతూ సువాసినిలను పూజ చేయ్యాలి.

- భట్టిప్రోలు నటరాజకుమార్

## నేడు అలిగిన బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో ఆరవ రోజు తంగేడు, గునుగు, బంతి, చెమంతి తదితర పూలను ఆరు వరుసెత్తుల్లో పేర్చి, గౌరమ్మను వాటిపై పెడతారు. ఆలిగిన బతుకమ్మగా ఆడరు.



## నవరాత్రుల్లో నవవర్ణాలు !

అమ్మవారిని నవరాత్రుల్లో ఒక్కో అవతారంలో పూజిస్తుంటారు కదా! అయితే, కొన్ని ప్రాంతాల్లో రూపానికి తగినట్లుగా తొమ్మిది రోజులూ తొమ్మిది రంగుల దుస్తులను ధరించి భక్తులు దుర్గామాతను కొలుస్తారు. అవేంటంటే..

**మొదటి రోజు : శైలపుత్రి..** ఈ రోజు పర్వతపుత్రిని తెలుపురంగు దుస్తులు ధరిస్తారు. ఇది ప్రకృతికీ, సంతానానికీ, శాంతికీ, వృద్ధికీ, ప్రశాంతతకూ ప్రతీక ఆట.

**రెండోరోజు : బ్రహ్మచారిణి** ఈ రోజు ఆకుపచ్చరంగు దుస్తులు ధరిస్తారు. ఇది ప్రకృతికీ, సంతానానికీ, శాంతికీ, వృద్ధికీ, ప్రశాంతతకూ ప్రతీక అట.

**మూడోరోజు : చంద్రఘంట..** నవరాత్రి మూడోరోజున చంద్రఘంట రూపంలో అమ్మ వారిని పూజిస్తారు. ఈ రంగు సమతుల భావోద్వేగాలకు ప్రతీక. మనలోని కోపం, బాధ, సంతోషం.. లాంటి భావోద్వేగాలు అదుపులో ఉండాలని దీని అంతర్థాం.

**నాలుగోరోజు: కూష్మాండ..** దేవిని ఈ రోజు నారింజ రంగు దుస్తులు వేసుకుని పూజిస్తారు. ఈ రంగు మనలో ఉల్లాసాన్నీ, సానుకూల దృక్పథాన్నీ, ఉత్సాహాన్నీ నింపుతుంది.

**ఐదో రోజు: స్కందమాత..** పసుపు రంగు సంతోషానికీ, ఆశకీ, కాంతికీ చిహ్నమట.

**ఆరోరోజు : కాత్యాయని..** ఎరుపు రంగు ధైర్యసాహసాలకు చిహ్నం. విజయమానికి ప్రతీక. మనలో అంతులేని శక్తిని నింపుతుందట.

**ఏడోరోజు: కాళరాత్రి,** నీలి వర్ణం ముక్తినీ, గాంభీర్యాన్నీ సూచిస్తుంది. ఈ రంగు దుస్తుల్లో అమ్మవారిని పూజించడం వల్ల మనలో స్థిరత్వం, ప్రశాంతత కలుగుతాయి.

**ఎనిమిదోరోజు : మహాగౌరి ,**గులాబీరంగు ప్రేమ, ఆప్యాయత, సామరస్యాలను సూచిస్తుంది.

**తొమ్మిదోరోజు : సిద్ధిధాత్రి..** ఊదా రంగు దుస్తులు ధరించడం ద్వారా జ్ఞానోదయం, విలాసం, వైభవం, శ్రేష్ఠత లభిస్తాయి. సకల సంపదలూ, ఐశ్వర్యాలూ కలుగుతాయని భావిస్తారు. ఇలా దుస్తులే కాదు, ఇంటినీ, మందిరాన్నీ ఈ రంగుల పూలు, ఆకులతోనూ ఈ తొమ్మిదిరోజుల పాటు అలంకరిస్తారట. తద్వారా మనసంతా సానుకూల ఆలోచనలతో ఉండాలన్నదే వీటన్నింటి పరమార్థమట.

## పెసర ఉప్మా బైట్స్

ఉప్మారవ్వ: కప్పు
పెసర్లు: ఒండు కప్పు
బియ్యం: అరకప్పు
జీలకర్ర: పావు స్పూను
అల్లం : చిన్న ముక్క
పచ్చిమిరప కాయలు: రెండు
పోపు గింజలు: స్పూను
నూనె: టేబుల్ స్పూను
ఉప్పు: తగినంత



**తయారీ:** పెసర ఉప్మా బైట్స్ కోసం పెసలు, బియ్యం కలిపి రెండు గంటల పాటు నానబెట్టుకోవాలి. తర్వాత పచ్చిమిరప, అల్లం, జీలకర్ర, కొద్దిగా ఉప్పు వేసి గ్రైండ్ చేసి పక్కకు పెట్టుకోవాలి. పొయ్యి మీద చిన్న గిన్నె పెట్టి అందులో నూనె వేసి కాగాక పోపు గింజలు వేయాలి. అందులో రెండున్నర కప్పుల నీళ్లు పోసి, ఉప్మాకు తగినంత ఉప్పు వేసి ఉప్మారవ్వ పోసి ఉండలు కట్టకుండా కలపాలి. ఉడికిన తర్వాత దించేయాలి. ఇది కాస్త జారుడుగా ఉంటే మేలు. ఇప్పుడు పొయ్యి మీద పెనం పెట్టి పెసరపిండి అట్టు పోసి, ఉప్మా దాని మీద పల్చగా రాయాలి. తీసిన తర్వాత రోల్‌లాగా గుండ్రంగా చుట్టి, రెండు అంగుళాల ముక్కలుగా కోసి మరోసారి పెనం మీద రెండు వైపులా వేయించాలి. చట్నీతో సర్వ్ చేస్తే టిఫిన్ పెసరట్టు కాస్తా స్నాక్ పెసర ఉప్మా అయిపోతుంది! □

## చిట్కా:

✦ మిక్సీలో ఎండుద్రాక్ష వేసేటపుడు కొద్దిగా నిమ్మరసం కలిపితే ద్రాక్షలు బ్లేడ్‌కు అంటుకోకుండా వుంటాయి.
✦. కొత్తిమీర పొడికి కొద్దిగా ఉప్పు నిల్వవుంచితే ఎక్కువకాలం తాజాగా వుంటుంది.
✦ ఆమ్లేట్ లావుగా రావాలంటే సొన గిలకొట్టాక కొద్దిగా నీరు కలపాలి.
✦ ఉల్లి పాయలు తరిగేందుకు అరగంట ముందు వాటని పాలథిన్ కవర్లోవేసి ఫ్రిజ్‌లో పెడితే తరిగేటప్పు కళ్ళు ముండవు.
✦.ఎండుకొబ్బరిని సులభంగా తురమాలంటే దానిపై కొద్దిగా నీళ్లు చల్లి ఫ్రిజ్‌లో ఉంచాలి. □

## జిడ్డును వదిలిద్దాం !

పొద్దున్నే హడావుడిగా వంట చేయడం ఒకెత్తయితే ఆ తరవాత చిందర వందరగా పడి ఉన్న ఆహార పదార్థాలు, చిందిన నూనె చుక్కల వల్ల ఏర్ప డిన జిడ్డుని వదిలించడం ఇంకో ఎత్తు. వీటిని శుభ్రం చేయడానికి నిత్యం రసాయనిక క్లీనర్లు వాడుతుంటాం. కానీ, వాటి నుంచి వెకలువడే వాయువులూ, ఇతర హానికారక టాక్సిన్లు ఆరోగ్యానికి చేటు చేస్తాయంటున్నాయి పలు అధ్యయనాలు. మరి వీటినిఎలా వదిలించాల న్నదేగా మీ సందేహం. ఇందుకోసం బోలెడు ఇంటి చిట్కాలు ఉన్నాయి. గ్యాస్ వెనకున్నగోడ మీద పేరుకున్న నగ్రీజుపైకి దుమ్ముచేరితే మరింత నల్లగా మారిపోతుంది. ఈ ఇలాకాకుండా ఉండాలంటే మార్కెట్లో దొరికే రిమూవబుల్ వాల్ స్టిక్కర్స్‌ని తెచ్చి వంటిగదిలో వేయండి. వీటిపై జిడ్డు పడినా ఈజీగా తుడిచేయొచ్చు. ఇందులోనూ ఎన్నో రంగులూ, డిజైన్లు ఉన్నాయి మీకు నచ్చింది ఎంచుకోవచ్చు. అలానే జిడ్డు బాగా పేరుకుననేట్లయితే కాస్త వంటసోడాలో రెండు చుక్కల డిష్‌వాష్ లిక్విడ్ చేర్చి ఆ ప్రదేశంలో రాయండి. ఓ పదినిమిషాలయ్యాక పీచుతో రుద్ది, కడిగే యండి. సులువుగా పోతుంది. అలానే టూత్‌పేస్ట్‌తోనూ జిడ్డు వ్యర్థాలను సులువుగా వదిలించొచ్చు. అదెలా గంటారా? ఓ గిన్నెల్లో కాస్త పేస్ట్, పావుకప్పు బేకింగ్ సోడా, కొద్దిగా వినెగర్‌కలిపి గోడలకు పటించండి. ఆపై స్క్రబర్‌తో రుద్ది వేణ్నీళ్లతో శుభ్రం చేస్తేసరి. తళతళలాడ తాయి. ఈ మిశ్రమంతో రంగు మారిన వైట్ మిక్సీ, గ్రైండర్లను రుద్ది తుడిస్తే కొత్తగా కనిపిస్తాయి. ఓసారి ప్రయత్నించి చూడండి. □



## ఒత్తిడితో ఒంటి నొప్పులు వస్తాయి!

**వ్యథ**

ప్రశ్న: నా వయస్సు 63 ఏళ్లు. ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాను. నాకు శ్వాస సంబంధిత, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నాయి. వైద్యుల సూచన మేరకు చికిత్స తీసుకుంటున్నాను. భర్త చనిపోయారు. పిల్లలు దూరంగా ఉంటున్నారు. దీంతో ఒంటరితనం, భయం, ఆందోళన, ప్రతికూల ఆలోచ నలు నన్ను వెంటాడుతున్నాయి. నిద్రలేమి కూడా సమస్యగా మారింది. వైద్యులు సూచించిన ఇతర మందులతో పాటు మల్టీ విటమిన్ మాత్రలు కూడా వాడుతున్నాను. అయినప్పటికీ కీళ్ల, కాళ్ల నొప్పులు తగ్గడం లేదు. ఇటీవల ఒక సైకాలజిస్ట్ వద్ద కౌన్సెలింగ్ తీసుకున్నాను. ఆయన సూచన మేరకు హోమియో వైద్యుడిని సంప్రదించి భయం, ఆందోళన తగ్గేందుకు మందులు వాడాను. ఆశ్చర్యకరంగా నా ఒంటి నొప్పులు చాలా వరకు తగ్గాయి. నిద్ర కూడా మెరుగు పడింది. భయం, ఆందోళన తగ్గితే శారీరక నొప్పులు కూడా తగ్గుతాయా? నా సందేహాన్ని నివృత్తి చేయండి.

- ప్రభావతి, విజయవాడ



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు



జవాబు: అమ్మా! జీవిత భాగస్వామిని కోల్పోవడం, పిల్లలు దూరంగా ఉండటం, వయసుతో పాటు వచ్చే ఆరోగ్య సమస్యలు మనసుపై ప్రభావం చూపుతాయి. వీటివల్ల ఒంటరితనం, అభద్రతాభావం, భయం, ఆందోళన, ప్రతికూల ఆలోచనలు పెరిగి మానసిక ఒత్తిడికి దారితీయవచ్చు. ఈ ఒత్తిడి నిద్రపై ప్రభావం చూపడమే కాకుండా, శారీరక నొప్పులను కూడా తీవ్రతరం చేయవచ్చు. మనసుకు, శరీరానికి విడదీయలేని సంబంధం ఉంది. మనం ఆందోళనకు గురైనప్పుడు శరీరంలో అడ్రినలిన్, కార్టిసాల్ వంటి ఒత్తిడికి సంబంధించిన హార్మోన్లలో మార్పులు చోటుచేసుకుంటాయి. దీనివల్ల కండరాలు బిగుసుకుపోవడం, అలసట, తలనొప్పి, కండరాల నొప్పులు, నిద్రలేమి వంటి సమస్యలు ఏర్పడవచ్చు. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల నొప్పులను తట్టుకునే సామర్థం కూడా తగ్గవచ్చు. ఫలితంగా అప్పటికే ఉన్న నొప్పులు మరింత తీవ్రంగా అనిపించవచ్చు. ఈ లక్షణాలను సాధారణంగా సైకోసోమాటిక్ లక్షణాలు అంటారు. అయితే ప్రతి నొప్పీ మానసిక ఒత్తిడి వల్లే వస్తుందని భావించకూడదు. మీకు చికిత్స చేస్తున్న వైద్యుని సలహాలు పాటించండి. మీ నొప్పులు, ఇతర విషయాలను గూర్చి ఆయనకు చెప్పండి. ఆయన సూచనలతో ఆహార నియమాలు పాటిస్తూ తేలిక పాటి వ్యాయామాలు లేదా యోగాసనాలు సాధన చేయండి. ధ్యానం, ప్రాణాయామం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఒకే సమయానికి నిద్రపోవడం అలవాటు చేసుకోండి. సామాజిక సంబంధాలు మెరుగుపరచుకోండి. అయితే ఇతరులతో మాట్లాడే సమయంలో బాధలు కాకుండా సానుకూల అంశాలు పంచుకోవడం మంచిది. మీ ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన పెంచుకుని జాగ్రత్తలు పాటించండి. □

## 'స్ట్రీట్ ఫైటర్' 16న తెలుగు, ఇంగ్లీష్, హిందీ, తమిళంలో విడుదల



ప్రముఖ నిర్మాణ సంస్థలు పారామౌంట్ పిక్చర్స్, లెజెండరీ ఎంటర్‌టైన్ మెంట్ రూపొందించిన యాక్షన్ చిత్రం 'స్ట్రీట్ ఫైటర్' విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా అక్టోబర్ 16న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో గిదిలి చైనీస్ థియేటర్‌లో ఈ సినిమా ప్రీమియర్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటులు నోహ్ సెంటినియో, ఆండ్రూ కోజి, జాసన్ మోమోవా, 50 సెంట్, రోమన్ రీన్స్‌తో పాటు భారతీయ యాక్షన్ హీరో విద్యుత్ జమాల్, ఇతర చిత్ర బృందం పాల్గొన్నారు. ఈ సినిమా తొలి స్పందనలు కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు, హాస్యం, 90ల నాటి జ్ఞాపకాలను గుర్తుచేసే సన్నివేశాలు, ప్రముఖ వీడియో గేమ్‌కు దగ్గరగా కథను తెరకెక్కించిన విధానం విమర్శకులను ఆకట్టుకుంటున్నాయి. సినీ విశ్లేషకుడు బ్రాండన్ డేవిస్ ఈ సినిమాను విన్నర్‌గా అభివర్ణించారు. 90ల నాటి వాతావరణం, వినోదం, నటీనటుల ప్రదర్శన ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. ఆండ్రూ కోజి ర్యూ పాత్రలో బాగా నటించారని, రోమన్ రీన్స్ అకుమా పాత్రలో భయపెట్టేలా కనిపించారని ప్రశంసించారు. థామస్ అనే మరో సినీ విశ్లేషకుడు 'స్ట్రీట్ ఫైటర్'ను అత్యుత్తమ వీడియో గేమ్ ఆధారిత చిత్రాల్లో ఒకటిగా అభివర్ణించారు. గేమ్‌లోని ప్రత్యేకతలను సినిమాలో చక్కగా చూపించారని, దర్శకుడు కిటావో సకురాయ్ నటీనటుల నుంచి మంచి ప్రదర్శన రాబట్టారని పేర్కొన్నారు. కాలినా లియాంగ్, కోడి రోడ్స్ నటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. ఏజే గలియార్డీ కూడా ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు.

## 'అలియాస్ రుక్మిణి' నుంచి సయ్యద్ ఫస్ట్ లుక్ రిలీజ్



బ్లాక్‌బస్టర్ సక్సెస్ 'కోర్ట్ - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' తర్వాత న్యాచురల్ స్టార్ నాని యునాని మస్ ప్రొడక్షన్స్ మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో రాబోతోంది. 'అలియాస్ రుక్మిణి' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నితిన్ హీరోగా నటిస్తుండగా, 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తు న్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్న 'అలియాస్ రుక్మిణి' ఒక విలక్షణమైన కథనంతో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటోంది. తాజాగా ఈ సినిమాలో నితిన్ సరసన కథానాయికగా బాలీవుడ్ నటి ఆఫియా సయ్యద్‌ను మేకర్స్ అధికారికంగా పరిచయం చేశారు. ఈ గ్లింప్స్‌లో రుక్మిణి ఓ స్కూల్ టీచర్‌గా కనిపి స్తుంది. ఆమెను విద్యార్థులు డెవిల్, హిట్లర్, 'హోంవర్క్ పోలీస్' వంటి పేర్లతో పిలుచుకుం టుంటారు. కోపంగా బోర్డుపై తన పేరు రాస్తూ, ఆ తర్వాత విద్యార్థుల వైపు ఇంటెన్స్ గా చూసే రుక్మిణి పాత్రను ఈ గ్లింప్స్ పరిచయం చేస్తోంది. కమాండింగ్, ఆరోగెంట్ 'హేవియర్ రుక్మిణి పాత్రలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. అందంగా కనిపిస్తూనే, ఆరోగెన్స్ తో కూడిన రుక్మిణి పాత్రకు ఆఫియా సయ్యద్ చక్కగా సరిపోయారు. ఈ గ్లింప్స్‌లో ఆమె లుక్, అభినయం ఆకట్టుకుంటు న్నాయి. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. దానికి వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్‌తో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ప్రేమకథా అంశాలతో పాటు ఆసక్తికరమైన ప్రధాన సంఘర్షణతో కూడిన కథలో నితిన్‌ను సరికొత్త అవతార్‌లో చూపిం చనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు కూడా మంచి స్పందన వచ్చింది.

తెర

## శివాజీ, బాలాజీ వి ఆర్, సినిమాస్ షూటింగ్ పూర్తి

శివాజీ, బాలాజీ వి ఆర్, STBL సినిమాస్, ప్రొడక్షన్ నెం 1, యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ షూటింగ్ పూర్తి డిసెంబర్‌లో గ్రాండ్ రిలీజ్ శివాజీ ప్రధాన పాత్రలో STBL సినిమాస్ నిర్మాణ సంస్థ తొలి చిత్రంగా తెరకెక్కుతున్న సినిమా షూటింగ్ పూర్తయింది. రవికృష్ణ, కసిరెడ్డి, భరణ్, ఖుష్బూ, రాధ్య, మోనిక కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి వర్కింగ్ టైటిల్ M3. 72 రోజుల పాటు సాగిన షూటింగ్‌ను చిత్ర యూనిట్ విజయవంతంగా పూర్తి చేసింది.

షూటింగ్ పూర్తయిన సందర్భంగా విడుదల చేసిన ఈ పోస్టర్‌లో శివాజీ సంప్రదాయ దుస్తుల్లో హుందాగా కనిపించారు. శివాజీ పాత్ర ఎలా ఉండబోతోందన్న ఆసక్తిని ఈ లుక్ మరింత పెంచుతోంది. STBL Cinemas సంస్థ ద్వారా బాలాజీ జు.శి. దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని మంచి యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు. కుటుంబ కథా చిత్రాలు తగ్గుతున్న ప్రస్తుత రోజుల్లో, కుటుంబంలోని ప్రతి ఒక్కరూ కలిసి చూసి ఆనందించేలా, మంచి సందేశంతో పాటు ఆద్యంతం నవ్వులు పూయించే విధంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ చిత్రానికి ప్రవీణ్ కె. పోతునూరి సంగీతం అందిస్తునారు. వెంకట్ డీవోపీ గా పని చేస్తున్నారు. అశోక్ వడ్లమూడి, భాను మొగలిపువ్వు మాటలు అందిస్తున్నారు. ఈ సినిమాను డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను వెల్లడించనున్నారు.



## ప్రొడక్షన్ నెం.3 బిగ్ బడ్జెట్ పాన్ ఇండియా మూవీ డివైన్ మిస్టరీ థ్రిల్లర్ అనౌన్స్‌మెంట్



ఆది సాయికుమార్ హీరోగా త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓ భారీ సినిమా ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవు తోంది. డివైన్ మిస్టరీ, సస్పెన్స్ తో కూడిన ప్రపంచం లోకి ప్రేక్షకులను తీసుకెళ్లనుంది. ప్రొడక్షన్ నంబర్ 3గా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని ప్రశాంత్ జి రుద్రప్ప నిర్మిస్తు న్నారు. నవరసన్ కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తు న్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు బి. అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి సంగీతం అందిసున్నారు. దైవిక రహస్యాల నేపథ్యం లో సాగే థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా.. ఆధ్యాత్మికత, విశ్వాసం, ప్రాచీన నమ్మకాలు, అంతుచిక్కని రహస్యాలతో కూడిన విభిన్నమైన సినీ ప్రపంచాన్ని పరిచయం చేయనుంది. ఈ సినిమా అనౌన్స్మెంట్ పోస్టర్ డార్క్, మిస్టరీ వాతావరణంతో పాటు ఉత్కంఠను రేకెత్తిస్తోంది. అతీంద్రియ రహస్యాలతో ముడిపడిన కథను ఈ పోస్టర్ సూచిస్తోంది. పోస్టర్ మధ్యలో త్రిశూలం చుట్టూ చుట్టుకుని, పడగ విప్పిన భారీ నాగుపాము అద్భుతమైన దృశ్యాన్ని ఆవిష్కరి స్తోంది. .దట్టమైన చీకటితో నిండిన అడవిలోని పురాతన ఆచారాలు కలిగిన ప్రదేశాన్ని తలపించేలా పోస్టర్‌ను రూపొం దించారు. వేలాడుతున్న గంటలు, మెలికలు తిరిగిన చెట్ల కొమ్మలు, వెలుగుతున్న దీపాలు మర్మమైన వాతావరణాన్ని మరింత పెంచుతున్నాయి. పోస్టర్ దిగువన రంగురంగుల పూల మధ్య కనిపించే చిన్న జ్వాల.. ముదురు నీలం, అగ్నిలాంటి ఎరుపు రంగులతో నిండిన విజువల్ ఆసక్తికరంగా వుంది. ఈ సినిమా నెక్స్ట్ అప్‌డేట్‌ను అక్టోబర్ 20, 2026న వెల్లడించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

## అల్లు అర్జున్ - లోకేష్ కనగరాజ్ AA23 పై స్పెషల్ విశేషాలు



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా స్టార్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ తెరకెక్కించనున్న చిత్రం AA23. ఈ మూవీ ప్రకటనతో రీసెంట్‌గా సోషల్ మీడియా లో భారీ సందడి నెలకొన్న సంగతి తెలిసిందే.. ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచి దేశ వ్యాప్తంగా సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. అల్లు అర్జున్, లోకేష్ కనకరాజ్ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా రాబోతుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై హ్యూజ్ ఎక్స్‌పెక్టేషన్స్ క్రియేట్ అయ్యాయి. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ కంపోజ్ చేసిన అనౌన్స్‌మెంట్ సాంగ్ విడుదలైన కొద్ది సేపటికే సోషల్ మీడియా లో వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రియు ల మధ్య ఈ పాట హాట్ టాపిక్‌గా నిలిచింది. భారీ స్థాయిలో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌లో అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్, అనిరుధ్ వంటి స్టార్స్ వర్క్ చేస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని విశేషాలు ఎప్పుడు వెల్లడవుతాయా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా దర్శకుడు లోకేష్ కనగరాజ్ AA23 సినిమాకు సంబంధించి ఓ స్పెషల్ అప్‌డేట్‌ను షేర్ చేసి సినిమాపై ఆసక్తిని మరింత పెంచారు. లోకేష్ కనగరాజ్ షేర్ చేసిన ఫొటోలో అల్లు అర్జున్‌కు ఆయన ఏదో వివరిస్తూ కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అప్‌డేట్‌తో అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొనగా.. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించి మరిన్ని ఆసక్తికరమైన విశేషాలు వెలువడనున్నాయి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తనదైన కథాకథనాలతో, వైవిధ్యమైన మేకింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో AA23 తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా.. అల్లు అర్జునకు అత్యంత సన్నిహితులైన నలుగురు ఈ ప్రాజెక్ట్‌లో సహ నిర్మాతలుగా భాగమయ్యారు. బన్నీ వాస్, సందీప్ రామినేని, నటరాజ్, స్వాతి సహ నిర్మాతలుగా ఈ చిత్ర నిర్మాణంలో భాగమయ్యారు.

## 'గలివిడి లక్ష్మి' సినిమా ప్రి రిలీజ్



ప్రి రిలీజ్ ప్రెస్‌మీట్‌లో నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి గరివిడి లక్ష్మి కొత్త రకమైన ప్రయత్నం. మా అమ్మాయి మొదట ప్రారంభించిన సినిమా ఇది. గత పది రోజులుగా ఈ సినిమాకు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటివరకు సినిమా చూసిన అందరూ చాలా మంచి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. ప్రేక్షకులు కూడా 17వ తేదీన ఈ సినిమా చూసి ఆదరిస్తారని కోరుకుంటున్నాను. హీరోయిన్ ఆనంది మాట్లాడుతూ.. సినిమా చూసిన అందరి కళ్లల్లో నీళ్లు చూసినప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. మేము అనుకున్నదాన్ని తెరపై చూపించగలిగామనిపించింది. ఆడియన్స్ కామెంట్స్ చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఈ సినిమాను ఎంతగానో తమ సొంతం చేసుకున్నారని అర్థమైంది. రాగ్ మయూర్ మాట్లాడుతూ.. నిన్న రాత్రి ప్రీమియర్స్ జరిగాయి. అక్కడ స్పందన చూస్తుంటే పట్టలేనంత ఆనందం కలిగింది. ఒక కంప్లీట్ సినిమా ఇచ్చా మనే సంతృప్తి ఉంది. ఆడియన్స్ నుంచి నిన్న వచ్చిన స్పందనతో రాత్రి నిద్ర పట్టలేదు. డైరెక్టర్ గౌరి నాయుడు జమ్ము మాట్లాడుతూ.. మా సినిమాను పెద్ద మనసుతో ప్రోత్సహిస్తున్న అందరికీ హృదయపూర్వక నమస్కారం. నిన్న ప్రీమియర్ షోలో సినిమా చూసిన అందరూ చాలా ఆనందాన్ని వ్యక్తం చేశారు. వాళ్ల స్పందన చూస్తుంటే మాకు చాలా ఆనందం కలిగింది. మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్ మాట్లాడుతూ.. పాటను ప్రేమించిన ప్రతి కళాకారుడి హృదయంలో ఈ సినిమా నిలిచిపోతుంది. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన విశ్వ ప్రసాద్‌కి, కృతికి, మా డైరెక్టర్ కి థ్యాంక్యూ.

## రెజ్లింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్..

# ఫైనల్‌కు విశ్వజిత్



**లాస్ వెగాస్:** అమెరికాలోని లాస్ వెగాస్‌లో జరుగుతున్న అండర్23 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత ఆటగాడు విశ్వజిత్ మోర్ చరిత్ర సృష్టించాడు. గ్రీకోరోమన్ విభాగంలో దేశం తరఫున మొట్టమొదటి ఫైనలిస్ట్‌గా నిలిచాడు. రష్యాకు చెందిన మాలిక్ గిగేవ్‌ను 7-4 తేడాతో ఓడించిన తర్వాత మోర్ పురుషుల 55 కేజీల విభాగం ఫైనల్‌కు చేరుకున్నాడు. అతను ఇప్పుడు గురువారం చరిత్ర సృష్టించే స్థానం కోసం జార్జియాకు చెందిన కోబా కరుమిడ్జేతో తలపడతాడు. ఫైనల్‌కు చేరే క్రమంలో మోర్ హోరాహోరీ పోరాటాలు చేశాడు. అతను మెక్సికోకు చెందిన ఐజాక్ మారిన్ మాతాను 10-8 తేడాతో ఓడించిన తర్వాత, క్వార్టర్ ఫైనల్‌లో ఇరాన్‌కు చెందిన గీ20 ప్రపంచ ఛాంపియన్ ఆర్మిన్ షమ్సిపూర్‌ను 8-1 తేడాతో ఏకపక్షంగా ఓడించాడు. మరోవైపు, ఇతర భారతీయ రెజ్లర్లు తమ తొలి రౌండ్ పోరులలో ఓడిపోయి, ప్రభావం చూపడంలో విఫలమయ్యారు. పురుషుల 63 కేజీల విభాగంలో చేతన్, అమెరికాకు చెందిన డ్రూరీ ఎల్ చేతిలో ఓడిపోగా, సాగర్ సింగ్ (67 కేజీలు) జపాన్‌కు చెందిన టి సుజుకి చేతిలో ఓటమి పాలయ్యాడు. సౌరవ్ రాణా (72 కేజీలు), కరణ్ కంబోజ్ (87 కేజీలు) కూడా తమతమ బౌట్‌లలో ఓడిపోయారు.

## డెన్మార్క్ ఓపెన్: తొలి రౌండ్‌లో

# ఆయుష్ నిష్క్రమణ



**ఒడెన్స్ / డెన్మార్క్:** భారత షట్లర్ ఆయుష్ శెట్టి బుధవారం డెన్మార్క్ ఓపెన్ 2026 లో ఇండోనేషియాకు చెందిన అల్వి ఫర్హాన్ చేతిలో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. గంటకు పైగా సాగిన మూడు గేమ్‌ల రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో, ఇండోనేషియాకు చెందిన 2023 జూనియర్ ప్రపంచ ఛాంపియన్ 21-11, 13-21, 21-10 తేడాతో విజయం సాధించారు. 21 ఏళ్ల ఆయుష్ నిష్క్రమణతో, భారత్ తరఫున పురుషుల సింగిల్స్ ఈవెంట్‌లో కిదాంబి శ్రీకాంత్ మాత్రమే పోటీలో మిగిలాడు. జపాన్‌లోని ఐచినగోయాలో జరిగిన 2026 ఆసియా క్రీడల్లో ఆయుష్ భారత పురుషుల జట్టులో భాగంగా కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. న్యూఢిల్లీలో జరిగిన 2026 బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో, ఆయుష్ తన అరంగేట్రంలోనే అప్పటి ప్రపంచ నంబర్ 1 షి యుకిని ఓడించి ఒక పెద్ద సంచలనం సృష్టించాడు.

# శ్రీలంక 8 వికెట్ల తేడాతో విజయం

## 2-1తో పాకిస్థాన్ టి20 సిరీస్ కైవసం

**రావల్పిండి:** రావల్పిండిలో జరిగిన మూడవ, చివరి టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో, కెప్టెన్ కుసల్ మెండిస్ అజేయంగా 87 పరుగులు చేసి శ్రీలంకను పాకిస్థాన్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించేలా నడిపించాడు. అయితే, అదే వేదికపై జరిగిన మొదటి, రెండు మ్యాచ్‌లలో గెలిచిన పాకిస్థాన్, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఇక చివరి మ్యాచ్‌లో 169 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, శ్రీలంక కేవలం 17.1 ఓవర్లలోనే రెండు వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. కుసల్, కమిందు మెండిస్ మూడో వికెట్ కు అజేయంగా 98 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి, అతిథి జట్టుకు ఓదార్పు విజయాన్ని అందించారు. ఒక పరుగుకే ఔటవడంతో శ్రీలంకకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఆ తర్వాత సినెత్ జయవర్ధన, కుసల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించేందుకు పూనుకున్నారు. రెండో వికెట్‌కు 59 పరుగులు జోడించిన తర్వాత 38 పరుగులు చేసిన జయవర్ధనను అరఫత్ మిన్హాస్ ఔట్ చేశాడు. కుసల్ 48 బంతుల్లో తొమ్మిది ఫోర్లు, నాలుగు సిక్సర్లతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడి జట్టును ముందుండి నడిపించాడు. కమిందు 40 పరుగులతో నాటౌట్‌గా నిలిచి అతనికి మద్దతుగా నిలవగా, శ్రీలంకసునాయాసంగా ఛేజింగ్‌ను పూర్తి చేసింది. అంతకుముందు, బ్యాటింగ్ కు దిగిన పాకిస్థాన్ ఎనిమిది వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. సాహిబ్జాదా ఫర్హాన్ 76 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలవగా, అరాఫత్ 34 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో పాకిస్థాన్ 102 పరుగులకే 6వికెట్లు కోల్పోయింది, కానీ ఫర్హాన్, అరాఫత్‌లు ఏడవ వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఇన్నింగ్స్‌ను ఆదుకున్నారు. లంక తరఫున, దాసున్ షనక 21 పరుగులకు 3 వికెట్లు పడగొట్టగా, నువాన్ తుషార మరియు ఈషాన్ మలింగ చెరో 2 వికెట్లు తీసుకున్నారు.








# స్వియాటెక్ 40వ విజయం

## సామ్సోనోవా ఓటమి

**వుహాన్:** ఇగా స్వియాటెక్ ఈ సీజన్‌లో తన 40వ విజయాన్ని నమోదు చేసుకోగా, ఎలినా స్విటోలినా బుధవారం వుహాన్ ఓపెన్‌లో లియుడ్మిలా సామ్సోనోవాతో జరిగిన మూడు సెట్ల పోరులో పోరాడి మూడవ రౌండ్‌కు చేరుకుంది. సీజన్ చివరి దశలలో తమ స్థానాలను పటిష్టం చేసుకోవాలని చూస్తున్న ఈ ఇద్దరు క్రీడాకారిణులు, సీజన్ ముగింపులో జరిగే డబ్ల్యూటిఎ ఫైనల్స్‌కు అర్హత సాధించే పోటీలో నిలిచారు. ఒక గంట 43 నిమిషాల పాటు సాగినట్లు చెప్పబడిన మ్యాచ్‌లో, ఏడవ సీడ్ స్వియాటెక్ తన తోటి పోలాండ్ క్రీడాకారిణి మగ్దలేనా ఫ్రెచ్‌ను 6-2, 6-1 తేడాతో ఓడించింది. ఈ విజయంతో ఆమె డబ్ల్యూటిఎ 1000 ఈవెంట్లలో తన కెరీర్‌లో 149వ విజయాన్ని నమోదు చేసింది. మూడవ రౌండ్‌లో స్వియాటెక్ తదుపరి ఆష్లిన్ క్రూగర్ లేదా లాన్లానా టారరుడీలలో ఒకరిని ఎదుర్కొంటుంది. మరోవైపు, ఐదవ సీడ్ స్విటోలినా రష్యాకు చెందిన సామ్సోనోవాను 6-2, 5-7, 6-2 తేడాతో ఓడించి తదుపరి రౌండ్‌లో స్థానం సంపాదించింది. తొలి సెట్ గెలుచుకున్న తర్వాత, ఉక్రెయిన్ క్రీడాకారిణి రెండో సెట్‌లో తన ఆధిక్యాన్ని కోల్పోయింది. దీంతో సామ్సోనోవా రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక సెట్‌కు దారితీసింది. చివరి సెట్‌లో పుంజుకున్న స్విటోలినా విజయాన్ని కైవసం చేసుకుని, సామ్సోనోవాపై తన హెడ్‌టుహెడ్ రికార్డును 2-0కి పెంచుకుంది.

# వెస్టిండీస్ చేతిలో ఇండియా చిత్తు

## వరల్డ్ ఛాంపియన్‌షిప్ నుండి భారత్ ఔట్

**షార్జా:** వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ 2026లో ఇండియా ఛాంపియన్స్ ప్రయాణం ముగిసింది. షార్జా వేదికగా జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ ఛాంపియన్స్ చేతిలో 6 వికెట్ల తేడాతో చిత్తు చిత్తుగా ఓడిపోయింది. దీంతో ఈ టోర్నీలో ఇండియా ఛాంపియన్స్ సెమీస్‌కు చేరకుండానే నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో రిషి ధావన్ (34), హర్భజన్ సింగ్ (28 నాటౌట్)లు రాణించారు. రాబిన్ ఉతప్ప (19) పర్వాలేనిపించగా ఓపెనర్ నమన్ ఓజా, వన్‌డౌన్ బ్యాటర్ అంబటి రాయుడు డకౌట్లు అయ్యారు. స్టువర్ట్ బిన్ని (1), యువరాజ్ సింగ్ (4), యూసఫ్ పఠాన్ (11) లు ఘోరంగా విఫలం అయ్యారు. ఓ దశలో 47 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఇండియా ఛాంపియన్స్ వంద పరుగులు చేయడం కూడా కష్టమే అని అనిపించింది. రిషి ధావన్, హర్భజన్ సింగ్ రాణించడంతో 100 పరుగులు దాటింది. వెస్టిండీస్ బౌలర్లలో రయాద్ ఎమ్రిట్ 2వికెట్లు తీయగా, ఫిడెల్ఎడ్వర్డ్స్, షెల్డన్ కాట్రెల్, రేమన్ రీఫర్, కార్లోస్ బ్రాత్ వైట్, నికితా మిల్లర్‌లు తలా ఓవికెట్ పడగొట్టారు. అనంతరం 111 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని వెస్టిండీస్ 14.5 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి ఛేదించింది. వెస్టిండీస్ బ్యాటర్లలో క్రిస్ గేల్ (1), జెర్మైన్ బ్లాక్‌వుడ్ (5) లు విఫలమైనా చాడ్విక్ వాల్టన్ (60) హాఫ్ సెంచరీతో రాణించాడు. అతడికి లెండల్ సిమన్స్ (22) చక్కని సహకారం అందించారు. భారత బౌలర్లలో ధావల్ కులకర్ణి రెండు వికెట్లు తీశాడు. రిషి ధావన్, పీయూష్ చావ్లా చెరో వికెట్ పడగొట్టారు.





## భగ్గుమన్న చమురు ధరలు

# 110 డాలర్ల దిశగా పరుగు

## మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు



**లండన్, అక్టోబరు 14:** అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు మరోసారి భగ్గుమంటున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల కారణంగా సరఫరాపై ఆందోళనలు పెరగడంతో, క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 110 డాలర్ల సమీపానికి దూసుకెళ్తోంది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 106.58 డాలర్ల వద్ద ఉండగా, యుఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూఐ) 94.94 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. సౌదీ అరేబియాలోని చమురు క్షేత్రాలే లక్ష్యంగా దాడులు జరగడం, వ్యూహాత్మక హార్మూజ్ జలసంధిలో రవాణాకు ముప్పు పొంచి ఉండటం వంటి పరిణామాలు ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై దాడులను తీవ్రతరం చేశారు. అక్టోబరు 13న ధహ్రాన్‌లోని సౌదీ అరామ్‌కో పరిపాలన భవనంపై అనుమానిత దాడి జరగడం, స్వల్పంగా అగ్నిప్రమాదం సంభవించడంతో ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తిదారుల్లో ఒకటైన సౌదీలో భద్రతపై ఆందోళనలు వెల్లువెత్తాయి. మరోవైపు, ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్మూజ్ జలసంధిలో ట్యాంకర్లపై దాడులు జరుగుతాయేమోనన్న భయాలు సరఫరా గొలుసును దెబ్బతీస్తున్నాయి. ఇక్కడి అనిశ్చితి కారణంగా రవాణా ఆలస్యమైతే, ఉత్పత్తి సాధారణంగా ఉన్నప్పటికీ మార్కెట్‌లో కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే ట్రేడర్లు భయాందోళనలకు గురవుతున్నారు. రష్యా నుంచి డీజిల్ ఎగుమతులు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, పశ్చిమాసియాలో నెలకొన్న ప్రమాద తీవ్రతను అది భర్తీ చేయలేకపోవచ్చని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ ధరల పెరుగుదల ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడనుంది. దేశీయ అవసరాల్లో అధిక శాతం ముడిచమురును దిగుమతి చేసుకునే భారత్‌కు, ధరలు పెరిగితే దిగుమతి బిల్లు భారీగా పెరుగుతుంది. ఇది వాణిజ్య లోటును పెంచి, రూపాయి విలువపై ఒత్తిడికి దారితీస్తుంది. మరోవైపు, చమురు మార్కెటింగ్ కంపెనీలపై భారం పడటంతో పాటు, రవాణా, ఉత్పాదక వ్యయాలు పెరిగి ద్రవ్యోల్బణం మరింత ఎగబాకే ప్రమాదం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారితేనేగానీ చమురు ధరలు దిగివచ్చే అవకాశం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రపంచంలోనే టాప్ కంపెనీల చిప్స్ భారత్‌లోనే డిజైన్

### కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్



**న్యూఢిల్లీ, అక్టోబరు 14:** ప్రపంచ సాంకేతిక రంగంలో భారత్‌ను కీలక శక్తిగా నిలబెట్టేదిశగా దేశం అత్యంత పరిణతితో, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌' సదస్సులో మంత్రి పాల్గొని 'సాంకేతిక సార్వభౌమత్వం' అనే అంశంపై మాట్లాడారు. టెక్ సార్వభౌమత్వాన్ని సంపూర్ణ స్వావలంబన కోణంలో కాకుండా వ్యూహాత్మక పరస్పర ఆధారపడటం, పటిష్టమైన సరఫరా వ్యవస్థల దృక్కోణంలో చూడాల్సిన అవసరంఉందన్నారు. ఏయే రంగాల్లో ఉత్పత్తి, డిజైనింగ్, పూర్తిస్థాయి ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ సామర్థ్యాలు మన దేశంలోనే ఉండాలి.. ఏయే అంశాల్లో ఇతర దేశాలపై ఆధారపడాలనే స్పష్టత ప్రభుత్వానికి ఉందని తెలిపారు. టెక్నాలజీ అనేది ఎల్లప్పుడూ ప్రపంచ సరఫరా గొలుసుతో ముడిపడి ఉంటుందని, ఆ విలువైన వ్యవస్థలో భారత్ కీలక భాగస్వామిగా ఉంటూ అత్యున్నత విలువను జోడించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యంగా సెమీకండక్టర్ రంగాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ ప్రస్తుతం ప్రపంచ దిగ్గజ సంస్థలైన ఎన్విడియా, క్వాల్‌కామ్, ఏఎండి వంటి బడా కంపెనీలకు చెందిన సరికొత్త 2నానోమీటర్, 3నానోమీటర్ చిప్‌లన్నీ భారతదేశంలోనే డిజైన్ అవుతున్నాయని మంత్రి వెల్లడించారు. చిప్ డిజైనింగ్ రంగంలో భారత్ ఇప్పటికే అంతర్జాతీయ కేంద్రంగా నిలిచిందని, ఆ తర్వాత దశలైన సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ (ఎఫ్‌ఎబి), ఎటిఎంపి (అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్) పూర్తిస్థాయి ప్రోడక్ట్ డిజైనింగ్ దిశగా దేశం సహజమైన పురోగతిని సాధిస్తోందని వివరించారు.

# నష్టాల్లో ముగిసిన మార్కెట్లు




## సెన్సెక్స్ 252 పాయింట్లు, నిఫ్టీ 99 పాయింట్లు నష్టం

**ముంబై, అక్టోబరు 14:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాలతో ముగిశాయి. ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) షేర్లలో కొనుగోళ్ల మద్దతు నష్టాలను కొంతమేర పరిమితం చేసింది. వరుస లాభాల తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మార్కెట్లు ఒడుదొడుకులకు లోనయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బిఎస్‌ఇ సెన్సెక్స్ 251.89 పాయింట్లు (0.34శాతం) నష్టపోయి 72,781.89 వద్ద స్థిరపడింది. అదేవిధంగా ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 99.25 పాయింట్లు (0.44శాతం) క్షీణించి 22,622.70 వద్ద ముగిసింది. నిఫ్టీ కీలకమైన 22,650 స్థాయికి దిగువన ముగియడం గమనార్హం. సెన్సెక్స్ 30 షేర్లలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టిసిఎస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్‌టిపిసి వంటివి ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసిఐసిఐ బ్యాంక్ షేర్లు నష్టపోయి సూచీపై ఒత్తిడి పెంచాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, బజాజ్ ఫైనాన్స్ టాప్ లూజర్లుగా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ హెల్త్‌కేర్ సూచీలు అత్యధికంగా నష్టపోయాయి. అయితే, నిఫ్టీ ఐటి ఇండెక్స్ లాభాలతో ముగిసి మార్కెట్లకు కొంత అండగా నిలిచింది. ప్రధాన సూచీలతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా బలహీనపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.08శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.32శాతం మేర నష్టపోయాయి.



## తగ్గిన బంగారం ధరలు!

**హైదరాబాద్, అక్టోబరు 14:** పండుగ సీజన్‌లో బంగారం కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు ఇది శుభవార్త. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పసిడి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ విలువ బలపడటంతో బంగారం ధరలపై ఒత్తిడి పెరిగిందని, తత్ఫలితంగానే ఈ ధరల తగ్గుదల నమోదైందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. పండుగ వేళ ధరలు తగ్గడం సామాన్య వినియోగదారులకు కొంత ఊరటనిచ్చే పరిణామం. బుధవారంహైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,280 పలికింది. అదేవిధంగా, 10 గ్రాముల 22క్యారెట్ల పసిడిధర రూ.1,36,840గా ఉండగా, 18 క్యారెట్ల ధర రూ.1,11,960 వద్ద కొనసాగింది. మరోవైపు వెండిధరలో పెద్దగా మార్పులు చోటు చేసుకోలేదు. కిలో వెండి ధర రూ.2,44,900 వద్ద స్థిరంగా ఉంది. దేశంలోని ఇతర మెట్రో నగరాలైన ముంబై, బెంగళూరు, చెన్నైలలోనూ ఇదే స్థాయి ధరలు కొనసాగుతుండగా, జాతీయ రాజధాని ఢిల్లీలో మాత్రం పసిడి ధర స్వల్పంగా అధికంగా ఉండి రూ,1,49,430గా నమోదైంది.

# ఆహారం నుంచి ఇంధనం వరకు ధరల మంటలు

## సెప్టెంబరులో 11.39 శాతానికి చేరిన టోకు ద్రవ్యోల్బణం!




**ముంబై, అక్టోబరు 14:** దేశంలో ద్రవ్యోల్బణం ఆందోళన కలిగిస్తోంది. 2026 సెప్టెంబరులో టోకు ద్రవ్యోల్బణం (డబ్లున్యపిఐ) 11.39 శాతానికి చేరింది. ఆగస్టులో ఇది 9.92 శాతంగానమోదైంది. ఆహార పదార్థాలు, ఇంధనం, విద్యుత్‌తో పాటు పరిశ్రమల్లో తయారయ్యే వస్తువుల ధరలు పెరగడంతో ద్రవ్యోల్బణం మరింత ఎగబాకింది. మరోవైపు, రిటైల్ ద్రవ్యోల్బణం కూడా పెరగడంతో సామాన్య ప్రజలు, వ్యాపారులు ధరల మార్పులపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, సెప్టెంబర్‌లో ఆహార సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 8.66 శాతానికి పెరిగింది. ఆగస్టులో ఇది 7.05 శాతంగా ఉంది. దీంతో ఆహార పదార్థాల ధరలపై ద్రవ్యోల్బణ ఒత్తిడి పెరిగినట్లు స్పష్టమవుతోంది. నిత్యావసర ఆహార పదార్థాల ధరలు పెరిగితే కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే, టోకు ధరలు పెరిగినంత మాత్రాన ప్రతి వస్తువు రిటైల్ ధరకూడా అదే స్థాయిలో పెరుగుతుందని చెప్పలేం.గత యేడాది కాలంలో టోకు ద్రవ్యోల్బణం క్రమంగా పెరుగుతూ వచ్చింది. 2025 అక్టోబరులో 1.21 శాతంగా నమోదైన టోకు ద్రవ్యోల్బణం, నవంబరులో 0.32 శాతానికి చేరింది. డిసెంబరు 2025లో 0.83 శాతానికి పెరగగా, 2026 జనవరిలో 1.81 శాతం, ఫిబ్రవరిలో 2.13 శాతం, మార్చిలో 3.88 శాతంగా నమోదైంది. అనంతరం ఏప్రిల్‌లో ఒక్కసారిగా 8.26 శాతానికి పెరిగిన ద్రవ్యోల్బణం, మేలో 9.68 శాతానికి, జూన్‌లో 9.87 శాతానికి చేరింది. జులై 2026లో స్వల్పంగా తగ్గి 9.78 శాతంగా నమోదైనప్పటికీ, ఆగస్టులో మళ్లీ 9.92 శాతానికి పెరిగింది. ఇక సెప్టెంబరు 2026లో టోకు ద్రవ్యోల్బణం మరింత పెరిగి 11.39 శాతానికి చేరింది. దీంతో దేశంలో ధరల పెరుగుదలపై ఆందోళనలు మరింత పెరిగాయి.

**25.85 శాతానికి చేరిన ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం:**

ఇంధనం, విద్యుత్ విభాగంలో టోకు ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 25.85 శాతానికి చేరింది. ఆగస్టులో ఇది 22.93 శాతంగా ఉంది. ఖనిజ నూనెలు, ముడిచమురు, సహజ వాయువు, బొగ్గు, లిగ్నైట్‌ధరలు పెరగడం దీనికి ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు. ఇంధన ధరలు పెరిగితే రవాణా, ఉత్పత్తి ఖర్చులు కూడా పెరిగే అవకాశంఉంది. దీని ప్రభావం ఇతర వస్తువుల ధరలపై పడవచ్చు.

**తయారీ వస్తువుల ధరలూ పైపైకి..**

పరిశ్రమల్లో తయారయ్యే వస్తువుల టోకు ద్రవ్యోల్బణం ఆగస్టులో 8.37 శాతంగా ఉండగా, సెప్టెంబర్‌లో 9.76 శాతానికి పెరిగింది. ప్రాథమిక లోహాలు, రసాయనాలు, రబ్బరు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, విద్యుత్ పరికరాల ధరలు పెరగడం ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపింది. తయారీ రంగంలో ముడిసరుకులు, విద్యుత్, రవాణాఖర్చులు పెరిగితే ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల వ్యాపార సంస్థల నిర్వహణ వ్యయాలు కూడా అధికమవవచ్చు.

**పశ్చిమాసియా యుద్ధ ప్రభావం:**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం, హార్ముజ్ జలసంధి వద్ద సరఫరాకు ఏర్పడిన అంతరాయాలు అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం చూపినట్లు నివేదిక పేర్కొంది. దీంతో ప్రపంచ మార్కెట్లలో ముడి చమురు, ఎరువుల వ్యయాలు పెరిగినట్లు సమాచారం. అంతర్జాతీయంగా చమురు, ఎరువుల ధరలు పెరగడం భారత్‌లో ఇంధనం, వ్యవసాయ ఉత్పత్తులు, ఇతర వస్తువుల ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆహార పదార్థాలు, ఇంధనం, తయారీ వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కుటుంబాల నెలవారీ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.